# రాజకీయ కృషి: మన కృషి అంతటికీ జీవనాడి

హాంకీ (ఎర్రజెండా వ్యాసాలు)

విప్లవ రచయితల సంఘం

# రాజకీయ కృషి :
# మన కృషి అంతటికీ జీవనాడి

**హాంకీ (ఎర్రజెండా వ్యాసాలు)**

విప్లవ రచయితల సంఘం

# రాజకీయ కృషి : మన కృషి అంతటికీ జీవనాడి
హాంకీ (ఎర్రజెండా వ్యాసాలు)

**Rajakeeya Krushi : Mana Samastha Krushiki Jeevanadi**
*Hanky (Redflag Essays)*

విరసం ప్రచురణలు
Website : www. virasam. in
Mail Id : arunatara1977@gmail. com
http://www. facebook. com//arunatara. virasam

మొదటి ప్రచురణ : సెప్టెంబర్, 2014
ప్రతులు : 1000
వెల : 35/-
డిటిపి : డి. వైజయంతి
లే అవుట్ : ఆర్. భాగ్యలక్ష్మి
కవర్ డిజైన్ : క్రాంతి

చిరునామా :
పాణి
50-348, ఎల్ 19, బి-2,
అరోరా నగర్, బి క్యాంప్,
కర్నూల్ - 2.

ప్రతులకు :
అన్ని ప్రముఖ పుస్తక షాపుల్లో

ముద్రణ :
వివేక్ ఆర్ట్ ప్రింటర్స్,
అంబర్‌పేట్, హైదరాబాద్.
ఫోన్ : 8885020900

# విషయసూచిక


| | |
|---|---|
| నాలుగు ప్రాథమ్యాల అవగాహన | 4 |
| ప్రచురణ కర్తల నోట్ | 7 |
| మానవులే ప్రధానాంశం | 8 |
| రాజకీయ కృషి : మన కృషి అంతటికీ జీవనాడి | 18 |
| సైద్ధాంతిక కృషికి మొదటి స్థానాన్నివ్వాలి | 31 |
| సైద్ధాంతిక కృషి వాస్తవాల మీద ఆధారపడి ఉండాలి | 44 |

# నాలుగు ప్రాథమ్యాల అవగాహన

ఇక్కడ తెలుగులో మొదటిసారిగా అనువాదమై వస్తున్న నాలుగు వ్యాసాలు నలభై సంవత్సరాల కింద, 1964లో చైనీస్ భాషలో చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ సైద్ధాంతిక పత్రిక హాంగ్ కీ (ఎర్రజెండా) లో మొదటిసారి వెలువడ్డాయి. ఆ తర్వాత రెండు సంవత్సరాలకు ఫారిన్ లాంగ్వేజెస్ ప్రెస్, పెకింగ్ ప్రచురణగా ఇంగ్లిష్ పుస్తక రూపంలో వచ్చాయి. కాని రాసి నలభై సంవత్సరాలు గడిచినా ఇవాళ్టికీ తాజాగా, ప్రాసంగికంగా, అవసరం తీర్చేట్టుగా, ప్రయోజనకరంగా ఉన్న ఆలోచనలు ఇవి. ముఖ్యంగా భారత విప్లవోద్యమం విస్తరిస్తున్న ఈ సమయంలో విప్లవోద్యమ కార్యకర్తలూ, నాయకులూ, సానుభూతిపరులూ, సాధారణ ప్రజలూ అందరూ ఈ అవగాహనలను అధ్యయనం చేయవలసిన, మననం చేసుకోవలసిన, ఆచరణలోకి తీసుకోవలసిన అవసరం ఉంది. ఆ అవసరాన్ని తీర్చడానికే ఇప్పుడు ఈ తెలుగు ప్రచురణ.

చైనా విప్లవోద్యమ ఆచరణ క్రమంలో కా. మావో నాలుగు ప్రాథమ్యాల సిద్ధాంతాన్ని అభివృద్ధి చేశారు. ఈ నాలుగు ప్రాథమ్యాలను ప్రత్యేకంగా ప్రజా విమోచన సైన్యానికి మార్గదర్శకాలుగా రూపొందించారని ఆధారాలున్నాయి. సైనిక కార్యక్రమాలలో, పనులలో పడి కొట్టుకుపోవడం కాకుండా, పనులలో ప్రాథమికమైనవీ ప్రధానమైనవీ ఏమిటో గుర్తించి, ఆ వెలుగులో చేసే పనికి ఎక్కువ విలువా, సార్థకతా ఉంటాయనే ఆలోచనే ఈ సిద్ధాంతానికి మూలం. మనిషికీ ఆయుధాలకూ మధ్య మనిషికే ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలనీ, రాజకీయ కృషికీ ఇతర కృషికీ మధ్య రాజకీయ కృషికే ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలనీ, రాజకీయ కృషిలో సైద్ధాంతిక పార్శ్వానికీ

రోజువారీ పనులకీ మధ్య సైద్ధాంతిక పార్శ్వానికే ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలనీ, సైద్ధాంతిక కృషిలో సజీవమైన భావాలకూ పుస్తకరూపంలోని భావాలకూ మధ్య సజీవభావాలకే ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలనీ ఈ సిద్ధాంతం చెపుతుంది. మొత్తం మీద మనిషికి, రాజకీయ కృషికి, సైద్ధాంతిక అంశాలకు, సజీవమైన భావాలకు ఎప్పుడైనా ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలనేది ఈ అవగాహనలో కీలకం.

అన్యవర్గ భావజాలం వల్ల, వ్యవస్థీకృతమైన అలవాట్ల వల్ల, పాలకవర్గ ప్రచారాల వల్ల మనందరమూ కూడ ఈ నాలుగు ప్రాథమ్యాలను వదిలి భిన్నమైన ప్రాథమ్యాలకు ప్రాధాన్యత ఇవ్వడం సాధారణంగా జరుగుతుంది. మనుషులకూ ఆయుధాలకూ మధ్య ఆయుధాలదే పైచేయి అనుకుంటాం. రాజకీయ కృషి ఎంత ముఖ్యమైనదో గుర్తించకుండా ఇతర కృషితో సంతృప్తి చెందుతాం. రాజకీయ కృషి చేసేటప్పుడు కూడ సైద్ధాంతిక దృక్పథాన్ని అవలంబించకుండా రోజువారీ పనుల్లో పడి కొట్టుకుపోతుంటాం. సమాజంలో సజీవ ఆచరణ నుంచి వెలికి వస్తున్న భావాలను పుస్తకాలలో భావాలతో పోటీ పెట్టి, పుస్తకాల భావాలకే ప్రాధాన్యత ఇస్తాం. ఈ అవగాహనలు ఎలా పొరపాటు అవగాహనలో అర్థం చేసుకోవాలంటే ఈ వ్యాసాలు అధ్యయనం చేయాలి. ఈ నాలుగు వ్యాసాలూ నాలుగు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వవలసిన అంశాలను ఒక్కొక్కటిగా తీసుకుని చారిత్రక, సైద్ధాంతిక, శాస్త్రీయ నేపథ్యంతో వివరించాయి, విశ్లేషించాయి.

'మానవులే ప్రధానాంశం' అనే మొదటి వ్యాసం ఆయుధాల ప్రాధాన్యత గురించి పాలకవర్గాల దృక్పథాన్ని ఖండిస్తూ, ఆయుధశక్తి కన్న మానవశక్తి ఎలా మిన్న అవుతుందో అద్భుతంగా విశ్లేషిస్తుంది. ఇది 1964లో, మరొక సామాజిక అనుభవం నుంచి రాసినదైనప్పటికీ, ఇవాల్టికీ, మన సామాజికానుభవానికీ అక్షరాలా సరిపోతుంది. అత్యంత ఆధునిక ఆయుధాలు కలిగిన మహా బలసంపన్నమైన రాజ్యంతో పోరాడుతున్న ప్రజాఉద్యమం ఆయుధ శక్తిలో సరిపోలుతుందా అనీ, ఎప్పటికైనా విజయం సాధించగలుగుతుందా అనీ కొందరు అనుమానిస్తుంటారు. కాని ప్రపంచ చరిత్ర ఉదాహరణగా ఆయుధాలు లేని, బలహీనమైన ఆయుధాలుగల ప్రజా శక్తులే ఎలా ఎప్పుడూ విజయం సాధిస్తూ వచ్చారో ఈ వ్యాసం వివరించి గొప్ప ఆశావాద దృక్పథాన్ని కల్పిస్తుంది.

'రాజకీయ కృషి: మన కృషి అంతటికీ జీవనాడి' అనే రెండో వ్యాసం అన్ని సామాజిక రంగాలలో పనికీ రాజకీయ కృషి ఎలా జీవనాడిలా పనిచేస్తుందో వివరిస్తుంది. తొలిరోజుల చైనా విప్లవోద్యమంలో సైనిక అంశానికి ఎక్కువ ప్రాధాన్యత

ఇవ్వవలసి వచ్చిన నేపథ్యంలో, దాన్ని సవరించడానికి 'తుపాకీ రాజకీయాల అధీనంలో ఉండాలి గాని, రాజకీయాలను తుపాకీ శాసించగూడదు' అని మావో చేసిన సుప్రసిద్ధ సూత్రీకరణనూ, అప్పటినుంచీ రాజకీయకృషిని నాలుగు ప్రథమ ప్రాధాన్యతాంశాలలో ఒకటిగా చేసిన తీరునూ ఈ వ్యాసంలో అద్భుతంగా వివరించారు.

ఇక మూడో వ్యాసమైన 'సైద్ధాంతిక కృషికి మొదటి స్థానమివ్వాలి' చైనా ప్రజా విముక్తి సైన్యం ఏర్పడిన తొలిరోజుల్లోనే మావో ఆ ప్రజా విముక్తి సైన్యాన్ని కార్మికవర్గేతర, శుద్ధ సైనికవాద దృక్పథం నుంచి రక్షించేందుకు రాజకీయ, సైద్ధాంతిక కృషికి ఎలా ప్రధాన ప్రాధాన్యత ఇచ్చాడో వివరిస్తుంది. విప్లవ క్రమంలోనూ, విప్లవానంతర నిర్మాణ కృషిలోనూ కూడ సైద్ధాంతిక దృక్పథానికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వడం ఎందుకు అవసరమో, అది జరగకపోతే ఎటువంటి ప్రమాదాలు వస్తాయో ఈ వ్యాసం వివరిస్తుంది.

'సైద్ధాంతిక కృషి వాస్తవాల మీద ఆధారపడి ఉండాలి' అనే నాలుగో వ్యాసం పుస్తకాల మీద ఆధారపడిన సైద్ధాంతిక కృషికీ, వాస్తవాల మీద ఆధారపడిన సైద్ధాంతిక కృషికీ మధ్య వైరుధ్యాన్ని చర్చిస్తూ, ఎప్పుడైనా వాస్తవాచరణ మీద, సజీవ అభిప్రాయాల మీద ఆధారపడిన సైద్ధాంతిక కృషికి మాత్రమే ప్రథమ ప్రాధాన్యత ఇవ్వడం ఎందుకు అవసరమో చెపుతుంది.

నిజానికి ఈ నాలుగు వ్యాసాలూ విడివిడిగా ఉన్నప్పటికీ ఇవన్నీ ఒకే గొలుసులో భాగాలు, ఒకే అవగాహనకు నాలుగు కోణాలు. మొదట మనిషికీ ఆయుధాలకూ మధ్య సంబంధం దగ్గర ప్రారంభించి, మానవ సమాజంలో సాధారణ కృషికీ రాజకీయ కృషికీ మధ్య సంబంధం మీదుగా, రాజకీయ కృషిలో సైద్ధాంతిక కృషికీ రోజువారీ పనులకీ మధ్య సంబంధాన్ని చర్చించి చివరికి ఆ సైద్ధాంతిక కృషి వాస్తవ ఆచరణ, సజీవ భావాల పునాదిగా ఉండాలనడం ద్వారా మనిషి దగ్గర ప్రారంభించి మనిషి దాకా సాగిన ఈ గొలుసు వ్యాసాలు కమ్యూనిస్టు ఆచరణలో, విప్లవోద్యమ నిర్మాణంలో, విప్లవానంతర సామ్యవాద సమాజ నిర్మాణంలో అత్యవసరంగా అలవరచుకోవలసిన దృక్పథాన్ని చాల సులభంగా, సునిశితంగా వివరిస్తాయి. ఈ వ్యాసాలు చదవడం, అధ్యయనం చేయడం, లోతుగా ఆకళించుకోవడం, మన అవగాహనలో భాగం చేసుకోవడం ఇవాళ్టి చారిత్రక అవసరం.

**– ప్రచురణకర్తలు**

# ప్రచురణ కర్తల నోట్

చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్రకమిటీ అధికారిక పత్రిక హోంకీ (ఎర్రజెండా) లో 1964లో ఈ నాలుగు వ్యాసాలూ ప్రచురితమైనాయి. చైనా విప్లవం, సోషలిస్టు నిర్మాణాల అనుభవం మీద ఆధారపడిన ఈ వ్యాసాలు రాజకీయ కృషి ప్రాధాన్యత గురించీ, దాని నుండి తీసుకోవాల్సిన ప్రధాన గుణపాఠాల గురించీ తెలియజేస్తాయి. చైనా ప్రజా విముక్తి సైన్యం చేసిన రాజకీయ కృషిలోని "నాలుగు ప్రధాన అంశాల" సూత్రం గురించి వివరమైన విశ్లేషణ వీటిలో ఉంది. అవి (1) మానవులకీ, ఆయుధాలకూ మధ్య సంబంధంలో మానవులకీ (2) రాజకీయ కృషిలో రొటీన్ పనులకూ సైద్ధాంతిక కృషికీ మధ్య సంబంధంలో సైద్ధాంతిక కృషికీ (4) సైద్ధాంతిక కృషిలో సజీవమైన భావాలకూ, పుస్తకాల్లోని భావాలకూ మధ్య సంబంధం సజీవమైన భావాలకూ, ప్రజావిముక్తి సైన్యం ప్రథమ స్థానాలనిచ్చింది. "ఆయుధాలు అన్నిటినీ నిర్ణయిస్తాయి" అనే సిద్ధాంతాన్నీ, "వ్యక్తులకు భౌతిక ప్రోత్సాహకాలు" అనే సూత్రాన్నీ, "మొత్తం ప్రజల" అనే భావననూ – వర్గేతర లేదా వర్గాతీత భావజాలం అనేదాన్నీ, ఇతర రివిజనిస్టు దృక్పథాన్నీ ఈ వ్యాసాలు ప్రజల్ని ఒప్పించే విధంగా వాదించి తిప్పికొట్టాయి.

(పెకింగ్ ఫారిన్ లాంగ్వేజెస్ ప్రెస్ దీనిని 1966లో ప్రచురించింది)

# మానవులే ప్రధానాంశం

కా. మావో ఇలా అన్నారు. "ప్రజలు, ప్రజలు మాత్రమే ప్రపంచ చరిత్రకు చోదక శక్తి"[1]

ప్రజల సృజనాత్మక శక్తి అంతులేనిది.

సామాజికాభివృద్ధి చరిత్ర అంతా భౌతిక ఉత్పత్తి కోసం ప్రజలు కొన్ని ఉత్పత్తి సంబంధాల్లోకి వెళ్ళే చరిత్రే. ఉత్పత్తిని కొనసాగించడం కోసం ప్రజలు కొన్ని పరికరాల్ని కనిపెట్టి ఉపయోగించే చరిత్ర కూడా. మనిషికీ మిగతా జంతువులకీ ప్రధానమైన తేడా ఏంటంటే మనుషులు ప్రకృతిలోని వస్తువుల్ని మార్చడానికి తమ అవసరాలకు అనుగుణంగా వాటిని మలుచుకోడానికి చైతన్యయుతంగా వివిధ పరికరాల్ని సృష్టించి ఉపయోగించగలరు. ఉత్పత్తి క్రమంలోనూ, ప్రకృతితో చేసే పోరాటంలోనూ కూడా, వివిధ చారిత్రక దశల్లో ప్రజలు నిరంతరం వివిధ పరిస్థితుల్లో ఉపయోగించే పరికరాల్ని మెరుగుపరుస్తూ ఉంటారు. ఫలితంగా ఉత్పత్తి టెక్నిక్‌లలో అభివృద్ధి సంభవిస్తుంది. మానవుల చేతులు చేసే వివిధ కార్యాలకు కొనసాగింపుగానూ, వీరి శక్తి సామర్థ్యాల విస్తరింపుగానూ పరికరాలు పనిచేస్తాయి. పరికరాల్ని మార్చడం ద్వారానూ, చారిత్రక అవసరాల రీత్యా తమ స్వంత శక్తి సామర్థ్యాల్ని పెంచుకోవడం ద్వారానూ ప్రజలు సామాజిక సంబంధాల్లో మార్పునూ, అభివృద్ధినీ పెంపొందిస్తారు.

ప్రజా విముక్తి సైన్యంలోని రాజకీయ కృషిలో పెంపొందిన "నాలుగు ప్రథమ అంశాలు"[2] అనే సూత్రంలో మొదటిది మానవులకూ, ఆయుధాలకూ మధ్య సంబంధంలో మొదటి ప్రాధాన్యత మానవులకివ్వాలనేది. అంటే మానవులకూ, పదార్థానికీ మధ్య సంబంధంలో, నిర్ణయాత్మక శక్తి మానవులే తప్ప పదార్థం కాదు.

మార్క్సిజం–లెనినిజంలో ఇది మౌలిక దృక్పథం. నిజానికి సైన్యంలో మనిషికీ ఆయుధాలకూ మధ్య సంబంధం విషయంలోనే కాక సోషలిస్టు నిర్మాణాన్ని, ఇతర అన్ని పనులనూ చేసే క్రమంలో కూడా దీన్ని ఎత్తిపట్టాల్సి ఉంది.

1920లో సోషలిస్టు ఆర్థిక నిర్మాణం కర్తవ్యాల గురించి రాస్తూ లెనిన్ ఇలా అన్నారు:

“కార్మికవర్గ వర్గ చైతన్యమూ, దృఢత్వమూ మాత్రమే ఇక్కడ పరిగణలోకి వచ్చే అంశాలు. కార్మికవర్గం త్యాగాలకు సిద్ధపడితే, అది తన శక్తిమేరకు పూర్తిగా పనిచేస్తోందని రుజువైతే, సమస్య పరిష్కారం అవుతుంది. ప్రతిదీ ఈ సమస్య పరిష్కారం కోసమే ఎక్కుపెట్టబడాలి. కార్మికవర్గ దృఢచిత్తం ‘లొంగిపోవడం కంటే చావడం మేలు!’ అనే నినాదానికి ఎటువంటి వూగిసలాటా లేకుండా కట్టుబడి ఉండడం– ఇవి చారిత్రక అంశాలు మాత్రమే కాదు, అదే నిర్ణయాత్మకమైన అంశం, గెలుపొందే అంశం కూడా.”[3]

యుద్ధం విషయంలో కూడా లెనిన్ ఇదే అర్థంలో ఇలా రాశారు: “ఎక్కువ రిజర్వులు, ఎక్కువ శక్తి వనరులు, ప్రజల్లో ఎక్కువ శక్తి కలిగినవారు మాత్రమే యుద్ధంలో గెలుస్తారు.”[4]

ఆయన ఇంకా ఇలా అన్నారు:

“ఏ యుద్ధంలోనైనా గానీ, యుద్ధరంగంలో రక్తాన్ని చిందించే ప్రజల నైతిక స్థైర్యం మీదనే అంతిమ విజయం ఆధారపడి ఉంటుంది. . . ప్రజలు యుద్ధం యొక్క ఆశయాలనూ, లక్ష్యాలను అర్థం చేసుకోవడం అనే విషయానికి అపారమైన ప్రాముఖ్యత ఉన్నది. అది విజయాన్ని గ్యారంటీ చేస్తుంది”[5]

1919లో, తూర్పు దేశాల ప్రజల కమ్యూనిస్టు సంస్థల అఖిల రష్యా 2వ కాంగ్రెస్‌లో అంతర్యుద్ధాల అనుభవాల మీద మాట్లాడుతూ లెనిన్ ఇలా ప్రకటించారు:

“. . . . . . . ప్రస్తుతం తూర్పు దేశాల ప్రజలు బలహీనంగానూ, యుద్ధకళనూ, ఆధునిక టెక్నాలజీలోని అన్ని అద్భుతాలనూ వినియోగించే యూరోప్ పీడకుల శక్తి అజేయమైనదిగాను కనపడవచ్చు. అయినప్పటికీ పీడిత ప్రజలు చేసే విప్లవయుద్ధం లక్షలాది శ్రామికులను, పీడితులను మేల్కొలపడంలో విజయవంతమైతే ఎన్నో అద్భుతాలనూ, శక్తి సామర్థ్యాలను, తన గర్భంలోపల కలిగి ఉంటుంది. . . .”

అంటే మానవాంశానికి ప్రథమ స్థానాన్నిచ్చే దృక్పథం సరిగ్గా లెనినిస్టు దృక్పథం అని మనం చూడవచ్చు.

దీన్ని గుర్తించడం అత్యధిక ప్రాధాన్యత గల అంశం. ముఖ్యంగా ఇప్పుడే పుట్టి పెరుగుతున్న శక్తులకీ, విప్లవ విజయం కోసం పోరాడుతున్న విప్లవ ప్రజానీకానికీ,

తమ స్వంత దేశాలను నిర్మించుకుంటున్న వారికీ మరింత ప్రాముఖ్యత కలిగినట్టిది. వారు ఈ సత్యాన్ని గుర్తిస్తున్నారా లేదా, ఎటువంటి క్లిష్ట పరిస్థితుల్లోనైనా దానికి అంటి పెట్టుకుని ఉంటున్నారా లేదా అనే అంశాలు వారి పోరాటాల భవిష్యత్తునూ, వారి విప్లవాల పునర్నిర్మాణాల విజయాన్ని లేదా ఓటమినీ ప్రభావితం చేసేవే.

సామ్రాజ్యవాదుల వద్దా, అభివృద్ధి నిరోధక పాలకవర్గాలందరి దగ్గరా క్రూరమైన అణచివేత సాధనాలూ, అద్భుతమైన ఆయుధాలూ, సామగ్రి ఎప్పటికీ ఉంటాయి. అటువంటి శత్రువును చూసి విప్లవ ప్రజానీకం భయపడి పారిపోవాలా లేక పోరాడ సాహసించి విజయాన్ని సాధించాలా? లేక ఆయుధాలు చేబూని శత్రువుకు వ్యతిరేకంగా దృఢంగా పోరాడి శత్రు దాడిని చిత్తు చేసే సాహసం చేయాలా?

సోషలిస్టు, జాతీయ విప్లవాల్లో విజయం సాధించిన అనేక దేశాలు మిగతా దేశాలతో పోల్చినప్పుడు ఆర్థికంగానూ, సాంకేతికంగానూ కూడా వెనుకబడినవి. ఇటువంటి పరిస్థితుల్లో, విప్లవ ప్రజానీకం, ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయి శత్రువుకు అమ్ముడు పోవాలా లేక స్వయం సమృద్ధి ద్వారా దేశాన్ని సుభిక్షం చేయడానికి శక్తివంతంగా పని చేయాలా?

మానవాంశకు ప్రథమ స్థానాన్నిచ్చే సూత్రాన్ని ఎత్తిపట్టి, ఈ జ్ఞానం వెలుగులో తమ కార్యకలాపాల్ని చైతన్యయుతంగా ఆర్గనైజ్ చేసుకుని ప్లాన్ చేసుకోవడం ద్వారా మాత్రమే విప్లవ ప్రజానీకం తమ కోసం ఎన్నో వెలుతురు కవాటాల్ని తెరుచు కోగల్గుతుంది.

యుద్ధక్రమంలో, దాని అభివృద్ధిపైనా, ఆయుధాల ప్రభావం ఎక్కువగానే ఉంటుంది. అయితే అంతిమ విశ్లేషణలో చివరి ఫలితం మానవుల మీదనే ఆధారపడి ఉంటుంది. చరిత్రలోనూ, నిజ జీవితంలోనూ కూడా ఏకపక్షంగా ఆయుధాల పాత్రను చాలా ఎక్కువగా చేసి మానవుల పాత్రను తక్కువ చేసే వాదనలనూ, కొన్ని కొత్త ఆయుధాలు యుద్ధ ఫలితాన్ని నిర్ణయిస్తాయి అనే సూత్రాన్నీ యుద్ధ క్రమాలు నిరంతరంగా తిప్పికొడ్తూనే వస్తున్నాయి.

బూర్జువా విప్లవాల క్రమంలో జరిగిన యుద్ధాలన్నీ (చాలా ముందుగా జరిగిన యుద్ధాల్ని మేమిక్కడ చెప్పడం లేదు) అంటే అమెరికా స్వాతంత్ర్య యుద్ధం (1775-83) ఫ్రెంచి విప్లవ యుద్ధం (1791-94) వంటివన్నీ మానవుల పాత్రే ప్రథమ ప్రాధాన్యత కల్గినదని రుజువు చేశాయి. అమెరికా యుద్ధంలో, ప్రతిభావంతమైన ఆయుధాలు కల్గిన బ్రిటిష్ వలసవాద సైన్యాన్ని నాసిరకం ఆయుధాలతోనే తిరుగుబాటు సైన్యాలు ఎదుర్కొన్నాయి. యుద్ధం ప్రారంభ దశలో వారికి ఆయుధాలూ, శిక్షణా నాసిరకందే

అయినప్పటికీ, తాము స్వాతంత్ర్యం కోసం, న్యాయం కోసం, కీలకమైన ప్రయోజనాల కోసం పోరాడుతున్నామని తిరుగుబాటు శక్తులకు పూర్తిగా తెలుసు. అందుకనే వారు తమ ధైర్యాన్నీ, తెలివితేటల్ని పూర్తిగా వినియోగించి చివరగా బ్రిటిష్ వారిని ఓడించారు. ఫ్రెంచి విప్లవంలో కూడా మిత్ర దేశాల సుశిక్షిత, సర్వసమగ్ర సాధన సంపత్తి కలిగిన కిరాయి మూకలకు వ్యతిరేకంగా మిలీషియా లాంటి నాసిరకం సామగ్రి కలిగిన బలగాలు బరిగీసి నిలబడ్డాయి. 1792లో, గ్రేట్ బ్రిటన్, ఈజిప్టు, రష్యాల అండదండలతో ప్రష్యా, ఆస్ట్రియాలు ఫ్రెంచి విప్లవానికి వ్యతిరేకంగా సాయుధంగా జోక్యం చేసుకున్నాయి. అయితే తమ దేశాన్ని రక్షించుకోవాలనే భావనతో ఉత్తేజితులై ప్రజలు గొప్ప దేశభక్తియుత, విప్లవోత్తేజం ఇచ్చిన మద్దతుతో వారు ఆఖరికి తమ భూభాగం నుండి జోక్యందారీ బలగాల్ని తరిమేశారు.

19వ శతాబ్దంలో, రైఫిల్ తయారీలో నిలకడగా జరుగుతూ వచ్చిన మెరుగుదల కారణంగా, ఎంతో శక్తివంతమైన కొత్త రకం రైఫిల్ తయారైంది. ఆ కాలంలో ఆయుధమే అన్నిటినీ నిర్ణయిస్తుందనీ, దానిముందు వ్యక్తిగత సాహసంగానీ, ప్రజా బలంగానీ నిరుపయోగం అనీ కొందరు ప్రజలు నమ్మారు. అయితే ఆ తర్వాత జరిగిన కొన్ని యుద్ధాలు ఇది తప్పు అని నిరూపించాయి. ఆ కాలంలో జరిగిన కొన్ని యుద్ధాల అనుభవాల వెలుగులో ఎంగెల్స్ అన్నట్లుగా, "మిలిటరీ అభిప్రాయాల్లో మార్పు వచ్చేసింది. యుద్ధాల్ని గెలిచేది మానవులే తప్ప మస్కెట్లు కాదని ప్రజలు మళ్ళీ అర్థం చేసుకోగల్గుతారు."[7]

1890లలో ఎ. టి. మహాన్ అనే అమెరికన్ "నావికా బలగమే విజయాన్ని నిర్ణయిస్తుంది" అనే సిద్ధాంతాన్ని తీసుకువచ్చి ఒక జాతి చరిత్రను నిర్ణయించే ప్రధాన అంశం ఇదే అని చెప్పాడు. మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత జి. దేహట్ అనే ఇటలీవాసి, "వైమానికదళం విజయాన్ని నిర్ణయిస్తుంది" అన్నాడు. కాగా జె. ఎఫ్. సి. ఫుల్లర్ అనే ఇంగ్లిష్ సైనికుడు, ట్యాంకులూ, యాంత్రీకరించిన ఆయుధాలు యుద్ధంలో 99 శాతం విజయాన్ని నిర్ణయిస్తాయి అనీ మిగతా అంశాలన్నీ మహా అయితే 1 శాతం మాత్రమేననీ రాశాడు. ఇప్పటివరకు జరిగిన యుద్ధాలన్నీ ఈ వాదనలను ఒకటొకటిగా ఓడించేశాయి.

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత అణ్వాయుధాలు అభివృద్ధి అయ్యాయి. సామ్రాజ్యవాదులూ, వివిధ దేశాల అభివృద్ధి నిరోధకులూ, ఆధునిక రివిజనిస్టులూ ఈ ఆయుధాల శక్తి అపారమైనదనీ, అన్ని యుద్ధాల్లో ఇవే నిర్ణయాత్మక పాత్ర వహిస్తాయనీ ఊరూ వాడా ఏకమయ్యేలా ప్రచారం చేయడానికి ఎంతో ప్రయాసపడ్డారు.

విప్లవ ప్రజానీకాన్ని భయపెట్టి, తిరగబడకుండా వారిని ఈ వినాశకర ఆయుధాలు అడ్డుకుంటాయని వారు కలలు కంటున్నారు. కానీ అణ్వాయుధాలు కనిపెట్టబడిన తర్వాత జరిగిన ఈ 20 ఏళ్ళ చరిత్ర, భయం కల్పించాలనుకున్న ఈ వాదన ఎంత దివాళాకోరుదో నిర్దాక్షిణ్యంగా మరోసారి రుజువు చేసేసింది. నిర్దిష్టంగా ఈ కాలంలోనే దాడికి గురైన మరింతమంది పీడిత జాతులూ, ప్రజలూ విముక్తి యుద్ధాల్ని చేయడానికి వీరోచితంగా ముందుకొచ్చారు. వారు ఆధునిక ఆయుధాలు కలిగిన సామ్రాజ్యవాదుల్నీ, అభివృద్ధి నిరోధకుల్నీ ఓడించడానికి నాసిరకం, తక్కువ రేంజి గలిగిన ఆయుధాలను ఉపయోగించారు. క్యూబా ప్రజలు ఏడు రైఫిళ్ళతో తమ తిరుగుబాటును ప్రారంభించారు. అల్జీరియా ప్రజలు 500 పాత షాట్‌గన్‌లతో ప్రారంభించారు. వారు ఆధునిక ఆయుధాలు కలిగిన వేలకొలది వలసవాద లేదా అభివృద్ధి నిరోధక బలగాలను ఎదుర్కోవల్సివచ్చింది. అయితే తిరుగుబాటు శక్తులు చివరగా వారిని తుడిచిపెట్టేశాయి. "అత్యధిక అణ్వాయుధ బలం కూడా గెరిల్లా యుద్ధ తంత్రాన్ని అదుపు చేయలేదు" అని అమెరికా సామ్రాజ్యవాదులు చచ్చినట్లు ఒప్పుకోవాల్సి వచ్చింది. దక్షిణ వియత్నాం యుద్ధంలో అమెరికా సామ్రాజ్యవాదులు హెలికాప్టర్లు, నీళ్ళలోనూ నడిచే సాయుధ శకటాల వంటి వాటి మీద ఆధారపడి దక్షిణ వియత్నాం ప్రజా సాయుధ బలగాల్ని తుడిచిపెట్టేయగలం అనుకున్నారు. కానీ వారే ఓటమి వెంట ఓటమిని చవి చూడాల్సివచ్చింది.

తిరుగుబాటు చేస్తున్న ప్రజలు శత్రువును ఓడించడానికి నిరంతరం తమ ఆయుధాల్నీ, సామగ్రినీ మెరుగుపర్చుకుంటూ ఉండాలనేది స్పష్టమే. అయితే మానవుల పాత్రను పూర్తిగా వెలికి తీయడం ద్వారా, సరైన వ్యూహం ఎత్తుగడల ద్వారా మాత్రమే ప్రజాసైన్యం ఆయుధాల సమస్యను పరిష్కరించుకోగల్గుతుంది. అనేక సందర్భాల్లో వారు కేవలం శత్రువు నుండి ఆయుధాలను గుంజుకుంటారంతే. నిజానికి అంతిమ నిర్ణయాత్మక పోరులో కూడా తరచుగా అభివృద్ధి నిరోధకుల ఆయుధాల కంటే ప్రజా బలగాల ఆయుధాలు తక్కువ నాణ్యత కల్గినవిగానే ఉంటూ ఉంటాయి. అంటే, ఆయుధాలకు సంబంధించినంత వరకు, అనేక ప్రజాయుద్ధాలు మొదటినుండి చివరి వరకు కూడా పైచేయి సాధించలేకపోయాయి. విజయానికి కారణం మానవుల్లో ఉన్నది. ప్రజల మద్దతులో, మానవ శక్తిలో అది ఇమిడి ఉన్నది.

అనేక ప్రజల సాయుధ పోరాటాలు తాత్కాలికంగా ఓడిపోవడానికి గల ప్రధాన కారణం మానవుల పాత్రను పూర్తిగా వెలికితీయలేని వ్యూహపరమైన, ఎత్తుగడల పరమైన పొరపాట్లే తప్ప, ఆయుధాలు కాదు. అయితే వారు దీని నుండి గుణపాఠాలు

తీసుకోగల్గుంటే మాత్రం ముందో వెనకో తమ బలహీనమైన స్థానాన్ని బలంగా మార్చుకుని, ఓటమిని విజయంగా మార్చుకోగల్గుతారు.

విప్లవంలో విజయం సాధించిన దేశాలన్నీ తమ సాయుధ బలగాలను ఆధునీకరించడానికీ, అన్ని ఆధునిక టెక్నిక్‌లపైనా యుద్ధానికి సంబంధించిన అన్ని విషయాలపైనా పూర్తి పట్టు సాధించడానికి ఎంతో కష్టపడాలి. సైన్యం ఆధునీకరించబడే కొద్దీ, మిలటరీ టెక్నిక్‌లు అభివృద్ధి చెందేకొద్దీ మానవుల పాత్ర తగ్గిపోకపోగా మరింత ప్రాముఖ్యతనే సంతరించుకుంటుంది. ఎందుకంటే మిలటరీ టెక్నిక్‌లు ఎంతగా అభివృద్ధి చెందినప్పటికీ, మానవుల శక్తి, వారి ధైర్యం, రాజకీయ చైతన్యం, త్యాగానికి గల సంసిద్ధత మాత్రమే యుద్ధం అంతిమ ఫలితాన్ని నిర్ణయిస్తాయి. అత్యాధునిక మిలటరీ టెక్నిక్‌లున్నప్పటికీ సైన్యాన్ని విప్లవీకరించకుండా, అత్యంత పురోగామి రాజకీయ భావాలను వారిలోకి ఇంకించకుండా గరిష్టమైన ప్రభావాన్ని వేయలేవు అని ఆధునిక యుద్ధాలు ప్రత్యేకంగా నొక్కి వక్కాణిస్తున్నాయి.

కొన్ని కొత్త ఆయుధాల పాత్రను ఎక్కువచేసి, మానవుల పాత్రను తక్కువ చేయడానికి సామ్రాజ్యవాదులూ, అభివృద్ధి నిరోధకులూ ప్రయాసపడ్డం వెనుక వర్గ ప్రయోజనాలున్నాయి. అభివృద్ధి నిరోధక దోపిడీ వర్గాలు ప్రజల నుండి వేరుబడిపోయి వారి పట్ల తీవ్ర వ్యతిరేకతతో మెలుగుతుంటాయి. వారు ప్రజల మద్దతును సంపాదించుకోలేరు కనక, సహజంగానే వారు ప్రజల శక్తిని పూర్తిగా వినియోగించుకోలేకపోతారు. దాంతో, ఆయుధాలను గుడ్డిగా విశ్వసించడం తప్ప వారికి వేరే మార్గం లేదు. ఈ విధంగా, అత్యంత శక్తివంతమైన ఆయుధాలు కూడా వారి చేతుల్లో తమ శక్తినంతా కోల్పోయి ప్రజల్ని భయపెట్టడానికి కాయితం పులుల్లా తయారవుతాయి. ఇటువంటి పరిస్థితుల్లో కూడా వారు కొన్ని విజయాల్ని సాధించినప్పటికీ, అంతిమంగా వారు ఓడిపోతారు.

చరిత్ర అంతటిలో, నూతన ఉత్పత్తి విధానం వివిధ స్థాయిల్లో అప్పటికున్న ఉత్పత్తి శక్తుల్ని విముక్తి చేయడం ద్వారా పాత దాని మీద విజయాన్ని సాధించింది. ముఖ్యంగా ఉత్పత్తి శక్తుల్లో ప్రధాన శక్తి అయిన శ్రామికుల్ని విముక్తి చేయడం ద్వారానే ఇది సాధ్యపడింది. ఇందువల్ల వారికి నూతన శ్రమ సాధనాల్ని సృష్టించడంలోనూ, ఉపయోగించడంలోనూ ఆ శక్తి పెరుగుతుంది. పాత శ్రమ సాధనాల్ని మరింత శక్తివంతంగా తయారు చేసి గతం కంటే ఎక్కువ ఉత్పాదకతను సాధించేలా చేస్తుంది.

దోపిడీ వ్యవస్థల్లో, శ్రామికులు సృష్టించే ఉత్పాదక టెక్నిక్‌లూ, శ్రమ సాధనాలూ దోపిడీదారుల అదుపులో ఉంటాయి. వారు తిరిగి వాటిని శ్రామికులను బానిసలను

చేసి దోపిడీ చేయడానికి ఉపయోగిస్తారు. సోషలిస్టు సమాజంలో శ్రమ సాధనాలూ, ఉత్పాదక టెక్నిక్‌లూ మనిషిని బానిసను చేసే ప్రక్రియకు అంతం పలికాయి. "మానవులు తమ స్వంత సామాజిక నిర్మాణానికి అధినేతలు అయ్యారు కనక మొదటిసారిగా ప్రకృతి మీద నిజమైన, చైతన్యయుతమైన పట్టును సాధిస్తారు". [8] ఈ పరిస్థితుల్లో ప్రకృతిని అర్థం చేసుకుని, దానిని అదుపు చేసి దాన్ని మార్చటంలో మానవుల చొరవ, సామర్థ్యం మునుపెన్నడూ లేనంతగా పెరిగిపోతాయి. శ్రామికవర్గ నియంతృత్వ ప్రభుత్వం, కార్మిక వర్గ పార్టీ నేతృత్వంలో, వస్తుగత ప్రపంచ సూత్రాల్ని మరింత లోతుగా అర్థం చేసుకోవడం ద్వారా ప్రజలు అన్ని రకాల అద్భుతాల్నీ సాధించగల్గుతారు. సామాజిక సంపదను సృష్టించడానికి అవసరమైన అత్యాధునిక ఉత్పాదక టెక్నిక్‌లనూ సృష్టించగల్గుతారు.

సోషలిస్టు ఉత్పత్తి విధానానికీ, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికీ గల మౌలికమైన తేడా ఏమిటంటే నూతన, సోషలిస్టు ఉత్పత్తి సంబంధాల్లో, మానవుల మానసిక స్థితి గొప్ప మార్పుకు గురియై ఉంటుంది. ప్రజానీకంలో సోషలిజం పట్ల గొప్ప ఉత్సాహం, శక్తి సామర్థ్యాలూ ఉంటాయి. వారు ఇక ఎంత మాత్రం బానిసల్లా అగుపించరు. ఇతరులపై ఆధారపడాలనుకోరు. తమ స్వంత చేతులతో తమ దేశపు పేదరికాన్నీ, వెనకబాటుతనాన్నీ మార్చేయగలమనే ఆత్మవిశ్వాసంతో ఉంటారు. కా. మావో చెప్పిన ఈ విషయం ఎంతో సరియైనది.

"చైనా దేశపు 60 కోట్ల ప్రజలు మొదటగా పేదవారు. రెండవది, వారు చీకట్లో తడుములాడుతున్నారు. అది పైకి చెడ్డ విషయంలా కన్పిస్తుంది. కానీ నిజానికి అది మంచి విషయం. పేద ప్రజలు మార్పును కోరుకుంటారు. కొత్త పనులు చేయాలనుకుంటారు. విప్లవాన్ని కోరుకుంటారు."[9]

రష్యా కూడా ఆర్థికంగానూ, సాంకేతికంగానూ ఒకప్పుడు వెనకబడిన దేశం. అక్టోబర్ విప్లవ విజయానంతరం, రెండవ ఇంటర్నేషనల్ రివిజనిస్టులందరూ ఇలా అన్నారు: 'రష్యాలోని ఉత్పత్తి శక్తులు సోషలిజాన్ని సాధించడానికి అనువైనంతగా అభివృద్ధి కాలేదు. ప్రజలు చాలా పేదరికంలో ఉన్నారు. వారికి నాగరికత కూడా ఇంకా అబ్బలేదు. రష్యాలో సోషలిజం నిర్మించాలనుకోవడం పగటికల, అర్థరహితం'. దీనికి లెనిన్ ఇలా జవాబిచ్చారు:

"సోషలిజం నిర్మించడానికి నాగరికత అవసరమంటున్నారా మీరు? సరే. చాలా మంచిది. అయితే నాగరికతకు ముందు షరతులుగా భూస్వాములనూ, రష్యా పెట్టుబడిదారులనూ దేశం నుండి తరిమికొట్టడం వంటి పరిస్థితుల్ని మనం

ముందుగానే సృష్టించి ఆ తర్వాత సోషలిస్టు నిర్మాణం దిశగా ఎందుకు పోకూడదు?"[10]

భూస్వాములనూ, పెట్టుబడిదారులనూ కూలదోయడం అంటేనే పీడితులైన శ్రామికులను పీడన నుండి విముక్తి చేసి వారిని సమాజానికి అధినేతలుగా చేయడమే. వారు తమ భవిష్యత్తు కోసం తామే పోరాడుకునేలా వారిలో దాగివున్న అంతులేని శక్తిని విడుదల చేయడమే. అంటే సోషలిజం కోసం పోరాటంలో మొదటిగా శ్రామికుల శక్తిని విడుదల చేయాలి. రెండవది దేశం నుండి పేదరికాన్ని, వెనకబాటు తనాన్నీ తరిమికొట్టడానికి అవసరమైన పురోగామి సామగ్రినీ, సాంకేతిక పునాదినీ సృష్టించడం.

మొదట లెనిన్ నాయకత్వంలోనూ తర్వాత స్టాలిన్ నాయకత్వంలోనూ నడిచిన సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో మహత్తర సోవియట్ ప్రజలు చేసింది సరిగ్గా ఇదే అని విస్తృతంగా అందరికీ తెలుసు. అలాగే, నిర్మాణంలో కూడా నిర్ణయాత్మక శక్తి మానవులే తప్ప పదార్థం కాదు అని సోషలిస్టు దేశాల చారిత్రక అనుభవం నిరూపిస్తోంది. విప్లవ చేవ, చైతన్యం, కార్మికవర్గ ధృడ చిత్తం గల త్యాగాలకు సంసిద్ధులైన ప్రజలతో మాత్రమే సోషలిజాన్ని, దాని పునాదిగా కమ్యూనిజాన్నీ నిర్మించగల, కమ్యూనిజాన్ని కాదు కదా కనీసం సోషలిజాన్ని కూడా నిర్మూలించ లేనివారు కొందరుంటారు. వారు కార్మికవర్గ విప్లవ చైతన్యాన్ని కోల్పోయినవారు. వీరు కేవలం వ్యక్తిగత భౌతిక ప్రోత్సాహకాలనూ, అధిక జీతాలనూ మాత్రం కోరుకుంటారు. వారి బుర్రల్లో "స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం" "మానవత్వం" వంటి బూర్జువా భావాలు నిండివుంటాయి. ఈ భావాలను వారు కార్మికవర్గాన్ని అవినీతిపరుల్ని చేసి ప్రజల్ని అచేతనంగా మార్చడానికి ఉపయోగిస్తారు.

(సోషలిజం) నిర్మాణంలో ప్రజల్ని నడిపించేటప్పుడు కార్మికవర్గ పార్టీ ప్రథమ కర్తవ్యం సోషలిస్టు సమాజంలో మానవుల పాత్రకు గొప్ప ప్రాధాన్యతనివ్వడం, సోషలిజం కోసం ప్రజల్లో దాగివున్న శక్తినంతా వెలికితీయడం, వారి ఉత్సాహాన్ని పూర్తిగా ఉరకలెత్తించడం. "ఆచరణ కోసం, విప్లవం కోసం" వారి సంసిద్ధతను పూర్తిగా వెలికితీయడం వారి శక్తిని సంఘటితపరచడం, సోషలిజం నిర్మాణంలో శక్తిని పూర్తిగా వినియోగించడం, ఉన్నత లక్ష్యాలను పెట్టుకోవడం, గొప్పగా, వేగంగా మెరుగైన, మరిన్ని ఆర్థిక ఫలితాల్ని సాధించడం అనే సాధారణ పంథాను చైనా కమ్యూనిస్టు పార్టీ సరిగా ఇటువంటి లక్ష్యంతోనే మొదలై రూపొందించింది. ఈ సాధారణ పంథా సారానికి అనుగుణంగానే పార్టీ నిర్మాణ కృషికి సంబంధించిన అన్ని నిర్దిష్ట విధానాలనూ, చర్యలనూ రూపొందించింది.

అయితే, వస్తుగతమైన భౌతిక పరిస్థితులతో సంబంధం లేకుండా మానవులు

తమ చిత్తానుసారం వ్యవహరించగలరు అని వ్యాఖ్యానించడం సరిగా ఉండదనే విషయం తెలిసినదే. ఎప్పుడైనాగానీ మానవులూ, పదార్థమూ ఒక ఐక్యతలోని విరుద్ధాంశాలుగా ఉంటాయి. మనిషి పదార్థానికి అధినేత, పదార్థం మానవుల కార్యకలాపాలకు కొన్ని పరిస్థితులను కల్పిస్తుంది. ఈ పరిస్థితులు కల్పించే పరిమితులను అధిగమించి మానవులు విజయం సాధించలేరు. అయితే ఈ పరిమితుల లోపల ఎంత చొరవనూ, విన్యాసాల్నీ ప్రదర్శించడానికైనా తగినన్ని అవకాశాలున్నాయి. ఈ పరిమితుల లోపలనే రాజకీయాలూ, భావజాలమూ, మానవుల విప్లవ చొరవా టెక్నిక్‌నూ, ఇతర భౌతిక పరిస్థితులనూ సృష్టిస్తాయి. దాదాపుగా ఒకే వస్తుసామగ్రీ, సాంకేతిక పరిస్థితులూ కలిగి ఉన్నప్పటికీ వ్యక్తుల రాజకీయ చైతన్యంలోనూ, వారి వ్యక్తిగత చొరవల్లోనూ గల తేడాల రీత్యా పూర్తిగా వెలికితీయకపోతే, అత్యాధునిక సాంకేతిక సామగ్రి ఉన్నప్పటికీ ఉత్పత్తి స్తంభించిపోవచ్చు లేదా ఉత్పత్తిలో గందరగోళానికి కూడా దారితీయవచ్చు.

సోషలిస్టు సంస్థల స్వభావమూ, పెట్టుబడిదారీ సంస్థల స్వభావమూ పూర్తిగా భిన్నమైనవి. క్రమంగా సాంకేతికంగా ఆధునికీకరణను సాధించుకుంటూనే సోషలిస్టు సంస్థలు తమ కార్మికులు, స్టాఫ్ సభ్యుల ఆలోచనలను విప్లవీకరించ పూనుకుంటాయి. కార్మిక వర్గ ఉత్సాహాన్నీ, చైతన్యాన్నీ నింపుకున్న వీరు సోషలిజానికీ, కమ్యూనిజానికీ పూర్తిగా అంకితమౌతారు. సంస్థల్ని సజీవంగా నడపాలన్నా, వారి సాంకేతిక ఆధునికీకరణను నిలకడగా మెరుగుపరచాలన్నా, అత్యధిక శ్రామిక ఉత్పాదకత కోసం అన్ని ఆధునిక టెక్నిక్‌లనూ పూర్తి శక్తివంతంగా వినియోగించుకోవాలనుకున్నా ఇదొక్కటే మార్గం. పెట్టుబడిదారీ సంస్థలు కార్మికులను కట్టిపడేయడాన్ని ముందు షరతుగా చేసుకుంటాయి. సోషలిస్టు సంస్థలను కలుషితం చేయడానికి లాభాల సూత్రాల్నీ, కార్మికుల బుర్రల్ని "వ్యక్తిగత భౌతిక ప్రోత్సాహకాల" పేరుతో అవినీతిమయం చేయడానికీ ఆధునిక రివిజనిస్టులు ఉపయోగించుకుంటారు. ఆ విధంగా, వాస్తవంగా మానవుల పాత్రను పూర్తిగా వెలికితీయడం సాధ్యం కాదు. ఆధునిక రివిజనిస్టులు, "మనిషిని పట్టించుకోవాలి" అని పెదవులపై నుండి మాట్లాడ్తుంటారు. నిజానికి వారు ప్రజల విప్లవ చేవను చంపేయాలని ప్రయత్నిస్తారు. సోషలిస్టు సంస్థలనూ, సోషలిజం ఆర్థిక పునాదినీ తొలిచేయడానికి ప్రయత్నిస్తారు.

టాచింగ్ చమురు క్షేత్రం ఉత్తేజం చైనా ప్రజలకు ఒక నమూనాగా మారిపోయింది. టాచింగ్ విప్లవ చైతన్యం అంటే ఏమిటి? సారాంశాలు అది కొత్త సంస్థల్ని నిర్మించడంలో, మానవ అంశానికే ప్రాధాన్యతనివ్వడంలో ప్రదర్శితమైన

కార్మికవర్గ విప్లవోత్తేజమే.

కష్టకాలాల్లో, ఎన్నో కష్టభరితమైన పరిస్థితుల మధ్య పోరంబోకు భూముల్లో టాచింగ్ చమురుక్షేత్రం అనే ఆధునిక చమురు సంస్థ చైనాలో కొత్తగా ప్రారంభమైంది. యంత్రాలకూ, సామగ్రికీ తీవ్రమైన కొరత ఉండింది. కమ్యూనికేషన్, రవాణా సౌకర్యాలు ఎంతో ఘోరంగా ఉండేవి. సప్లైల సరఫరాలకు తరచూ అంతరాయం కలిగేది. యంత్ర రిపేర్ వర్క్‌షాప్‌లు అసలు లేకుండినాయి. అటువంటి పరిస్థితుల్లో, టాచింగ్‌ను నిర్మించి, వారు కష్టపడి పని చేసే తత్వాన్ని, స్వయం సమృద్ధి అనే విప్లవ సంప్రదాయాల్నీ ముందుకు తీసుకుపోతూ, తమ వ్యక్తిగత ప్రయోజనాల్ని ప్రజల, ప్రభుత్వ, సమాజ ప్రయోజనాలకు లోబరుస్తూ ఏ మాత్రం తటపటాయింపులు లేకుండా ఎన్నో కష్టాల మధ్యపోరాడారు. ఊహకందనంతటి ఇబ్బందుల్ని ఒకటొకటిగా అధిగమించి నాలుగేళ్ళలోనే ఒక బ్రహ్మాండమైన ఆధునిక సంస్థను నిర్మించడంలో గొప్పగా, వేగంగా, మెరుగైన మరిన్ని ఆర్థిక ఫలితాల్ని సాధించారు. ఈ విధంగా వారు చైనా సోషలిస్టు నిర్మాణంలో గొప్ప పాత్ర నిర్వహించారు.

టాచింగ్ చమురుక్షేత్ర నిర్మాణంలో చైనా ప్రజల ధృడచిత్తం మూర్తీభవించింది. చైనా ప్రజలు తమ స్వంత కృషితో తమ దేశాన్ని నిర్మించుకోగలరని మరోసారి అది రుజువు చేసింది.

మానవులకూ, పదార్థానికీ గల సంబంధంలో మానవులకు ప్రథమ స్థానాన్నిస్తున్నాయా లేదా అనేది చిన్న విషయం కాదు. అది ప్రాపంచిక దృక్పథానికి సంబంధించినది.

బూర్జువా ప్రాపంచిక దృక్పథం మానవులకూ, పదార్థానికీ మధ్య సంబంధాన్ని రెండు రకాలుగా వక్రీకరిస్తుంది. ఒకవైపు అది మానవుల స్వీయాత్మక కోరికలను ఏకపక్షంగా ఎక్కువ చేసి చూపిస్తూ వస్తుగత భౌతిక ప్రపంచపు ఉనికినీ, దాని సూత్రాలనూ నిరాకరిస్తుంది. 'మానవులను మాత్రం పరిగణించి, పదార్థాల్ని పరిగణించని' ఒక స్వీయాత్మక భావవాదానికి అది దారితీస్తుంది. మరోవైపు, అది ఏకపక్షంగా పదార్థం పాత్రను ఎక్కువ చేసి, పదార్థం ముందు మానవులు శక్తిహీనులుగా, అచేతనంగా నిలబడిపోవాల్సిందేననీ, భౌతిక ప్రపంచపు సూత్రాల్ని వారు చురుగ్గా గ్రహించలేరనీ, అందుకని దాన్ని మార్చలేదనీ చెప్తూ, "పదార్థాన్ని మాత్రమే చూసి, మనిషిని చూడని జడాత్మక భౌతికవాదానికి" దారితీస్తుంది.

బూర్జువా పాలకులు "యంత్రాలు మనిషిని పరిపాలిస్తాయి" అనే భావాన్ని ప్రచారం చేస్తారు. ఆ విధంగా వారు యంత్రాల ద్వారా శ్రామిక ప్రజల మీద అదుపును

కొనసాగించాలనుకుంటారు. తమ హింసాత్మక పాలనకు వ్యతిరేకంగా శ్రామిక ప్రజలు పోరాడే సాహసం చేయకుండా ఆయుధాల పాత్రను పెద్దగా చేసి చెప్తుంటారు. తమ కుళ్ళిపోయిన ప్రాపంచిక దృక్పథాన్ని ఉపయోగించి వారు విషయాల్ని పరిశీలిస్తారు. శ్రామిక ప్రజల బుర్రల్ని కలుషితం చేస్తారు. బూర్జువా ప్రాపంచిక దృక్పథపు ప్రభావానికి లోనైన ఏ శ్రామికులైనా గానీ అనివార్యంగా నైతికంగా నిరాయుధులైపోతారు. ధృడచిత్తమూ, చొరవ కోల్పోయి వెన్నెముక లేని సంస్కారహీనులుగా తయారైపోతారు.

కార్మికవర్గ ప్రాపంచిక దృక్పథం స్వీయాత్మక భావవాదాన్నీ, జడాత్మక భౌతికవాదాన్నీ రెండిటినీ వ్యతిరేకిస్తుంది. మానవులూ, పదార్థమూ ఒక ఐక్యతా స్థితిలో ఉంటారనీ, అందులో మానవులు నాయకత్వ పాత్ర వహిస్తారనీ అది చెప్తుంది. ఇది శాస్త్రీయమైన, విప్లవకర ప్రాపంచిక దృక్పథం పోరాడడానికీ, విజయం సాధించడానికీ, విప్లవ చేవతో సాహసించడం ద్వారా విప్లవ ఆశయాన్నీ, (సోషలిస్టు) నిర్మాణ ఆశయాన్నీ ముందుకు తీసుకుపోవడానికి విప్లవ ప్రజానీకం ఈ కార్మిక వర్గ ప్రాపంచిక దృక్పథాన్ని చేబూని సంస్కార విహీనుల, పిరికిపందల ప్రాపంచిక దృక్పథాన్నీ, దాని ప్రభావాన్నీ నిర్మూలించడం ద్వారానే తమ శత్రువులందరినీ ఓడించి విప్లవంలోనూ, నిర్మాణంలోనూ అన్ని రకాల ఇబ్బందులనూ అధిగమించగల్గుతారు.

1. "సంకీర్ణ ప్రభుత్వంపై" – కా. మావో.
2. "నాలుగు ప్రధాన అంశాలు" అంటే ఈ కింది వాటికి ప్రథమ స్థానాన్ని ఇవ్వడం. (1) మానవులకూ, ఆయుధాలకూ మధ్య సంబంధాల్లో మానవులకూ (2) రాజకీయ కృషికీ, ఇతర రకాల కృషికీ మధ్య రాజకీయ కృషికీ (3) రాజకీయ కృషిలో రొటీన్ పనుల విషయంలో సైద్ధాంతిక కృషికీ (4) సైద్ధాంతిక కృషిలో పుస్తకాల్లో భావాలకీ, సజీవమైన భావాలకీ మధ్య సంబంధంలో సజీవమైన భావాలకీ ప్రథమ స్థానాన్నివ్వాలి అని.
3. "రష్యా కమ్యూనిస్టు పార్టీ (బోల్షవిక్) తొమ్మిదవ కాంగ్రెస్" –వి. ఐ. లెనిన్
4. వి. ఐ. లెనిన్ సంకలిత రచనలు
5. అదే గ్రంథం
6. 'తూర్పు ప్రజల కమ్యూనిస్టు సంస్థల అఖిల రష్యా కాగ్రెస్‌లో ఉపన్యాసం' – ఐ. వి. లెనిన్
7. 'మిలటరీ విమర్శకుడుగా ఎంగిల్స్' – "రైఫిల్ చరిత్ర"
8. 'యాంటీ డూరింగ్' – ఫెడరిక్ ఎంగిల్స్
9. "సహకార సంస్థను పరిచయం చేస్తూ" – మావో
10. "మన విప్లవం" – వి. ఐ. లెనిన్

# రాజకీయ కృషి
# మన కృషి అంతటికీ జీవనాడి

ప్రజా విముక్తి సైన్యం రాజకీయ కృషిలో "నాలుగు ప్రథమ అంశాలు" సూత్రంలోని రెండవ అంశం – అన్ని శాఖల మధ్య సంబంధాల్లో రాజకీయ కృషి ప్రథమ స్థానాన్నాక్రమించాలనేది.

వివిధ శాఖలంటే హెడ్‌క్వార్టర్స్, వెనకతట్టు ప్రాంత సర్వీసులు, మిలటరీ శిక్షణ, సంస్కృతి విద్య వంటివి. మంచి రాజకీయ కృషి జరిగితే మిగతా అన్ని పనులూ మంచిగా జరుగుతాయని హామీ ఉంటుందన్న మాట.

చైనా విప్లవంలో చాలాకాలం మిలటరీ పోరాటమే ప్రధాన లక్ష్యంగా ఉండింది. మన పార్టీ కృషి అంతా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఈ పోరాటంలోనే ముడిపడి ఉండేది. అందుకని రాజకీయాలకూ, మిలటరీ వ్యవహారాలకూ మధ్య సంబంధాన్ని ఏ విధంగా చూడాలి అనేది ప్రముఖమైన విషయంగా ముందుకు వచ్చింది. రాజకీయాలు మిలటరీ వ్యవహారాలకు నాయకత్వం వహించాలా? లేక అటు నుండి ఇటా? కమ్యూనిస్టు పార్టీ తుపాకీని తన అదుపులో ఉంచుకోవాలా లేక తుపాకీ పార్టీని అదుపులో ఉంచుకోవాలా? సైన్యాన్ని ఏ విధంగా నిర్మించాలి, దాని వెన్నంటి వచ్చే విప్లవ విజయం లేదా అపజయాలలో ఈ సమస్యకు సంబంధం ఉంది.

కార్మికుల, రైతుల ఎర్ర సైన్యాన్ని స్థాపించినపుడే మావో ఈ సమస్యపై కేంద్రీకరించారు. 1929లో కుటియన్‌లో జరిగిన ఎర్ర సైన్యపు నాలుగవ సైన్యం యొక్క తొమ్మిదవ పార్టీ కాంగ్రెస్ కోసం కా. మావో తయారు చేసిన తీర్మానంలో సైన్యాన్ని పార్టీ నాయకత్వం కింద , పర్యవేక్షణ కింద ఉంచాలనే సాధారణ సూత్రాన్ని రూపొందించారు. పార్టీ సరైన పంథాలను అమలు చేయాలంటే శుద్ధ మిలటరీ

దృక్పథం గలవారు గుర్తించ నిరాకరిస్తారు. వారు రాజకీయాలకు మిలటరీ వ్యవహారాలను పోటీగా నిలబెట్టి ఇవే రాజకీయాలను నడిపించాలని అంటారు. "నువ్వు మిలటరీపరంగా మంచిగా ఉంటే, రాజకీయంగా కూడా మంచిగా ఉంటావు. నువ్వు మిలటరీపరంగా మంచిగా లేకుంటే, నువ్వు రాజకీయంగా ఏమాత్రం మంచిగా ఉండలేవు" అంటారు వాళ్ళు. అందుకనే నిర్మాణపరంగా వారు సైన్యం, రాజకీయ విభాగాలను మిలటరీ విభాగాల కింద ఉంచాలంటారు. ఈ దృక్పథం వల్ల వచ్చే ప్రమాదాల్ని సూటిగా ఎత్తి చూపుతూ కా. మావో ఇలా అన్నారు :

"ఈ భావాల్ని పెరగనిస్తే గనక, అది ప్రజల నుండి దూరమయ్యే, ప్రభుత్వంపై సైన్యం అదుపుకూ, కార్మికవర్గ నాయకత్వం నుండి దూరం కావడానికి చేపట్టినట్లువుతుంది"[1]

ఆ తర్వాత కా. మావో అనేకసార్లు ఈ విషయాన్ని ఎత్తి చూపారు :

"పార్టీ తుపాకీపై ఆధిపత్యం వహిస్తుందనేది మన సూత్రం. ఎప్పుడూ కూడా పార్టీపై తుపాకీ ఆధిపత్యం వహించే అవకాశం ఇవ్వకూడదు."[2]

కచ్చితంగా మన సైన్యం ప్రజాసైన్యం కనక, కార్మికవర్గ సైన్యం కనక, సైన్యం కృషిలో రాజకీయ కృషికి ప్రాధాన్యతనివ్వాలి. అందులో పార్టీ రాజకీయ నాయకత్వ పాత్రను నొక్కి చెప్పాలి. ఈ సైన్యం సంపూర్ణంగా పార్టీ నాయకత్వాన్ని ఆమోదించాలి. తన సిబ్బందినంతటినీ మార్క్సిజం లెనినిజంతోనూ, మావో ఆలోచనతోనూ సాయుధుల్ని చేయాలి – చైనా విప్లవ నిర్దిష్ట ఆచరణతో మార్క్సిజం లెనినిజం విశ్వజనీన సత్యాన్ని మేళవించే భావనతో వారిని సాయుధుల్ని చేయాలి. సైన్యం పార్టీ అందులోని విధానాలనూ, కార్యక్రమాన్నీ, పంథాను అలాగే ప్రభుత్వం చేసే చట్టాలను కూడా అమలు పరచాలి. చైతన్యయుతంగా క్రమశిక్షణను పెంపొందించాలి. సైన్యంలోని 'మూడు–ఎనిమిది'[3] పని శైలిని అమలు చేయాలి. ఆఫీసర్లకూ, సైనికులకూ మధ్య ఐక్యతా సూత్రాన్నీ సైనికులకూ, పౌరులకూ మధ్య ఐక్యతా సూత్రాన్నీ కచ్చితంగా అమలుపరచాలి. సైన్యంలోని ఐక్యతను సైన్యానికీ మిగతా విభాగాలకూ మధ్య ఐక్యతనూ పటిష్టపరచాలి. ఇది మాత్రమే సైన్యం కార్మికవర్గ చైతన్యాన్ని కలిగి ఉండేలాగ, ఉన్నత పోరాట పటిమను కలిగి ఉండేలా, ప్రజలతో సన్నిహితంగా ఐక్యమయ్యేలా, ఎటువంటి ఇబ్బందుల్లోనైనా, కష్టాల్లోనైనా భయపడకుండా ఉండేలా, శత్రువులందరినీ ఓడివ్వగల్గేలా సైన్యాన్ని తయారుచేయగలదు. సైన్యంలో పార్టీ రాజకీయ కృషిని పద్ధతి ప్రకారం చేయడం ద్వారా మాత్రమే దీన్నంతా సాధించగల్గుతాం. అది చేయకుండా ఇది సాధ్యం కాదు.

సైన్యంలో ఐక్య నాయకత్వానికీ, ఐక్యతకూ కేంద్ర బిందువుగా రెజిమెంట్ స్థాయికంటే పైన ఉన్న వివిధ స్థాయిల యూనిట్లన్నిటిలో చైనా కమ్యూనిస్టు పార్టీ కమిటీల్ని స్థాపించింది. వీటి లక్ష్యం రాజకీయ కృషిని కొనసాగించడం, రాజకీయాలు మిలటరీ వ్యవహారాలనూ, పార్టీ సైన్యంపై ఆధిపత్యాన్నీ నెరపాలనే సూత్రాన్ని ఆచరణలోకి తేవడం. అలాగే పార్టీ కమిటీ యొక్క ఐక్య ఉమ్మడి నాయకత్వం కింద నాయకత్వ కేడర్లు బాధ్యతల్ని స్వీకరించే పద్ధతిని కూడా పార్టీ సైన్యాన్ని నడిపించడంలో ఉండే ఒక మౌలిక పద్ధతిగా పార్టీ ప్రవేశపెట్టింది. పార్టీ కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని సైన్యానికి నిర్దిష్టంగా అన్వయించిన పద్ధతి కూడా ఇది. పరిస్థితులకు అవసరమైనట్లుగా అన్ని ముఖ్యమైన సమస్యలపై అత్యవసర నిర్ణయాలు చేసే హక్కు నాయకత్వ కేడర్లకు ఉంటుంది. అయితే సాధారణంగా పార్టీ కమిటీలో ఇది ముందుగా పూర్తిగా చర్చించిన తర్వాతనే నిర్ణయాలను చేసి అమలు చేయాలి. సైన్యం మీద కార్మికవర్గ పార్టీ రాజకీయ నాయకత్వానికి హామీ నిచ్చేలాగ సైన్యంలో రాజకీయ విభాగాల, రాజకీయ పద్ధతిని కూడా నెలకొల్పాలి. మళ్ళీ ఇవన్నీ పార్టీ కేంద్ర కమిటీ ఐక్య నాయకత్వం కింద ఉంటాయి. ఈ విధంగా స్థానిక పార్టీ కమిటీ సైన్యంపై మరింతగా పర్యవేక్షణను కొనసాగించగల్గుతుంది.

ఈ వ్యవస్థలవల్ల సైన్యం పద్ధతి ప్రకారం, సమగ్రంగా తరచుగా, శక్తివంతంగా రాజకీయ కృషిని కొనసాగించగల హామీ లభిస్తుంది. పార్టీ సంపూర్ణ నాయకత్వం కింద నిజమైన కార్మికవర్గ విప్లవ సైన్యంగా అది ఉండేలాగ హామీనిస్తుంది. ఎటువంటి సమయంలోనైనా, ఏ దేశంలోనైనా పార్టీ ఇచ్చే రాజకీయ కర్తవ్యాలను నెరవేర్చడానికి కృషి చేసే పార్టీ సాధనంగా అది ఉండేలాగ హామీనిస్తుంది.

విప్లవ యుద్ధాల్లో విజయం సాధించాక, కార్మికవర్గ ప్రభుత్వ అధికారంలో ప్రజా విముక్తి సైన్యం ముఖ్యమైన భాగంగా నిలుస్తుంది. ప్రజా విముక్తి సైన్యం యొక్క మహత్తరమైన రాజకీయ కృషి సంప్రదాయాలన్ని కొనసాగించడం, దాన్ని మరింతగా విప్లవీకరించడం, ఆధునికీకరించడం అనేవి కార్మికవర్గ నియంతృత్వాన్ని బలోపేతం చేయడానికి ఎంతో ముఖ్యమైన, విడదీయరాని షరతులు.

అన్ని రకాల కృషిలోనూ రాజకీయ కృషిని గుండెకాయలాగ చూడడమూ, రాజకీయాలకు అన్నిటిపై ఆధిక్యతలో ఉండడమూ మార్క్సిజం–లెనినిజంలోని సాధారణ సూత్రం. ఇది కేవలం మిలటరీ రంగానికే కాక అన్ని రంగాలకూ తప్పక వర్తిస్తుంది.

రాజ్యాధికారాన్ని చేపట్టాక, కార్మికవర్గానికి ఆర్థిక పరివర్తన, నిర్మాణం అనే సీరియస్ కర్తవ్యాలు ముందుకొచ్చాయి. గతంలో మనం ఎన్నో యుద్ధాలు చేశాం.

అక్కడ కేవలం రాజకీయాలకూ, మిలటరీ వ్యవహారాలకూ మధ్య సంబంధాన్ని మాత్రమే చూశాం. అయితే ఇప్పుడు మనం నిర్మాణ కృషి చేస్తున్నాం. ఇక్కడ ఒకవైపు రాజకీయాలకూ మరోవైపు ఆర్థికానికీ, టెక్నిక్‌గా ఇంకా ఇతర అంశాలకూ మధ్య సంబంధంలో సరిగా ఎలా వ్యవహరించాలి అనేది ఒక ముఖ్యమైన సూత్రంగా ఉంటుంది. ఆర్థిక నిర్మాణం ఏ మౌలిక దిశలో ఉండాలి అనే విషయాన్ని ఇది ప్రభావితం చేస్తుంది. కార్మిక వర్గ నియంతృత్వం విజయవంతమౌతుందా, ఓటమి పాలవుతుందా విప్లవమూ, నిర్మాణమూ విజయవంతమౌతాయా, ఓటమి పాలౌతాయా అనే విషయాల్ని ప్రభావితం చేస్తుంది.

యుద్ధం "ఇతర మార్గాల్లో రాజకీయాల కొనసాగింపే" అనే సూత్రం ఉంది కనక రాజకీయాలు మిలటరీ వ్యవహారాలపై ఆధిక్యతను కలిగి ఉంటాయనీ, మిలటరీ పోరాటం రాజకీయ కర్తవ్యాలను నెరవేర్చే సాధనాలేననేది సరియైనదేనని కొందరు భావిస్తారు. అయితే కార్మికవర్గం రాజ్యాధికారాన్ని చేజిక్కించుకున్న తర్వాత ఆర్థికవాద రాజకీయాలు ఆధిక్యతలో ఉండకూడదంటారు. ఎందుకంటే ఇప్పుడిక ప్రధాన కర్తవ్యం ఆర్థిక నిర్మాణం కనక రాజకీయాలు ఆర్థిక పునాదికి సేవ చేయాలని వారు అంటారు. వీరి ప్రకారం రాజకీయాలపై ఆర్థికం ఆధిపత్యం వహించాలి తప్ప అటునుండి ఇటు కాదు. ఈ వాదన సరియైందేనా? లేదు, ముమ్మాటికీ కాదు.

కార్మికవర్గం రాజ్యాధికారాన్ని స్వాధీనం చేసుకున్నాక దాని ప్రధాన కర్తవ్యం నిస్సందేహంగా ఆర్థిక పరివర్తననూ, నిర్మాణాన్నీ కొనసాగించడమే. అందువల్ల దాని ప్రధాన శక్తి యుక్తులన్నీ ఆర్థిక కృషి మీద సోషలిజాన్నీ, కమ్యూనిజాన్నీ నిర్మించడానికి చేసే పోరాటం మీద కేంద్రీకరించాల్సిందే. అయితే దీన్ని ప్రధాన కర్తవ్యంగా ఎత్తి చూపడం ఏ మాత్రం సరిపోదు. మనం కర్తవ్యాలను ముందుంచడమే సరిపోదు. వాటిని ఎలా పరిపూర్తి చేయాలనే సమస్యను కూడా పరిష్కరించాలి. సోషలిస్టు దేశాల ఆర్థిక నిర్మాణాన్ని ఎలా కొనసాగించాలి, ఏ దిశలో, ఏ పంథాతో, ఏ విధానాలతో దాన్ని కొనసాగించాలి? ఈ కృషి పట్ల మన వైఖరి, మన దృక్పథం ఎలా ఉండాలి? మనం మొదటగా ఈ సమస్యల్ని పరిష్కరించకపోతే, క్రమంగా పరిష్కరించకపోతే, ఆర్థిక కర్తవ్యాలను పరిపూర్తి చేయలేకపోతాం. సోషలిస్టు ఆర్థికాన్ని నిర్మించలేకపోతాం.

మరో మాటలో చెప్పాలంటే, గతంలో మిలటరీ పోరాటంలో విజయాన్ని పార్టీ రాజకీయ నాయకత్వం నిర్ణయించినట్లే, సోషలిస్టు ఆర్థిక నిర్మాణంలో విజయం కూడా మొదటిగా పార్టీ నాయకత్వం మీదా, కార్మికవర్గ నియంతృత్వ ప్రభుత్వ నాయకత్వం మీదా ఆధారపడి ఉంటుంది. అలాగే పార్టీ పంథాలూ, విధానాలూ సరిగానే ఉన్నాయా

లేదా అనే దానిపైనా, మనం రాజకీయ దృక్పథంలో సమస్యలను పరిష్కరిస్తున్నామా లేదా అనే దానిపైన కూడా అది ఆధారపడి ఉంటుంది. అందుకని ఇప్పటికీ రాజకీయాలే ఆధిపత్యంలో ఉంటాయి. ఆర్థిక కృషిని పరిపూర్తి చేయడానికి, ఇది ముందు షరతుగా, మౌలిక హామీగా ఉంటుంది.

సోషలిస్టు దశలో రాజకీయాలకూ, ఆర్థికానికీ మధ్య అంతఃసంబంధాల గురించి లెనిన్ ఒకసారి నిర్దిష్టంగా వివరించారు :

1920 నవంబర్‌లో మిలటరీ పోరాటంపై కేంద్రీకరణ తగ్గించుకోగలిగి దేశంలో అంతర్గత పోరాటంపైనా, ఆర్థిక నిర్మాణంపైనా కృషి చేయగల్గే స్థితికి సోవియట్ రాజ్యాధికారం చేరుకున్నాక, లెనిన్ ఇలా ఎత్తిచూపారు:

"సోషలిజాన్ని ఎలా నిర్మించాలనే విషయాన్ని చేసి చూపించడం అవసరం. ఆర్థిక నిర్మాణంలో వచ్చే రాజకీయానుభవం ఆధారంగానే ప్రచార కృషి అంతా జరగాలి"[4]

.... అతని అనుచరులు ట్రేడ్ యూనిట్ల విషయంలో వివాదాన్ని లేవనెత్తి పైన చెప్పిన దృక్పథం పైన దాడి చేసినప్పుడు లెనిన్, "ఆర్థిక విషయాలపై రాజకీయాల ఆధిపత్యం ఉండి తీరాల్సిందే" అంటూ మళ్ళీ సంబంధం చెప్పాడు. పేరుగాంచిన ఈ మార్క్సిస్టు సూత్రాన్ని ఆయన నొక్కి వక్కాణించాడు. సోషలిస్టు సమాజంలో కూడా దీనికి మినహాయింపు లేదని చెప్పాడు. ఆయన ఇలా అన్నారు:

"ఆర్థిక విషయాల కేంద్రీకృత వ్యక్తీకరణే రాజకీయాలు అని నేను మళ్ళీ మళ్ళీ నా ఉపన్యాసంలో చెప్తున్నాను. ఎందుకంటే నా 'రాజకీయ' వైఖరిని ఒక మార్క్సిస్టు పూర్తి అన్యాయంగా వ్యతిరేకించాడని నేను విన్నాను. ఒక మార్క్సిస్టు నుండి ఇది ఏ మాత్రం జరగకూడని విషయం. రాజకీయాలు ఆర్థిక విషయాలపై ఆధిపత్యం వహించి తీరాల్సిందే. ఇందుకు భిన్నంగా వాదించడమంటే మార్క్సిస్టు మౌలిక సూత్రాల్ని విస్మరించడమే"[5]

లెనిన్ ఇంకా ఇలా అన్నారు :

"ఒక విషయం పట్ల సరైన రాజకీయ వైఖరి లేకుండా ఏ వర్గం అయినా తన పాలనను కొనసాగించలేదు. పర్యవసానంగా తన స్వంత ఉత్పత్తి సమస్యలను కూడా పరిష్కరించుకోలేదు. విషయం అంతా ఇదే. (మార్క్సిస్టు దృక్పథం ప్రకారం విషయం ఇలా తప్ప ఇక వేరే విధంగా ఉండలేదు)"[6]

సోషలిస్టు ఆర్థిక పునాదికి సోషలిస్టు రాజకీయాల ఉపరితలాంశం ఉండి తీరాలి అనేది స్పష్టమే. సోషలిస్టు ఆర్థిక నిర్మాణానికి హామీ మాత్రం కార్మికవర్గ పార్టీ పద్ధతి

ప్రకారం కొనసాగించే రాజకీయ కృషే.

సోషలిస్టు దశలో, రాజకీయాలూ, రాజకీయ కృషీ ఆర్థికానికీ, ఆర్థిక కృషికీ సంబంధించి ఒక నూతన, ప్రత్యేక, అపూర్వమైన ముఖ్యమైన పాత్రను నిర్వహిస్తారు.

మొదటి విషయం, సోషలిస్టు కమ్యూనిస్టు ఆర్థిక వ్యవస్థలు ఇతర ఆర్థిక వ్యవస్థల్లాగ యాదృచ్ఛికంగా పుట్టవు. అభివృద్ధి కావు. పాత సమాజంలో సోషలిస్టు ఆర్థిక వ్యవస్థకు మూలాలు ఉండవు. కార్మికవర్గ అగ్రగామి అయిన కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం కింద కార్మికవర్గ రాజ్యాధికారం దానిని సృష్టించాల్సి ఉంటుంది. సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ నెలకొన్న తర్వాత కూడా, దాన్ని సంఘటిత పరచడం, అభివృద్ధి పరచడం, కమ్యూనిస్టు ఆర్థిక వ్యవస్థగా దాన్ని పరివర్తన చెందించడం యాదృచ్ఛికంగానో, పథకం లేకుండానో జరగడం సాధ్యం కాదు. ఇది కేవలం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం కింద కార్మికవర్గ రాజ్యాధికారం ఆర్థిక వ్యవస్థను ఇక ఐక్య, పథకం ప్రకారం నిర్మించడం ద్వారా మాత్రమే సాధ్యం. సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ నాయకత్వమూ, మేనేజిమెంటూ తమ స్వంత అభివృద్ధి సూత్రాల్ని పాటించాలి. కార్మికవర్గ రాజకీయ పార్టీ మాత్రమే, దాని నాయకత్వం కింద ఉండే కార్మివర్గ రాజకీయాధికారం మాత్రమే సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ సూత్రంపై చైతన్యయుతంగా పట్టు సాధించగలవు. అందుకని ఆర్థిక కార్యకర్తలూ, ఆర్థిక విభాగంలోని యూనిట్లలోని బాధ్యతాయుతమైన కామ్రేడ్స్ అందరూ తమ కార్యకలాపాలన్నిటికీ పార్టీ పంథాలనూ, విధానాలనూ ప్రారంభ బిందువులుగా చేసుకుని చైతన్యయుతంగా వాటిని అమలుపరచాలి. అలాగే ప్రభుత్వ పథకాన్ని కూడా వారు పాటించాలి. మొత్తానికి ఒక భాగాన్ని లోబర్చి ఉంచడం అంటేనే రాజకీయాలను ఆధిపత్యం వహించాలని అర్థం. ఈ చైతన్యయుతమైన వైఖరి లేకుండా, సమగ్ర దృక్పథం లేకుండా పథకం ప్రకారం జరిగే రాజకీయ కృషి దానికి హామీగా లేకుండా సోషలిస్టు ఆర్థిక కృషిని మంచిగా చేయలేము. ఈ విషయంలో ఎటువంటి యాదృచ్ఛిక లేదా పథకం లేకుండా చేసే చర్య అయినా లేదా ఎటువంటి రూపంలోనైనా డిపార్టుమెంటలిజం (ఏ విభాగానికి ఆ విభాగాన్ని విడదీసి చూడ్డం – అను) గా ఉండడం గానీ సోషలిస్టు నిర్మాణ ఆశయానికి సీరియస్ హానిని కలుగజేస్తుంది.

రెండవ విషయం, సోషలిస్టు ఆర్థిక నిర్మాణమూ, సోషలిజం నుండి కమ్యూనిజానికు పరివర్తన ఒక సంక్లిష్టమైన వర్గపోరాట వాతావరణంలో జరుగుతాయి. పాత శక్తుల, సంస్థల అవశేషాలకు వ్యతిరేకంగా జరిగే నిరంతర పోరాటంలో మాత్రమే సోషలిస్టు ఆర్థిక వ్యవస్థను స్థాపించడం అభివృద్ధి పరచడం జరుగుతుంది. ఈ పాత

శక్తులూ, కాలం చెల్లిన భావాలూ పాత వ్యవస్థల్ని శాసిస్తాయి. ఇవి త్వరగా నశించిపోవు. ఈ పోరాటం సుదీర్ఘంగానూ, కష్టభూయిష్టంగానూ ఉంటుంది. ఆర్థిక నిర్మాణంలో ప్రజలందరికీ నాయకత్వం వహించడంలో కార్మికవర్గ లక్ష్యం వారికి ఒప్పించబడిన ఒక గొప్ప చారిత్రక కర్తవ్యాన్ని నెరవేర్చడమే. అన్ని రకాల దోపిడీలనూ అంతం చేసి, వర్గాలనూ, వర్గాల మధ్య తేడాలనూ రద్దు చేసి కమ్యూనిస్టు సమాజాన్ని సృష్టించడం, మానవాళిని విముక్తి చేయడమే ఆ చారిత్రక కర్తవ్యం. అందుకనే సోషలిస్టు ఆర్థిక నిర్మాణానికి పూనుకునేటప్పుడు మనం కేవలం శుద్ధ ఆర్థిక దృక్పథంతోనో లేదా ఉత్పత్తి శక్తుల అభివృద్ధి దృక్పథంతోనో మొదలు కాకూడదు. మనం కార్మికవర్గ రాజకీయ దృక్పథంతో మొదలు కావాలి. మనం పరిస్థితులనూ, ఆర్థికాభివృద్ధినీ, ఆర్థిక కృషిలో తలెత్తే వివిధ ధోరణులనూ మార్క్సిస్టు, లెనినిస్టు వర్గ దృక్పథంతో, వర్గ విశ్లేషణా పద్ధతిని ఉపయోగించి విశ్లేషించాలి. తద్వారా బూర్జువా వర్గం మీద కార్మికవర్గ విజయానికి అనుకూలంగా ఉండే సరైన మార్గాన్ని అన్వేషించాలి. అయితే స్వదేశంలోనూ, విదేశాల్లోనూ ఉండే బూర్జువాలు, శత్రువులూ సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి దిశను దారి మళ్ళించడానికీ, దానినెదిరించడానికీ ప్రతీ ఒక్క యాదృచ్ఛిక ధోరణినీ, రాజకీయాల నుండి విడివడిన అన్ని రకాల శుద్ధ ఆర్థిక దృక్పథాల్నీ లేదా ఆర్థికవాద దృక్పథాల్నీ లేదా కార్మికవర్గ రాజకీయ, సైద్ధాంతిక నాయకత్వాన్ని బలహీనపర్చగల ఏ ఇతర దృక్పథాన్నీ గానీ పూర్తిగా వినియోగించుకుంటాయి. సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ క్రమంగా పతనమైపోవాలనే ఉద్దేశంతో, “శాంతియుతమైన పరివర్తన, సోవియట్ అధికారం శాంతియుతంగా ముక్కలు చెక్కలు కావడం”[7] గా మార్చాలనే ఉద్దేశంతో వారు ఇదంతా చేస్తారు. అందుకనే సోషలిస్టు దేశాల్లో ఆర్థిక విభాగాలు రాజకీయ కృషిని బలోపేతం చేయకుంటే, కార్మికవర్గ రాజకీయాలతో, భావజాలంతో విశాల ప్రజానీకాన్నీ, కార్యకర్తలనూ ఎడ్యుకేట్ చేసుకోకపోతే చాలా ప్రమాదం. అదే సమయంలో ఈ కింది ధోరణులు అభివృద్ధి కావడాన్ని అడ్డుకున్నా చాలా ప్రమాదం. రాజకీయాలను పట్టించుకోకుండా పనిమీద శ్రద్ధ చూపించాలనడం, శుద్ధ ‘భౌతిక ప్రోత్సాహకాల’ ను కోరుకోవడం, రివిజనిస్టు ధోరణి.

మూడవ విషయం, సోషలిస్టు దేశాల్లో ఆర్థిక నిర్మాణ స్వయంపోషకత్వం అనే సూత్రం పైనా, శ్రామిక ప్రజల మీదా సోషలిజాన్ని నిర్మించడంలోనూ, అభివృద్ధి పరచడంలోనూ దేశ సహజవనరుల మీద ఆధారపడడాన్ని నొక్కి చెప్పాలి. అయితే దీనర్థం అంతర్జాతీయ రాజకీయాల నుండి, అంతర్జాతీయ వర్గ పోరాటం నుండి మొత్తంగా కార్మికవర్గ ప్రపంచ విప్లవం నుండి సోషలిస్టు దేశంలోని ఆర్థిక నిర్మాణాన్ని

వేరుపర్చాలని కాదు. ఒక దేశంలో విప్లవం గాని, నిర్మాణం గానీ అదే సమయంలో ఒక అంతర్జాతీయ ఆశయంగా కూడా ఉంటుంది. ఇతర ప్రజలందరి విప్లవాలన్నిటికీ మద్దతు పలికే కర్తవ్యం ప్రతి సోషలిస్టు దేశానికీ ఉంటుంది. అంతే కాదు, దాని సోషలిస్టు నిర్మాణానికి కూడా అంతర్జాతీయ కార్మికవర్గం యొక్క, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న విప్లవ ప్రజానీకం యొక్క మద్దతు అవసరం. అందుకని సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ నిర్మాణంలో సోషలిస్టు దిశను నొక్కి చెప్పడమేకాక కార్మికవర్గ అంతర్జాతీయతా సూత్రాన్ని కూడా పాటించాలి. అన్ని విభాగాల, యూనిట్లలోని కార్మికులూ ప్రపంచ విప్లవాన్నీ, రాజకీయ స్థితినీ పట్టించుకునేలా ప్రోత్సహించడం మన రాజకీయ కృషిలో ఒక కర్తవ్యం. ప్రపంచ విప్లవ ప్రజానీకం మద్దతు లేకుండా మన నిర్మాణాన్ని కొనసాగించలేమనీ, మన విజయాలను వాటికి మద్దతు పలకడానికి ఉపయోగించాలనీ, కార్మికవర్గ అంతర్జాతీయతకు భిన్నంగా నిలిచే అన్ని రకాల ధోరణులనూ– ఉదాహరణకు అగ్రరాజ్యం దురహంకారం– వ్యతిరేకించాలనీ వారికి అర్థం చేయించడం కూడా ఈ కర్తవ్యంలో భాగమే. ఇటువంటి రాజకీయ కృషిని విస్తృతంగానూ, సుదీర్ఘంగానూ కొనసాగించాలి.

ఒకప్పుడు కా. మావో ఇలా అన్నారు : "అన్ని రకాల ఆర్థిక కృషికీ రాజకీయ కృషి జీవనాడి వంటిది. సమాజ ఆర్థిక వ్యవస్థ ఒక మౌలికమైన మార్పుకు గురవుతున్న కాలంలో ఇవి ప్రత్యేకంగా మరింత సత్యం".[8] ఒక సమాజ ఆర్థిక విషయాలపై రాజకీయాల ఆధిపత్యం ఉండాలనే సూత్రాన్ని పాటించకపోతే విప్లవ రాజకీయ కృషిని బలోపేతం చేయకపోతే మన నిర్మాణ కృషిని సక్రమంగా కొనసాగించలేం.

ప్రజా సైన్యాన్ని నిర్మించిన మొదటి రోజుల్లోనే రాజకీయాలనే నొక్కి చెప్పినట్లుగా, నేడు కూడా కా. మావో సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ నిర్మాణం కోసం సమీకరించబడిన పెద్ద ప్రజా సమూహాన్ని కూడా రాజకీయంగా అభివృద్ధి పరచాలి అని నొక్కి వక్కాణించారు. రాజకీయాలను పట్టించుకోని ధోరణిని విమర్శించాలని ఆయన మనకు పదే పదే గుర్తు చేశారు. ఒక దిక్కు మనం పడకకుర్చీ రాజకీయ కవులను, వ్యతిరేకించాలి. రాజకీయాలనూ, సిద్ధాంతాన్నీ పట్టించుకోకుండా రోజువారీ రొటీన్ పనిలో కూరుకుపోతే ఒక దిక్కు దిశ లేని ఆర్థికవేత్త గానో, టెక్నీషియన్ గానో మనం తయారవుతాం. ఇది చాలా ప్రమాదకరమైనది. ఆర్థిక, సాంకేతిక కృషిని పరిపూర్తి చేయడానికి సైద్ధాంతిక, రాజకీయ కృషి మాత్రమే హామీగా నిలుస్తుంది. ఇవి రెండూ ఆర్థిక పునాదికి సేవ చేసేవే. మన కృషికంతటినీ రాజకీయ, సైద్ధాంతిక కృషి గుండెకాయ వంటిది. రాజకీయ, సైద్ధాంతిక కృషిలో మనం ఏ మాత్రం ఏమరుపాటుగా

ఉన్నా అది మన ఆర్థిక, సాంకేతిక కృషిని పక్కదోవ పట్టిస్తుంది.

రాజకీయ కృషిని నెలకొల్పే, బలోపేతం చేసే పద్ధతినీ, తద్వారా ఆర్థిక రంగంలో లక్షలాది ప్రజల కార్యకర్తల విప్లవోత్తేజాన్ని మేల్కొల్పడాన్నీ పి. ఎల్. ఎ నుండి మన దేశంలోని ఆర్థిక, పారిశ్రామిక, వ్యవసాయక, వాణిజ్య విభాగాలన్నీ నేర్చుకోవాలని కా. మావో ప్రత్యేకంగా సూచించారు.

1938 మేలో కా. మావో "దీర్ఘకాల ఘోరం పై" అనే తన గ్రంథంలో రాజకీయ సమీకరణ ఎలా చేయాలో వివరంగా చెప్పారు. ఆయన ఇలా అన్నారు:

"రాజకీయ సమీకరణ అంటే ఏమిటి? మొదటిగా, ప్రజలకూ, సైన్యానికీ యుద్ధం రాజకీయ లక్ష్యం (జపాన్ ప్రతిఘటనా యుద్ధం) గురించి చెప్పడం. సైనికులందరికీ, పౌరులందరికీ యుద్ధం ఎందుకు చేసి తీరాలో అది తమకు సంబంధించిన విషయం ఎలా అవుతుందో తెలియడం అవసరం. యుద్ధం రాజకీయ లక్ష్యం "జపాన్ సామ్రాజ్యవాదాన్ని తరిమేసి స్వేచ్ఛా, సమానత్వం గల నూతన చైనాను నిర్మించడం. ఈ లక్ష్యాన్ని మనం సైనికులకీ, పౌరులకీ అందరికీ చాటి చెప్పాలి. తద్వారానే మనం ఒక జపాన్ వ్యతిరేక వెల్లువను సృష్టించి లక్షలాది ప్రజలను ఒక్క మనిషిగా ఐక్యపరిచి యుద్ధంలో వారి సర్వస్వాన్నీ అంకితం చేసేలా చేయగల్గుతాం. రెండవది, వారికి కేవలం లక్ష్యాన్ని వివరిస్తేనే సరిపోదు, దాన్ని సాధించడానికి అవసరమైన విధానాలూ, బాధ్యతా కూడా మనం అందివ్వాలి. అంటే ఒక రాజకీయ కార్యక్రమం ఉండాలన్నమాట. జపాన్‌ను ప్రతిఘటించి దేశాన్ని రక్షించడానికి మన వద్ద ఇప్పటికీ పది పాయింట్ల కార్యక్రమం ఉన్నది. అలాగే సాయుధ ప్రతిఘటన, జాతీయ పునర్నిర్మాణ కార్యక్రమం కూడా ఉన్నది. మనం ఈ రెండిటినీ సైన్యంలోనూ, ప్రజల్లోనూ బాగా ప్రచారం చేసి వాటిని అమలు పరచడానికి అందరినీ సమీకరించాలి. ఒక స్పష్టమైన, నిర్దిష్టమైన రాజకీయ కార్యక్రమం లేకుండా జపాన్‌కి వ్యతిరేకంగా చివరకంటా పోరాడడానికి సాయుధ శక్తులన్నిటినీ, ప్రజలందరినీ సమీకరించడం సాధ్యం కాదు. మూడవది: వారిని ఎలా సమీకరించాలి? నోటి ప్రచారం ద్వారా, కరపత్రాలు, బులిటెన్ల ద్వారా, వార్తాపత్రికలు, పుస్తకాలు, నాటకాలు, సినిమాలు ద్వారా, స్కూళ్ళ ద్వారా, ప్రజా సంఘాల ద్వారా, మన కార్యకర్తల ద్వారా సమీకరించాలి. ఇప్పటివరకు కొమింటాంగ్ ప్రాంతాల్లో చేసినదంతా సముద్రంలో కాకిరెట్ట వంటిదే. అలాగే అది ప్రజల అభిరుచులకనుగుణంగా గానీ వారి మనసులకు హత్తుకునేలా గానీ లేదు. దాన్ని మనం మౌలికంగా మార్చేసేయాలి. నాలుగవది, సమీకరించడం ఒకసారి జరిగితే సరిపోదు. ప్రతిఘటనాయుద్ధంలో రాజకీయ కార్యక్రమాన్ని వల్లె

వేయడమే మన పనికాదు. ఎవరూ అలాంటి మంత్రోచ్ఛారణల్ని వినరు. యుద్ధం కోసం చేసే రాజకీయ సమీకరణను యుద్ధంలో జరిగే అభివృద్ధితోనూ, సైనికుల, ప్రజల జీవితాలతో మనం జోడించాలి. దాన్ని ఒక నిరంతర ఉద్యమంగా చేయాలి. ఇది ఎంతో ప్రాముఖ్యత గల అంశం. యుద్ధంలో మన విజయం ప్రాథమికంగా దీని మీదనే ఆధారపడి ఉంటుంది.[9]

జపాన్ వ్యతిరేక యుద్ధం నాటి చైనా, ఇప్పటి చైనాకి పూర్తిగా భిన్నమైనది. ఇప్పుడు మన ముందున్న కర్తవ్యాలూ భిన్నమైనవి. అయినప్పటికీ, సాధారణ పత్రాలూ, పర్షియన్లకు సంబంధించి చూసినప్పుడు మాత్రం కా. మావో చెప్పిన ఈ విషయాలు ఇప్పటికీ వివిధ రకాల రాజకీయ కృషికి మార్గదర్శకత్వం వహించడంలో ఆచరణాత్మక ప్రాముఖ్యత కలిగినవే.

విప్లవ యుద్ధాన్ని కొనసాగించడానికి ప్రజలనూ, సైన్యాన్నీ ఎలా సమీకరించలనేది కా. మావో చెప్పారు. ఇప్పుడు సోషలిస్టు నిర్మాణానికి ప్రజలందరినీ సమీకరించడం మన రాజకీయ కృషి లక్ష్యం. తమ పని యొక్క రాజకీయ ప్రాముఖ్యతను పూర్తిగా గుర్తించడానికీ, తమ విప్లవ చేవను బలోపేతం చేసుకోవడానికీ, పార్టీ విధానాలను వారు అర్థం చేసుకోవడానికీ, తమ పనిలో తీసుకోవాల్సిన అన్ని చర్యలనూ అర్థం చేసుకోవడానికి కార్యకర్తలకూ, ప్రజలకూ తాము చేస్తున్న ప్రతీ పనికీ ఉన్న రాజకీయ లక్ష్యాన్ని వివరించడం రాజకీయ కృషి అవుతోంది. పార్టీ విధానం యొక్క సరైన మార్గంలోకి వారి విప్లవోత్సాహాన్ని నడిపించడం కోసమే మనం ఇదంతా చేయాలి. వివిధ కాలాల్లో, వివిధ కొత్త కర్తవ్యాలు ఎదురైనప్పుడు ఇటువంటి రాజకీయ కృషిని నూతన పరిస్థితుల కనుగుణంగానూ, ప్రజల కార్యకర్తల ఆలోచనల కనుగుణంగానూ పదే పదే చేయాల్సి ఉంటుంది. పి.ఎల్.ఎ. రాజకీయ కృషిలో ఈ విషయంలో ఎన్నో సుసంపన్నమైన అనుభవాలు ఉన్నాయి.

పి.ఎల్.ఎ. పద్ధతిని ఉపయోగించిన అన్ని సందర్భాల్లో పద్ధతి ప్రకారం, శక్తివంతమైన, విప్లవకరమైన రాజకీయ కృషిని చేయగల్గుతున్నాం అనీ, పార్టీ నాయకత్వం పూర్తిగా గుర్తించబడుతుందనీ, నిజమైన ప్రజా ఉద్యమాలు పుట్టుకొస్తాయనీ (అంటే కొంతమంది పాలనా సంబంధమైన నాయకులు మాత్రమే అన్ని పనులూ చేసే పరిస్థితికి భిన్నంగా), నాయకత్వమూ, ప్రజలూ గొప్ప విప్లవోత్తేజాన్ని ప్రదర్శిస్తారనీ, పెత్తందారీతనం గానీ, "భౌతిక ప్రోత్సాహకాల" గురించి మాత్రమే పట్టించుకునే స్థితి గానీ ఉండవనీ వాస్తవాలు నిరూపిస్తాయి.

పి.ఎల్.ఎ. రాజకీయ కృషి నుండి నేర్చుకునేటప్పుడు, వారు ప్రతీ కర్తవ్యాన్నీ

నెరవేర్చడానికి నిర్దిష్టమైన చర్యల్ని ఏ విధంగా రూపొందించుకున్నారో కూడా మనం నేర్చుకోవాలి. అంటే రాజకీయ కృషి వాస్తవాల నుండి మొదలవ్వాలి. తర్వాత రాజకీయ కార్యకలాపాలకు విస్తరింపజేసేలా దాన్ని కింద వరకు తీసుకువెళ్ళాలి. రాజకీయ కృషి వాస్తవం మీద ఆధారపడి ఉంటూ సోషలిస్టు నిర్మాణానికి ఉపయోగపడ్తుంది కనుకనే అది మన కృషి అంతటిలో అంత శక్తివంతమైన పాత్ర వహిస్తోంది. ఉత్పత్తి క్రమంలో, ఆచరణాత్మక కృషిలో, రోజువారీ జీవితంలో, ప్రతీ ఒక్కరి విషయంలో రాజకీయ కృషిని కొనసాగించినప్పుడు మాత్రమే అది కీలకంగా ఉంటూ ఆర్థికశాస్త్రంతోనూ, సాంకేతిక శాస్త్రంతోనూ మంచిగా కలగలసి పోగల్గుతుంది. ఈ విధంగా రాజకీయ కృషిని కొనసాగించడం వల్ల ప్రజల్లో పార్టీ విధానాలనూ, పంథాలనూ కొనసాగించడం వీలవుతుంది. అది ఆచరణగా దీన్ని మారుస్తుంది. ఇవన్నీ ఒక మహత్తర శక్తిగా తయారై మన కృషిని త్వరగా ముందుకు పోనిస్తాయి.

సోషలిస్టు నిర్మాణంలోని వివిధ రంగాల్లో పి.ఎల్.ఎ. లాగానే రాజకీయ కృషికీ, ఇతర పనులకూ మధ్య సంబంధంలో రాజకీయ కృషికి ప్రధమ స్థానాన్నివ్వాలి. పి.ఎల్.ఎ. లాగానే మన కార్యకర్తలకు రాజకీయాల ప్రాధాన్యతను అర్థం చేయిస్తూ వారిని అభివృద్ధి పరచాలి. వారి ఆలోచనలను అందుకనుగుణంగా మలచాలి. ఉన్నతమైన రాజకీయ చైతన్యం గల సోషలిస్టు నిర్మాతల సైన్యం మీద ఆధారపడ్డం ద్వారానే మనం నిజంగా నిర్మాణంలోని వివిధ కర్తవ్యాల్ని నెరవేర్చగల్గుతాం. ఈ గొప్ప సైన్యం అజేయమైనది. మన శత్రువులందరూ – వర్గ శత్రువుగానీ, ప్రకృతి శక్తులు గానీ – దాని ముందు కుప్ప కూలిపోతారు. మానవ సమాజంలో, కొత్త అనుభవాలు నిరంతరంగా సృష్టి అవుతూనే ఉంటాయి.

**– (హంకీ (ఎర్రజెండా), నెం. 6, 1964)**

1. "పార్టీలో తప్పుడు భావాలను సరిదిద్దుట" – మావో.
2. "యుద్ధం, వ్యూహానికి సంబంధించిన సమస్యలు" – మావో.
3. సుదీర్ఘమైన కష్టభూయిష్టమైన విప్లవ పోరాట క్రమంలో చైనా ప్రజా విముక్తి సైన్యం చైనా కమ్యూనిస్టు పార్టీ మరియు కా. మావో సేటుంగ్‌ల నాయకత్వంలో ఒక చక్కని పని శైలిని అలవర్చుకున్నది. కా. మావో దీన్ని మూడు నినాదాలూ, ఎనిమిది లక్షణాలుగా క్రోడీకరించారు. మూడు నినాదాలూ ఇవి : "రాజకీయ వైఖరికి ధృడంగా అంటిపెట్టుకుని ఉండు", "కష్టపడి పని చేసే తత్వాన్నీ, సాదా సీదాగా ఉండే పని శైలినీ కొనసాగించు", "వ్యూహం ఎత్తుగడల

విషయంలో పట్టువిడుపులతో ఉండు". ఎనిమిది లక్షణాలు అంటే, ఐక్యత, అలర్ట్‌గా ఉండడం, సీరియస్‌గా కృషి చేయడం, చురుగ్గా ఉండడం. వీటినే "మూడు-ఎనిమిది" పనిశైలి అని సులభతరం చేసి చెప్పారు.

4. "రాష్ట్ర, కేంద్ర విద్యా విభాగాల రాజకీయ విద్యా యూనిట్ల అఖిల రష్యా మహాసభల్లో ఉపన్యాసం" - వి. ఐ. లెనిన్.
5. "మరోసారి ట్రేడ్‌యూనియన్ల గురించి, ప్రస్తుత పరిస్థితి గురించి, ట్రాట్స్కీన్ బుఖారిన్‌ల తప్పుల గురించి" - వి. ఐ. లెనిన్.
6. ఇదే పుస్తకం
7. "రష్యా కమ్యూనిస్టు పార్టీ (బోల్షవిక్కులు) తొమ్మిదవ కాంగ్రెస్" - వి. ఐ. లెనిన్.
8. "సీరియస్ గుణపాఠం" పై ఎడిటర్ నోట్ నుండి "చైనా గ్రామాల్లో సోషలిస్టు వెల్లువ"
9. "దీర్ఘకాలిక యుద్ధం పైన" -మావో.

# సైద్ధాంతిక కృషికి మొదటి స్థానాన్నివ్వాలి

చైనా ప్రజావిముక్తి సైన్యం కా. మావో ఆలోచనా విధానం మార్గదర్శకత్వంలో పుట్టి పెరిగింది. మన "ప్రగతిశీల రాజకీయ కృషి" కర్తవ్యం ప్రజల్లో "ప్రగతిశీల రాజకీయ చైతన్యాన్ని"[1] నింపడమేననీ, 'గొప్ప రాజకీయ పోరాటాల కోసం పార్టీనంతటినీ ఐక్యం చేయడంలో మనం గ్రహించాల్సిన కీలకమైన సంబంధం సైద్ధాంతిక కృషి"[2] అనీ కా. మావో పదే పదే ఎత్తి చూపారు.

1929 డిసెంబర్‌లో, చైనా కార్మికుల, రైతుల ఎర్ర సైన్యాన్ని స్థాపించిన కొద్ది రోజులకు కా. మావో ఎర్రసైన్యపు నాలుగవ సైన్యం తొమ్మిదవ పార్టీ కాంగ్రెస్ కోసం రాసిన పేరు పొందిన తీర్మానంలో - సైన్యాన్ని నిర్మించే క్రమంలో సిద్ధాంతానికీ, రాజకీయలకూ మొదటి స్థానాన్నివ్వాలనీ, సైన్యంలో ఒక ధృడమైన, కార్మికవర్గ సైద్ధాంతిక, రాజకీయ నాయకత్వాన్ని నెలకొల్పాలనీ, శుద్ధ మిలటరీ దృక్పథాన్నీ, ఇతర కార్మిక వర్గేతర భావాలనూ రూపుమాపాలనీ ఎత్తి చూపారు. మార్క్సిజం - లెనినిజం మావో ఆలోచన ప్రాతిపదికగా చైనా ఎర్ర సైన్యాన్ని నిర్మించడానికీ, అది ఒక నిజమైన రాజకీయ దృఢత్వం కలిగిన ప్రజాసైన్యంగా మారేందుకు ఈ తీర్మానం వీలు కల్పించింది.

గత దశాబ్దాల్లో చైనా ప్రజాసైన్యం పార్టీ రాజకీయ కృషి అనే చక్కని సంప్రదాయాన్ని పరిరక్షించి ముందుకు తీసుకుపోతూ వచ్చింది. దాన్ని తన స్వంత సృజనాత్మకతతో నిరంతరం సుసంపన్నం చేస్తూ వచ్చింది. సైద్ధాంతిక కృషిని సంఘటితపరచడం పట్ల అది అత్యంత శ్రద్ధ వహించింది. ఫలితంగా అందులో మిలటరీ, పాలనా సంబంధిత కార్యకర్తలతో సహా అందరూ పాత్ర వహించారు.

పరిస్థితుల నేపథ్యంలో వివిధ కాలాల్లోని కర్తవ్యాలను దృష్టిలో ఉంచుకుని అది మార్క్సిజం–లెనినిజం మావో ఆలోచనా విధానంలో సైనికుల్ని ఎడ్యుకేట్ చేస్తుంది. మార్క్సిజం–లెనినిజం విశ్వజనీన సత్యాన్ని చైనా విప్లవ నిర్దిష్ట ఆచరణతోనూ, నిర్మాణంతోనూ మేళవించే భావనను కూడా అది వారికి బోధిస్తుంది. ఈ విధంగా మన సైన్యం తన శ్రేణుల కార్మికవర్గ చైతన్యాన్ని నిరంతరం పెంచగలిగింది. ప్రజా సైన్యంలో తాము పొందిన శిక్షణ, ఎడ్యుకేషన్‌ల కారణంగా లక్షలాది సాధారణ రైతాంగమూ, కార్మికులూ, ఎందరో విద్యార్థులూ, సిటీ బూర్జువా వర్గానికి చెందిన ఇతర మేధావులూ క్రమంగా తమను తాము (ఆచరణలోనూ, ఆలోచనలోనూ) విప్లవీకరించుకుంటున్నారు. దృఢచిత్తులైన, రాజకీయంగా చైతన్యవంతులైన యోధులుగా తయారయ్యారు. విప్లవానికీ, నిర్మాణానికీ ప్రధాన అండదండలుగా నిలిచారు.

ప్రజా విముక్తి సైన్యం తన రాజకీయ, సైద్ధాంతిక కృషిలో ప్రోది చేసుకున్న అనుభవాల గని మన పార్టీకి, ప్రభుత్వానికీ అమూల్యమైన సంపద అనడం నిస్సందేహం. అన్ని కాలాల్లోని మన కృషికీ అది ఎంతో విలువైనది.

చారిత్రక అభివృద్ధిలో సిద్ధాంతమూ, భావజాలమూ ముఖ్యమైన పాత్ర వహిస్తాయని మార్క్సిస్టు లెనినిస్టులు మొదటినుండీ చెప్తూ వచ్చారు. మానవులు పనులు చేస్తారు. వారి కార్యకలాపాలను భావజాలం నియంత్రిస్తుంది. ఎన్నో రకాల సామాజిక సిద్ధాంతాలు ఉన్నాయి. పురోగామి, విప్లవకర భావాలు సామాజికాభివృద్ధిని పెంపొందించి, దాని నుండి పుట్టుకొచ్చే నూతన కర్తవ్యాలను నెరవేరుస్తాయి. పాత, వెనుకబడిన లేదా అభివృద్ధి నిరోధక భావాలు సామాజికాభివృద్ధిని అడ్డుకుంటాయి. లేదా దాన్ని వెనక్కి తీసుకుపోతాయి. సమాజ భౌతిక జీవితంలోని అభివృద్ధి ముందు ఉంచిన నూతన సామాజిక కర్తవ్యాల నుండి కొత్త సామాజిక భావజాలమూ, సిద్ధాంతాలూ పుట్టుకొస్తాయి. ఒకసారంటూ ముందుకు వచ్చాక అవి ఒక బలమైన శక్తిగా మారతాయి లేదా కొన్ని పరిస్థితుల్లో ఒక నిర్ణయాత్మక శక్తిగా కూడా మారతాయి. సామాజికాభివృద్ధి ముందు ఉంచిన నూతన కర్తవ్యాలను ప్రజలు ఇంకా అవగాహన చేసుకోనప్పుడు, లెనిన్ చెప్పినట్లుగా, "విప్లవ సిద్ధాంతం లేకుండా విప్లవోద్యమం లేదు"[3] అని అనుకున్నప్పుడు, విప్లవకర భావజాలాన్నీ, సిద్ధాంతాల్నీ సృష్టించడం, ప్రచారం చేయడం నిర్ణయాత్మకంగానూ, ప్రథమ ప్రాధాన్యత కలదిగానూ ఉంటుంది. విప్లవ సిద్ధాంతం ఎంత వేగంగా, ఎంత లోతుగా వ్యాప్తి చెందితే, విప్లవోద్యమమూ అంత వేగంగానూ, అంత శక్తివంతంగానూ రూపొందుతుంది. మార్క్స్ "ప్రజలలో

పట్టు సంపాదించుకున్నాక సిద్ధాంతం కూడా భౌతిక శక్తిగా మారుతుంది"[4] అన్నారు. "మానవుల చైతన్యం వస్తుగత ప్రపంచాన్ని ప్రతిబింబించడమే కాక దాన్ని సృష్టిస్తుంది కూడా"[5] అని కూడా లెనిన్ అన్నారు.

సరిగ్గా ఈ కారణం రీత్యానే మార్క్సిస్టు–లెనినిస్టులు ఏ పనిని మొదలు పెట్టాలన్నా సైద్ధాంతిక నిర్మాణంలోనే మొదలు కావల్సి ఉంటుంది. అంటే ప్రజల మానసిక స్థితి మీదా, తమ ఆచరణలో వారు ఏ సిద్ధాంతాల్ని అనుసరిస్తున్నారు అనేదాని మీదా, వారి భావజాలం వాస్తవాలతో సరిపోతుందా లేదా అనే దాని మీదా, ఆ పని మంచిగా చేయగల్గుతామా లేదా? ఆ కర్తవ్యాన్ని విజయవంతంగా పరిపూర్తి చేయగల్గుతామా? లేదా అనేది నిశ్చయాత్మకంగా ఆధారపడి ఉంటుంది. విప్లవకర భావాలున్న ప్రజలు మాత్రమే విప్లవ కృషిని కొనసాగించగల్గుతారు. విప్లవ పార్టీలూ, పురోగామి శక్తులూ విప్లవ భావాలను ప్రచారం చేస్తాయి.

గతంలో, రాజ్యాధికారం స్వాధీనం కోసం, కార్మికవర్గం విప్లవభావాలను మొదటగా ప్రచారం చేసి ప్రజలను ఉత్తేజపరచాల్సి వచ్చింది. ఆ తర్వాత వారిని విప్లవ విజయం కోసం చైతన్యయుతంగా పోరాడేలా సమీకరించాల్సి వచ్చింది. ఇప్పటికీ విప్లవకర ఆలోచనను ప్రచారం చేయడాన్ని అంటే సైద్ధాంతిక కృషిని ప్రథమ కర్తవ్యంగా చూపాల్సిన అవసరం ఉన్నదా? అంటే కార్మికవర్గం అధికారంలోకి వచ్చాక, కార్మికవర్గ పాలకపార్టీ ప్రజలను సోషలిస్టు విప్లవంలోనూ, సోషలిస్టు నిర్మాణంలోనూ నేతృత్వం వహిస్తున్న నేటి సమయంలో కూడా ఈ అవసరం ఉన్నదా?

మన పార్టీ ఇప్పుడు పరిపాలించే పార్టీ, అది ఇప్పుడు రాజ్యాధికారానికి అధినేత. ప్రభుత్వ అధికారం ద్వారా అది తన పనిని కొనసాగిస్తుంది. మన పాలనాపరమైన, ఆర్థికపరమైన కృషి రోజురోజుకూ మరింత సంక్లిష్టంగా, భారీగా తయారవుతోంది. చాలా పనుల్లో పాలనాపరమైన ఆదేశాల్నివ్వాల్సి ఉంటుంది. ఇటువంటి పరిస్థితుల్లో, కేవలం ఆదేశాల మీదా, అధికారం మీదా నిర్మాణపరమైన నాయకత్వం మీదా ఆధారపడి కర్తవ్యాల్ని నెరవేర్చగలం అని కొందరు భావించవచ్చు. ఆర్థిక కృషిలో కూరుకుపోతే సరిపోతుందనీ, సైద్ధాంతిక కృషి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించనవసరం లేదనీ, ప్రజల, కార్యకర్తల సైద్ధాంతిక పరిస్థితుల గురించి పట్టించుకోనవసరం లేదనీ వారు భావించవచ్చు లేదా సరైన రాజకీయ క్యాంపెయిన్ ఉన్నప్పుడు మాత్రమే కొంత సైద్ధాంతిక కృషి చేయాల్సిన అవసరం ఉంటుందనీ, అంతే తప్ప రోజువారీగా, పథకం ప్రకారం ఈ రంగంలో కృషి అవసరం ఉండదనీ వారు భావించవచ్చు.

ఈ భావాలు సరియైనవేనా? ఏ మాత్రం కాదు. ఇక్కడ లేవనెత్తిన ప్రశ్నలు ఏ

మాత్రం తక్కువ ప్రాముఖ్యత కల్గినవి కావు. గొప్ప ప్రాముఖ్యత కలిగినవి. మన పని నిజంగా విప్లవకర స్వభావంతో కూడుకున్నదా లేదా మన సోషలిస్టు ఆశయం సాఫీగా ముందుకు పోతుందా లేదా అనేదానికి సంబంధించిన ప్రశ్నలివి.

సోషలిస్టు విప్లవాన్నీ, సోషలిస్టు నిర్మాణాన్నీ ముందుకు తీసుకుపోవాలంటే, రాజ్యాధికారాన్ని చేజిక్కుంచుకున్న తర్వాత కూడా కార్మికవర్గ పార్టీ విప్లవకర భావాల్ని వ్యాప్తి చెందించడానికి అంటే సైద్ధాంతిక కృషికి ప్రథమ స్థానాన్నివ్వాలి అని చారిత్రక అనుభవం నిరూపించింది.

మొదటి విషయం – సోషలిస్టు విప్లవమూ, సోషలిస్టు నిర్మాణమూ ప్రజల స్వంత ఆశయాలు ఈ నేపథ్యంలో చూసినప్పుడు మనం ప్రజల్ని విప్లవకర భావాలతో ఎడ్యుకేట్ చేస్తూ, వారి విప్లవ చైతన్యాన్ని పెంచుతున్నంత కాలం వారు విప్లవం కోసం, నిర్మాణం కోసం చైతన్యవంతంగా, మనస్ఫూర్తిగా, శక్తి అంతటినీ వెచ్చించి పని చేయగల్గుతారు. అప్పుడే ఒక నిజమైన సోషలిస్టు ఉద్యమం పెంపొందుతుంది.

రెండవ విషయం – సోషలిజంలోనూ వర్గపోరాటం కొనసాగుతూ ఉంటుంది. ముఖ్యంగా భావజాల, రాజకీయ రంగాల్లో ఇది ఎంతో సంక్లిష్టంగానూ, తీవ్రంగానూ ఉంటుంది. సంపూర్ణంగానూ నూతన సోషలిస్టు వ్యవస్థను నెలకొల్పాలంటే, ప్రజల బుర్ర నుండి అన్ని పాత భావాల, సంప్రదాయాల అవశేషాలనూ తుడిచేసి వాటి నుండి వారిని పూర్తిగా దూరం చేయాల్సి ఉంటుంది. సైద్ధాంతిక, రాజకీయ రంగాల్లో సోషలిస్టు విప్లవం విజయవంతం కాకుండా, కార్మికవర్గం సోషలిక్ విజయాన్ని సాధించడం గానీ, పెట్టుబడిదారీ విధానం పునరుద్ధరణను ఆపడం గానీ సాధ్యం కాదు.

ప్రజల్లో విప్లవకర భావాలను వ్యాప్తి చేసి, వారికి సోషలిస్టు, కమ్యూనిస్టు ఎడ్యుకేషన్‌ను ఇవ్వడంలో మన లక్ష్యం వారిని మరింత విప్లవీకరించడం అంటే వారు పెట్టుబడిదారీ భావజాలాన్నీ ఇతర కాలం చెల్లిన భావాలనూ, సంప్రదాయాలనూ విడనాడి కార్మికవర్గ, కమ్యూనిస్టు భావాలను చేపట్టి నిరంతర విప్లవాన్ని కొనసాగించాల్సిన అవసరాన్ని నిజంగా గుర్తించి, కమ్యూనిస్టు ప్రయోజనాల కోసం నిరంతర పురోగతని సాధించేలా వారికి సహాయం చేయడమే.

అంటే మరి పార్టీ లేకుండా, కార్మికవర్గ ప్రభుత్వం అధికారం ప్రజలలో విప్లవకర భావాల్ని నాటకుండా సోషలిస్టు సమాజంలోని ప్రజల రాజకీయ చైతన్యం పెంచడం గానీ వారిలో సోషలిస్టు, కమ్యూనిస్టు భావజాలాన్ని పెంపొందిచడం గానీ సాధ్యమవుతుందా? తమను తాము విప్లవీకరించుకునే నిరంతర క్రమాన్ని

కొనసాగించడానికి ప్రజలు కేవలం తమ స్వంత కృషి మీదే ఆధారపడగలరా? ఇది సాధ్యం కాదని వాస్తవాలు నిరూపిస్తాయి.

అంతర్గత పరిస్థితులను మాత్రం పరిగణనలోకి తీసుకున్నప్పుడు ఒక సోషలిస్టు సమాజం (బహిర్గతంగా అది పెట్టుబడిదారీ సమాజం చేత చుట్టుముట్టబడి ఉంటుంది) పాత సమాజం నుండి ఇంకా పూర్తిగా విడివడనప్పుడు, ఇంకా పాత సమాజపు అవశేషాల్ని అనేక అంశాల్లో కలిగి ఉంటుంది. "బూర్జువా సమాజపు శవాల్ని శవపేటికలో పెట్టేసి పాతిపెట్టుతాము"[6] సోషలిస్టు సమాజంలో "పెట్టుబడిదారీ వ్యవస్థ శవం మన మధ్యనే కుళ్ళిపోతూ, నశించిపోతూ ఉంటుంది. అది గాలిని కలుషితం చేస్తూ మన జీవితాల్ని విషపూరితం చేస్తుంది. తన పాత, కుళ్ళిపోతున్న, నశించిపోతున్న అసంఖ్యాకమైన బంధాలతో అది కొత్తవీ, తాజావీ, యవ్వనోత్తేజంతో నవనవలాడేవీ అయిన వేటినైనా బంధించాలని చూస్తుంది"[7].

ముఖ్యంగా భావజాల రంగంలో ఇది మరింత వాస్తవం. లెనిన్ "బూర్జువా భావజాలం సోషలిస్టు భావజాలం కంటే చాలా ముందు పుట్టింది. అది మరింత పూర్తిగా అభివృద్ధి అయినది కూడా" అని ఎత్తి చూపారు. "బూర్జువా భావజాలం ప్రజల బుర్రల్లో ఉండిపోవడమే కాక అనేక రూపాల్లో జాగ్రత్తగా, ఆకర్షణీయంగా పరిరక్షింపబడుతోంది (ఉదాహరణకు కొన్ని సాంస్కృతిక వారసత్వాలు) అది సుదీర్ఘకాలం తన ప్రభావాన్ని వేస్తూ ఉంటుంది."[8]

పాత భావాలకు జన్మనిచ్చే ఆర్థిక వ్యవస్థను రూపుమాపే సామాజిక, భౌతిక పరిస్థితులను సోషలిస్టు వ్యవస్థ విజయం సృష్టించింది. అది ప్రజలను సోషలిస్టు, కమ్యూనిస్టు ఆలోచనా విధానంలో కూడా సాయుధం చేస్తుంది. దోపిడీ వ్యవస్థ నుండీ, స్వంత ఆస్తి వ్యవస్థ సంకెళ్ళ నుండీ విముక్తి చెందిన సోషలిస్టు సమాజంలోని ప్రజలు, ముఖ్యంగా గతంలోని చిన్న ఉత్పత్తిదారులు ఒక దిక్కు సోషలిజం పట్ల గొప్ప ఉత్సాహాన్ని కలిగి ఉంటారు. వారి రాజకీయ చైతన్యం మున్నెన్నడూ తనంతటి ఉన్నత స్థాయికి చేరుకుని ఉంటుంది. మరోవైపు వివిధ స్థాయిల్లో ఇంకా పాత భావాలూ, సంప్రదాయాలూ వెనక్కి లాగుతూ ఉంటాయి. వారి దృక్పథంలో ఇంకా పాత సమాజపు అవశేషాలు మిగిలే ఉంటాయి. పాత సామాజిక వ్యవస్థ కంటే సోషలిస్టు వ్యవస్థ అన్ని విధాలా ఉన్నతమైందనీ, దోపిడీ నుండి, పేదరికం నుండి, వెనకబాటుతనం నుండి బైటపడి సమిష్టిగా సమృద్ధిని సాధించడానికి సోషలిజమే ఏకైక మార్గం అనీ వారికి స్పష్టంగా అగుపిస్తుంది. వారు దాన్ని అనుభూతి చెందగలరు కూడా. అయితే సోషలిస్టు సమాజ ఆవిర్భావంతో ముందుకు వస్తున్న కొన్ని నూతన విషయాలకు

వారు ఇంకా అలవాటు పడలేదు. వేలాది సంవత్సరాలుగా ఉన్న విషయాలకు వారు ఇప్పటికే అలవాటు పడి ఉన్నారు. అవి వివిధ స్థాయిల్లో వారి మీద ప్రభావాన్ని నెరుపుతూ ఉంటాయి. ఎప్పుడు అవకాశం దొరికినా, పెట్టుబడిదారీ మరియు భూస్వామ్య పాత భావాలు తిరిగి కొందరి బుర్రల్లోకి ప్రవేశించవచ్చు. చాలాసార్లు అది వారి అలవాట్లకు తగినదిగా ఉంటుంది. హానికరమైన భావాలు గల ఒక నాటకాన్ని చూడ్డానికి వెళ్ళడం, పాత జ్ఞాపకాలను తవ్వుకోవడం నూతన భావాన్ని గానీ, దృక్పథాన్ని గానీ ఆమోదించడం కంటే వారికి సహజంగా తోస్తుంది. సంక్లిష్టమైన వర్గపోరాటం జరుగుతున్న వాతావరణంలో, సామాన్య ప్రజలకు, ముఖ్యంగా గతంలో చిన్న ఉత్పత్తివాదులుగా ఉన్నవారికి సంబంధించినంత వరకు, వారు కొన్ని పరిస్థితుల్లో అంటే కార్మికవర్గ భావాల్లో ఎడ్యుకేషన్‌ని తీవ్రంగా కొనసాగించినప్పుడు సోషలిస్టు, కమ్యూనిస్టు భావాల్ని ఆమెదించవచ్చు. ఈ ఎడ్యుకేషన్‌ను తక్కువ చేసినా లేదా పూర్తిగా వదిలిపెట్టినా, అటువంటి పరిస్థితుల్లో, వారు పెట్టుబడిదారీ భావజాలాన్ని ఆమోదించవచ్చు.

సోషలిస్టు సమాజంలో పెరిగినవారు కూడా సోషలిస్టు భావజాలంతో పుట్టిన వారు కాదు. సోషలిస్టు, కమ్యూనిస్టు చైతన్యంతో ఒక కొత్త తరాన్ని ఎదిగించడం అంత సులభతరమేమీ కాదు. నూతన సమాజంలో పుడతారు కనుక వారికి మొదటినుండీ కూడా నూతన సమాజపు విద్యను అందుకునే ఒక అనుకూలత ఉంటుంది. కానీ సరిగ్గా వారు నూతన సమాజంలోనే పెరుగుతున్నారు కనుక పాత సమాజం గురించి వారికి ఏమీ తెలీదు. నిజంగా అణచివేత అంటే ఏమిటి, మనిషిని మనిషి దోచుకోవడం అంటే ఏమిటనేది వారికి అర్థం కాదు. వర్గాలంటే ఏమిటో, వర్గపోరాటం అంటే ఏమిటో వారికి నిజంగా తెలీదు. నూతన సమాజం ఎలా ఉనికిలోకి వచ్చిందనేది వారు నిజంగా, త్వరగా అర్థం చేసుకోలేకపోతారు. దానిని ఎలా నిర్మించాలనేది గానీ, పాత సమాజంతో పోల్చి చూసి నూతన సమాజాన్ని అర్థం చేసుకోవడం గానీ వారికి తెలీదు. ఇది వారి బలహీనత, ఈ బలహీనత పెద్దదే. సంక్లిష్టమైన వర్గపోరాట వాతావరణాన్ని నిరోధించే శక్తి వారిలో సాపేక్షంగా తక్కువగా ఉంటుంది. అందుకని వారి ఎడ్యుకేషన్ పట్ల తగిన శ్రద్ధ వహించకపోతే వారిని పాత సమాజపు శవం రోగగ్రస్తుల్ని చేస్తుంది. దాని అన్ని రకాల అవశేషాలతో కూడిన హానికరమైన భావాలు వారిని ప్రభావితం చేస్తాయి. లేదా పొరపాటుగా ఈ విషయాల్ని విలువైనవిగా అర్థం చేసుకునే అవకాశం ఉంది. అందుకనే కొన్ని పరిస్థితుల్లో అంటే కమ్యూనిజానికి తగిన వారసులుగా ఎదిగించవచ్చు లేదా ఇంకొన్ని పరిస్థితుల్లో

అంటే ఈ ఎడ్యుకేషన్ తగ్గిపోయినప్పుడు గానీ పూర్తిగా లేకుండా పోయినప్పుడు గానీ వారు పెట్టుబడిదారీ విధానం మాయలో పడిపోవచ్చు.

అందుకే సోషలిస్టు సమాజంలో ముఖ్యమైనదీ, నిర్ణయాత్మకమైనదీ పార్టీ సైద్ధాంతిక నాయకత్వమూ, కార్మికవర్గ రాజ్యాధికారమూ, అవి అందించే సైద్ధాంతిక ఎడ్యుకేషనూ సర్వావస్థల్లోనూ మన చైతన్యపు ఆయుధమైన మార్క్సిజం, లెనినిజం పైన మనం ఆధారపడాలి. ఒక ప్రత్యేకమైన అర్థంలో మునుపెన్నటి కంటే ఇటువంటి సైద్ధాంతిక ఎడ్యుకేషన్ ఇప్పుడు మరింత ముఖ్యమైనది.

'ఏం చేయాలి?' అనే తన రచనలో లెనిన్ ఇలా రాశారు:

"ఏదైనా ఒకదాన్నే ఎంచుకోవాలి. బూర్జువా భావజాలం గానీ సోషలిస్టు భావజాలంగానీ, మధ్యే మార్గం ఏదీ లేదు (ఎందుకంటే మానవాళి "మూడో" భావజాలాన్ని సృష్టించలేదు. అంతేకాక వర్గ వైషమ్యాలతో అల్లకల్లోలమైన సమాజంలో వర్గాలకు సంబంధం లేని లేక వర్గాలకు అతీతమైన భావజాలం ఏదీ ఉండదు. అందుకనీ ఏ మాత్రంగానైనా సోషలిస్టు భావజాలాన్ని తక్కువ చేయడం అంటే ఏ కొద్దిగానైనా దాని నుండి పక్కకు పోవడం అంటే బూర్జువా భావజాలాన్ని బలోపేతం చేయడమే అవుతుంది"[9]

లెనిన్ చేసిన ఈ శాస్త్రీయమైన ప్రకటన పెట్టుబడిదారీ సమాజాలకే కాక సోషలిస్టు సమాజాలకు కూడా వర్తిస్తుంది. అంటే పెట్టుబడిదారీ సమాజం నుండి వర్గరహిత కమ్యూనిస్టు సమాజానికి పరివర్తన జరిగే మొత్తం చారిత్రక కాలానికి ఇది వర్తిస్తుంది.

"ప్రజల మధ్య వైవిధ్యాలను సరిగా పరిష్కరించడం" అనే తన పుస్తకంలో మావో ఈ కింది విషయాన్ని ఎత్తి చూపారు: "సోషలిస్టు దేశాల్లో మార్క్సిజం స్థానం వేరుగా ఉంటుంది. అయితే ఈ దేశాల్లో కూడా, మార్క్సిస్టేతర, మార్క్సిస్టు వ్యతిరేక భావజాలాలు ఉంటాయి.

పెట్టుబడిదారీ దేశాల్లోగానీ, సోషలిస్టు దేశాల్లో గానీ కార్మికవర్గ భావజాలానికీ, పెట్టుబడిదారీ భావజాలానికీ మధ్యన మార్క్సిస్టు ఆలోచనావిధానానికీ, మార్క్సిస్టేతర, మార్క్సిస్టు వ్యతిరేక ఆలోచనా విధానానికీ మధ్య వైషమ్యం ఉంటుందని దీనర్థం. ఒకటే తేడా ఏంటంటే పెట్టుబడిదారీ సమాజాల్లో అన్ని రకాల మార్క్సిస్టేతర, మార్క్సిస్టు వ్యతిరేక భావజాలాలు, బూర్జువా భావజాలమూ ఆధిక్యతలో ఉంటాయి. ఇటువంటి స్థితిలో, బూర్జువా భావజాల వ్యాప్తిగానీ, దాని కార్యకలాపాలుగానీ, మార్క్సిజంపై అది జరిపే దాడులు గానీ బహిరంగంగానూ, ఎటువంటి తటపటాయింపులు లేకుండానూ, ఘోరంగానూ ఉంటాయి. అయితే కార్మికవర్గ భావజాలమైన మార్క్సిస్టు

ఆలోచనా విధానం ఆధిక్యతలో ఉండే సోషలిస్టు సమాజాల్లో అవి సాధారణంగా ముసుగులో దొంగతనంగా జరుగుతుంటాయి.

సోషలిస్టు సమాజాల్లో కార్మికవర్గ భావజాలమూ, మార్క్సిస్టు ఆలోచనా విధానమూ దృఢంగా తమ ఆధిపత్య స్థానంలో కొనసాగాలంటే, అంతులేకుండా భావజాల రంగంలో పోరాటాలు జరగాల్సి ఉంటుంది. కేవలం ప్రభుత్వ అధికారం మీదా, పాలక వర్గమైన కార్మికవర్గపు భౌతిక శక్తి మీదా ఆధారపడితే సరిపోదు. కేవలం ఒక్క దేశంలో కాక ప్రపంచమంతటా చారిత్రకంగా కొనసాగుతూ వస్తున్న పాత భావాలతో చుట్టుముట్టబడి వాటి ఒత్తిడికి కార్మికవర్గ భావజాలం గురవుతూ ఉంటుంది. సోషలిజంలో బూర్జువా భావజాలం తన ఆధిపత్య స్థానాన్ని కోల్పోయినప్పటికీ, అదింకా ఒక బలమైన శక్తిగానే ఉంటుంది. పెట్టుబడిదారీ పునరుద్ధరణకు మార్గాన్ని సుగమం చేయడానికి కార్మికవర్గ భావజాలంతో పోటీపడి స్థానాన్ని సంపాదించుకోడానికి అన్ని రకాల రహస్య పద్ధతులనూ అది ఉపయోగిస్తుంది కనక అది మరింత బలమైన శక్తిగా కొనసాగుతోంది. దానివల్ల భావజాల రంగంలో పోరాటం మరింత సంక్లిష్టంగా, పదునుగా మారిపోతుంది. కార్మికవర్గం తన దృక్పథానికనుగుణంగా ప్రపంచాన్ని మార్చాలనుకుంటుంది. బూర్జువా వర్గం కూడా అలాగే భావిస్తుంది. ఈ విషయంలో సోషలిజం విజయం సాధిస్తుందా లేక పెట్టుబడిదారీ విధానం విజయం సాధిస్తుందా అనేది సుదీర్ఘ చారిత్రక కాలంలో మాత్రమే తేలుతుంది.

సోషలిస్టు సమాజంలో బూర్జువావర్గ భావజాలానికీ, కార్మికవర్గ భావజాలానికీ మధ్య వైషమ్యం కొనసాగుతుందనే విషయాన్ని నిరాకరించడం గానీ, "మొత్తం ప్రజల" భావజాలం వంటి అర్థరహితమైన వాదనల్ని అంటే వర్గేతర, వర్గాతీత భావజాలం ఉంటుందనీ వ్యాప్తి చేయడం గానీ ప్రజల్ని కావాలని మభ్యపెట్టడమే అవుతుంది. కార్మికవర్గ భావజాలమైన మార్క్సిజం-లెనినిజం యొక్క ఆధిక్యతా స్థానాన్నీ, మార్గదర్శకత్వాన్నీ చాపకింద నీరులా నిరాకరిస్తూ, బూర్జువా భావజాల ఆధిక్యతను నెలకొల్పి పెట్టుబడిదారీ పునరుద్ధరణకు పరిస్థితుల్ని సృష్టించాలనేది వారి ప్రయత్నం.

అంటే సోషలిస్టు సమాజంలో సోషలిస్టు, కమ్యూనిస్టు భావాలను వ్యాప్తిచేయడం తగ్గిపోయి, కార్మికవర్గ భావజాలం రంగం నుండి నిష్క్రమిస్తే బూర్జువా భావజాలం రంగం మీదకొస్తుందనేది స్పష్టమే. బూర్జువా భావజాలంపై కార్మికవర్గ భావజాలం ఆధిక్యత వహించినప్పుడల్లా, సోషలిజం కోసం జరిగే ఉద్యమం వేగంగా అభివృద్ధి చెందుతుంది. మార్క్సిస్టు-లెనినిస్టు సత్యం అంతటా నెలకొల్పబడుతుంది. ఇందుకు

భిన్నంగా, ఎక్కడైతే బూర్జువా భావజాలం కార్మికవర్గ భావజాలంపై ఆధిక్యతను సాధిస్తుందో, అక్కడే చలనం ఆగిపోతుంది. అనివార్యంగా వ్యతిరేకించతగిన అంశాలు పుట్టుకొస్తాయి.

ప్రజల్ని సోషలిస్టు, కమ్యూనిస్టు భావాలతో, విప్లవ భావాలతో ఎడ్యుకేట్ చేయడానికి వారిని మరింతగా విప్లవీకరించడానికీ అనేక మార్గాల్నీ, పద్ధతుల్నీ ఉపయోగించాలి. అది ప్రస్తుత వర్గపోరాట విప్లవ ఆచరణ మీదా, ఉత్పత్తి కోసం, శాస్త్రీయ ప్రయోగం కోసం జరిగే పోరాటం మీదా ఆధారపడి ఉండాలి. కార్యకర్తల ఆలోచనల్ని విప్లవీకరించడం అంటే మార్క్సిజం-లెనినిజాన్ని అవగాహన చేసుకునే వారి స్థాయిని నిరంతరంగా పెంచడం అనేది ఇక్కడ కీలకంగా ఉంటుంది. ఎందుకంటే ప్రజల్లో విప్లవభావాల్ని వ్యాప్తి చేయడమూ, సైద్ధాంతిక నాయకత్వాన్ని బలోపేతం చేయడమూ అనే పనులను కార్యకర్తల ద్వారానే చేయాల్సి ఉంటుంది. కార్యకర్తల ఆలోచనల్ని నిరంతరం విప్లవీకరించడం, ఫలితంగా నాయకుల పని శైలిలో జరిగే మెరుగుదల, నాయకత్వాన్ని బలోపేతం చేయడం అనేవి ప్రజల్ని మరింతగా విప్లవీకరించడానికి ముందు షరతులు.

మన దేశంలో పెద్ద కార్యకర్తల సైన్యం ఉన్నది. వారి భావజాలపరమైన పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. వారిలో కొందరు అనేక విప్లవ పరీక్షల్లో రాటుదేలి ఉన్నతమైన సైద్ధాంతిక, రాజకీయ స్థాయిని సాధించారు : కొందరు తక్కువ రాటుదేలారు : చాలామంది ప్రత్యేకించి ఈ రంగంలో పనికి కొత్తవారు అయితే వారు ఏ కేటగిరికి చెందిన వారైనప్పటికీ అందరూ తమ సైద్ధాంతిక స్థాయిని పెంచుకోడాన్ని కొనసాగించాలి. మరింతగా విప్లవీకరించబడాలి.

మన దేశం లోపలా, బైటా కూడా పరిస్థితి అభివృద్ధి చెందుతూ ఉన్నది. మనం అనేక కొత్త సమస్యలనూ, కర్తవ్యాలనూ ఎదుర్కొంటాం. నేటి వర్గపోరాటమూ, ఉత్పత్తి కోసం పోరాటమూ గతం కంటే భిన్నమైనవి. రెండూ మరింత సంక్లిష్టమైనవి. వాటిలో అనేక సమస్యలు ఇమిడి ఉన్నాయి. మనలో చాలామంది తరచూ వర్గపోరాటంలో తమకు చాలా అనుభవం ఉందనుకుంటారు. కానీ వారికి ఇటువంటి సమస్యలు ఎదురైనప్పుడు ఏమవుతుంది? సోషలిస్టు పరివర్తన ప్రధానంగా పూర్తయిపోయాక సమాజంలోని వివిధ వర్గాల మధ్య సంబంధాలు ఏమిటి? దేశంలోనూ, రంగాల్లో వర్గపోరాటం ఎలా కొనసాగుతుంది? దాని రూపం ఏమిటి? దేశంలోనూ, అంతర్జాతీయంగానూ జరిగే వర్గపోరాటాల మధ్య అంతఃసంబంధాలు ఏమిటి? మహా అయితే వారు ఈ ప్రశ్నలకు నోటితో జవాబులు చెప్పగలరు. అయితే వాటి వెనక

నిజమైన అవగాహన ఉండదు. లేదా వారు కేవలం దాన్ని సైద్ధాంతికంగా అర్థం చేసుకోగలరు. నిర్దిష్ట సమస్యల దగ్గరకొచ్చేసరికి వారు సులభంగా గందరగోళం పడతారు. లేదా మార్క్సిస్టు-లెనినిస్టు సాహిత్యం నుండి తాము చదివినదంతా గాలికి వదిలేస్తూ పక్కదోవ కూడా పట్టచ్చు. గత కొద్ది సంవత్సరాలుగా వర్గపోరాటాల గుండా ప్రయాణిస్తూనే చాలా మంది మన కామ్రేడ్లు క్రమంగా సోషలిస్టు సమాజంలో వర్గపోరాటం పట్ల తమ అవగాహనను లోతుగా పెంపొదించుకున్నారు. ఆధునిక రివిజనిజంతో పోరాటం వల్ల ముఖ్యంగా చాలామంది ప్రజలు దీని తీవ్రతను అర్థం చేసుకున్నారు. సోషలిస్టు సమాజాల్లో ఇంకా వర్గాలూ, వర్గపోరాటమూ ఉంటుందనీ, అందువల్ల అవకాశవాదానికీ, రివిజనిజానికీ దారితీయగల సామాజిక పునాది ఇంకా ఉనికిలో ఉందనీ గుర్తించగలిగారు. అయితే మనలో ఇంకా చాలామందికి – సోషలిస్టు సమాజాల్లో వర్గపోరాటం అనే ఒక ముఖ్యమైన అంశం గురించి ఇంకా పూర్తిగా తెలీదు అనేది గుర్తించాలి. ఈ విషయంలో కా. మావో ఆలోచనను గ్రహించాలంటే ఇంకా చాలా దూరం పోవాల్సి ఉన్నది.

అందుకని మనం కొత్తగా రాటుదేలాలి. కొత్తగా అధ్యయనం చేయాలి. అంటే మనం కొత్తగా సిద్ధాంతంలో రాటుదేలాలి, మళ్ళీ మార్క్సిస్టు – లెనినిస్టు రచనల్నీ, కా. మావో రచనల్నీ చదవాలి. నూతన వర్గపోరాట ఆచరణలో, ఉత్పత్తి కోసం, శాస్త్రీయ ప్రయోగం కోసం జరిగే పోరాటంలో, సామ్రాజ్యవాదానికీ ఆధునిక రివిజనిజానికీ వ్యతిరేకంగా జరిగే పోరాటంలో భాగంగా మనం ఈ పని చేయాలి. ఇందుకోసం మనం నెగెటివ్ ఉదాహరణలుగా నిలిచే అన్ని రకాల రచనల్నీ కూడా చదవాలి. వీటిలో ఆధునిక, పాత రివిజనిస్టుల రచనలూ, సామ్రాజ్యవాదుల రివిజనిజాన్ని అంచనా కడ్తూ రాసిన రచనలూ కూడా ఉన్నాయి. మన కాలానికి చెందిన అన్ని గొప్ప సమస్యలపైనా, సమకాలీన విప్లవకారులు, మార్క్సిస్టు-లెనినిస్టులు, మార్క్సిస్టు-లెనినిస్టు సూత్రాలను పరిరక్షించడానికి ఏమేం చేశారో మనకు స్పష్టంగా అర్థం కావాలి. అంటే మార్క్సిజం-లెనినిజాన్ని వ్యతిరేకించడానికి పాత పంథా రివిజనిస్టుల అర్థరహిత సిద్ధాంతాల్ని ఆధునిక రివిజనిస్టులు ఏ విధంగా ఉపయోగించుకున్నారో కూడా మనకు స్పష్టత ఉండాలి. మన విచక్షణా జ్ఞానాన్నీ, నిరోధక శక్తినీ రాజకీయంగా, సైద్ధాంతికంగా పెంచుకోవడానికి మనం ఈ పని చేయాలి. సిద్ధాంతంలో మనం రాటుదేలాలి అంటే అర్థం మనం మన ఆలోచనా విధానాన్ని తిరిగి కొత్తగా మల్చుకోవాలి అని కూడా. మరో మాటలో చెప్పాలంటే మార్క్సిస్టు-లెనినిస్టు గతితార్కిక పద్ధతిని ఉపయోగించి మనం విషయాల్ని విశ్లేషించడం

నేర్చుకోవాలి. జడాత్మక ఆలోచనా విధానం ఉంటే మనం విషయాల్లోనూ, పరిస్థితుల్లోనూ వచ్చే మార్పులనూ, అభివృద్ధినీ చూడలేకపోతాం. అది మన దృక్పథాన్ని సంకుచితంగా మార్చి వేస్తుంది. మన ఆలోచనలను జడంగా ఉంచేస్తుంది. ప్రస్తుతం ఉన్న దానితో సంతృప్తిపడేలా చేస్తుంది. కొత్తగా నేర్చుకోడానికి సిద్ధపడనివారు, కొత్తగా రాటుదేలడానికి సిద్ధపడనివారు వెనుకబడిపోతారు. తమను తాము విప్లవీకరించుకునే క్రమాన్ని కొనసాగించకపోతే వారు దిగజారిపోయి రివిజనిజాన్ని ఆమోదించవచ్చు కూడా.

"ఏదేని ఒక పార్టీ లేదా ప్రభుత్వ విభాగంలోని కార్మికులకూ ఎంత ఉన్నతమైన రాజకీయ స్థాయి, ఎంతగా మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంత జ్ఞానం ఉంటే అంత మెరుగ్గానూ, ఫలవంతంగానూ ఆ పని కొనసాగుతుందనీ, అంత మంచి ఫలితాలు కూడా ఆ పని నుండి పొందుతామనీ మనం ఒక సూత్రంగానే ఆమోదించవచ్చు. అలాగే కార్మికుల రాజకీయ స్థాయి తక్కువగా ఉండి, వారికి మార్క్సిస్టు-లెనినిస్టు జ్ఞానం తక్కువగా ఉంటే పనిలో ఆటంకమూ, వైఫల్యమూ ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. కార్మికులు స్వయంగా తయారు కావచ్చు. ఎందుకూ కొరగాని బద్ధకస్తులుగా తయారు కావచ్చు. పూర్తిగా దిగజారవచ్చు కూడా"[10] అని స్టాలిన్ ఎంతో సరిగా దీన్ని వివరించారు.

కార్యకర్తల ఆలోచనల్ని విప్లవీకరించడానికి నిరంతరం చేసే కృషి ఎంత శక్తివంతంగా ఉంటే, మన నాయకత్వ సంస్థల పని అంత శక్తివంతంగా ఉంటుంది. తన నాయకత్వం పని కూడా మరింత శక్తివంతంగా ఉంటుంది.

ప్రస్తుతం వివిధ స్థాయిల నాయకత్వ సంస్థల ప్రధాన కర్తవ్యం (ప్రభుత్వ ఆర్థిక నాయకత్వ సంస్థలతో సహా) దేశాన్ని నిర్మించడంలో నాయకత్వాన్ని అందించడం. ఏ ప్రధాన విషయాలపై ఈ నాయకత్వం కేంద్రీకరిస్తుంది? పెద్ద పెద్ద వ్యవసాయక్షేత్రాలకు 'నాయకత్వం' వహించడం పైననా? గుట్టలు గుట్టలుగా పోగుపడుతున్న తయారైన యంత్రసామగ్రికి 'నాయకత్వం' వహించడం పైననా? అయితే మరి, భూమిని సాగు చేయాల్సింది మానవులే. ఆ యంత్రాలను ఉపయోగించాల్సింది మానవులే. మానవులు లేకుండా, యంత్రాలూ, భూమి అన్నీ విలువ లేనివే! వాటికి ఎటువంటి ఉపయోగమూ ఉండదు. అందుకే నాయకత్వ సంస్థల కర్తవ్యం ప్రాథమికంగా మానవులకు నాయకత్వం వహించడమే, వారిపని మంచి కృషిని చేయడమే. మానవులకీ, యంత్రాలకూ భూమికీ మధ్య ఇతర ఉత్పత్తి సాధనాలన్నిటికీ, ఉత్పత్తి సాధనాలకీ మధ్య సంబంధ విషయంలోనూ ఆర్థిక నాయకత్వ

సంస్థలు సరిగా వ్యవహరించాలి. వీటిలో సరిగా వ్యవహరించకుండా ఆర్థిక కృషిలో మంచిగా పని చేయడం అసాధ్యం. వివిధ స్థాయిలలోని నాయకత్వ సంస్థలు అందుకనే తమ పనిని ప్రజల్లోనూ, వాస్తవాలకు దగ్గరగానూ కొనసాగించాలి. ప్రజలకూ, వాస్తవాలకూ సన్నిహితంగా ఉండాలి. వేగంగా, నిర్దిష్టంగా, సకాలంలో పనులు చేయాలి. ప్రజల మధ్యనే, కిందిస్థాయి సంస్థల్లోనూ ఉత్పత్తి రంగంలో ముందుండే పని చేయాలి. రొటీన్ పని విధానం నుండీ, అన్ని రూపాల్లోకి పెత్తందారీతనం నుండి వారు బైటపడాలి. కేవలం పరిపాలనా సంబంధమైన ఆదేశాలు జారీ చేసి సంతృప్తి పడడం, సైద్ధాంతిక ఎడ్యుకేషన్‌ను నిర్లక్ష్యం చేయడం, పనిలో నిర్లక్ష్యంగా ఉండడం వంటి లోపాల నుండి వారు బైటపడాలి. దీన్ని సాధించడానికి వారు నిరంతరం కార్యకర్తల ఆలోచనల్ని విప్లవీకరించడంతో మొదలు కావాలి అనేది నిస్సందేహం.

మన దేశంలో సోషలిజానికి అవసరమైన ఆర్థిక పునాదిని నిర్మించాం. ఇటువంటి పునాదికి సేవ చేసి, దాన్ని అభివృద్ధి పరచి, సంఘటిత పరచగల తగిన ఉపరితలం కూడా ఉండాల్సిన అవసరం ఉంది. వివిధ స్థాయిల్లోని నాయకత్వ సంస్థల్లోని, కార్యకర్తల్లోని భావజాలపరమైన పరిస్థితులు అనేవి సోషలిస్టు ఉపరితలాంశంలోని ఎంతో ముఖ్యమైన భాగంగా ఉంటాయి. ఉపరితలాంశంలోని ఈ భాగం విప్లవీకరించబడినప్పుడు ఇతర భాగాల్లోనూ ఆ మార్పు సాధ్యమవుతుంది. అప్పుడు మాత్రమే సోషలిస్టు ఆర్థిక పునాదికి తగినట్లుగా ఉపరితలం ఉండగల్గుతుంది. సోషలిస్టు నిర్మాణం కోసం ప్రజల చొరవనూ, సృజనాత్మకతనూ పూర్తిగా వెలికి తీయడం సాధ్యమవుతుంది.

వివిధ రంగాల్లో మన పని అవసరాల రీత్యానూ, విప్లవ పరిస్థితి రీత్యానూ మనకు పి. ఎల్. ఎ. రాజకీయ కృషి అనుభవం నుండి నేర్చుకోవాల్సిన అవసరం ముంచుకొచ్చిందనేది దీని నుండి స్పష్టమవుతోంది. శాంతి కాలంలో గానీ, యుద్ధ కాలంలో గానీ సైన్యంలో పని చేయాలంటే, ఉన్నత స్థాయిల కేంద్రీకరణ, క్రమశిక్షణ, ఆదేశాలను పాటించడం అనేవి మిగతా అన్ని పనుల్లో కంటే ఎక్కువగా అవసరమవుతాయి. అయితే ఇందువల్ల ప్రజా విముక్తి సైన్యం, రాజకీయ–సైద్ధాంతిక కృషిని నిర్లక్ష్యం చేయడాన్ని సరియైనదిగా భావించదు. అందుకు భిన్నంగా అది ఈ పనికి అన్ని రకాల పరిస్థితుల్లోనూ మొదటి స్థానాన్నివ్వాలని నొక్కి చెప్తుంది. దశాబ్దాల తరబడి అది ఈ రంగంలో మంచిగా, క్షుణ్ణంగా పని చేసింది. సైన్యం కా. మావో సేటుంగ్ ఆలోచనలకు తగినట్లుగా ఎదిగిందనీ, మార్క్సిస్టు–లెనినిస్టు నాయకత్వాన్ని ఆచరించిందనీ పై విషయం సూచిస్తోంది.

వివిధ సంస్థల్లోని నిర్దిష్ట పరిస్థితులు భిన్నంగా ఉంటాయి కనుక, ఉండాలి

కనుక వీటిలోని రాజకీయ కృషి వివిధ పద్ధతుల్లో, రూపాల్లో కొనసాగుతుంది. వాటి రాజకీయ అవసరాలూ భిన్నంగా ఉంటాయి. అయితే ఒక పద్ధతి ప్రకారం రోజువారీ రాజకీయ కృషి ద్వారా కమ్యూనిస్టు భావాల్నీ, మార్క్సిజం-లెనినిజాన్నీ ప్రజల్లోనూ, కార్యకర్తల్లోనూ వ్యాప్తి చేసి, వారు మరింతగా విప్లవీకరించబడాల్సిన అవసరాన్ని మనం నిరంతరం దృష్టిలో ఉంచుకోవాలి. "పద్ధతి ప్రకారం", "రోజువారీగా" అని ఎందుకు అంటున్నామంటే కేవలం రాజకీయ క్యాంపెయిన్‌ల ద్వారానే మనం క్షుణ్ణంగా రాజకీయ కృషిని చేయగల్గుతాం అని భావించలేము. అలాగే పాలనాపరమైన నాయకత్వ సిబ్బందిని మినహాయించి కొందరు రాజకీయ కార్యకర్తలకో, లేదా మన బుర్రలో పుట్టే కోరికలకో దీన్ని వదిలేసినా తగిన రాజకీయ కృషి జరగదు. ఈ విషయంలో ప్రతీ ఒక్కరూ బాధ్యత వహించేలా, కీలకమైన సైద్ధాంతిక కృషి పట్ల అత్యంత శ్రద్ధ వహిస్తూ ప్రతీ ఒక్కరూ పద్ధతుల్ని పూర్తిగా రూపొందించుకునేలా మనం చూడాలి.

సోషలిస్టు సమాజంలో మంచిగా సైద్ధాంతిక కృషి చేయడం అంటే క్లుప్తంగా చెప్పాలంటే మానవుల శక్తిని పూర్తిగా వెలికితీయడం అనే. అంతిమ విశ్లేషణలో ఈ పునాదిపైననే, సోషలిజం పట్ల ప్రజలు చూపే ఉత్సాహంపైననే సోషలిస్టు వ్యవస్థ శక్తి బలం ఆధారపడి ఉంటుంది. మనం మానవుల శక్తియుక్తుల్నీ, సోషలిజం పట్ల ప్రజల ఉత్సాహాన్నీ పూర్తిగా వెలికి తీయగలిగితే, మన విప్లవమూ, నిర్మాణమూ సదా అజేయంగా నిలుస్తాయి.

**(హంకీ (ఎర్రజెండా), నెం. 5 1964)**

1. "దీర్ఘకాల యుద్ధంపైన" - కా. మావో
2. "సంకీర్ణ ప్రభుత్వంపైన" - కా. మావో
3. 'ఏం చేయాలి' - లెనిన్
4. మార్క్స్, ఎంగెల్స్ సంకలిత రచనలు
5. "సైన్స్ ఆఫ్ లాజిక్ అన్ హెగిల్ గ్రంథంపై" - వి. ఐ. లెనిన్
6. "అమెరికన్ కార్మికులకు లేఖ" - వి. ఐ. లెనిన్
7. అదే లేఖ
8. 'ఏం చేయాలి' - వి. ఐ. లెనిన్
9. 'ఏం చేయాలి' - వి. ఐ. లెనిన్
10. "సి. పి. ఎస్. యు. (బి) 18వ కాంగ్రెస్‌కు కేంద్ర కమిటీ పనిపై సమర్పించిన నివేదిక"-జె. వి. స్టాలిన్-లెనినిజ్ సమస్యలు.

# సైద్ధాంతిక కృషి వాస్తవాల మీద ఆధారపడి ఉండాలి

మన సైద్ధాంతిక కృషిలో మౌలికమైన ప్రశ్న – అది వాస్తవాల మీద ఆధారపడి ఉండాలా? లేక కేవలం విద్యాలయాల విద్య మీద ఆధారపడి ఉండాలా? అనేదే. ప్రజా గెరిల్లా సైన్యంలో జరిగిన రాజకీయ కృషిలో ఉత్పన్నమైన "నాలుగు ప్రథమ అంశాలు" అనే సూత్రం, పుస్తకాల ద్వారా విద్యనూ, సజీవమైన భావాల ద్వారా విద్యనూ పోల్చి చూసినప్పుడు సైద్ధాంతిక కృషిలో సజీవమైన భావాలకు మొదటి స్థానాన్నివ్వాలని సూచిస్తోంది. మరో మాటలో చెప్పాలంటే, మన సైద్ధాంతిక కృషి వాస్తవాల నుండీ, ఆచరణాత్మకమైన సమస్యల నుండీ మొదలవ్వాలి. అది పుస్తకాలనుండో, అమూర్త సిద్ధాంతాలనుండో, సూత్రాలనుండో మొదలు కాకూడదు.

ఈ విషయంలో తన రాజకీయ–సైద్ధాంతిక కృషి క్రమంలో ప్రజా విముక్తి సైన్యం ఎన్నో గొప్ప అనుభవాలను సంపాదిస్తుంది. పి.ఎల్.ఎ. కంపెనీల సైద్ధాంతిక కృషిలోని అనుభవాల ఆధారంగా తయారైన అంశాలను మొదట క్లుప్తంగా పరిచయం చేస్తాం.

1. మావో ఆలోచనా విధానాన్ని సృజనాత్మకంగా అధ్యయనం చేసి అన్వయించాలి. మొత్తం సైన్యం సైద్ధాంతిక–రాజకీయ కృషిలో దీనిని మౌలిక కర్తవ్యంగా చేపట్టాలి. మౌలికంగా, ప్రతి ఒక్కరూ నిర్దిష్ట సమస్యలను దృష్టిలో ఉంచుకుని అధ్యయనాన్ని చేపట్టాలి. అధ్యయనాన్నీ, అన్వయింపునీ మేళవించాలి. ఈ విధంగా తక్షణం ఫలితాల్ని పొందగల్గుతాం.
2. రాజకీయ విద్యనూ, సైద్ధాంతిక విద్యనూ గరపడంలో కార్మికవర్గ విద్యను పునాదిగా చేసుకోవడంతో మొదలుకావాలి. దీన్ని పునాదిగా చేసుకుని దేశభక్తి,

అంతర్జాతీయ తత్వం, విప్లవ వీరత్వం, పార్టీ, సైన్యం సంప్రదాయాలు మొదలైన విషయాల మీద విద్యను కొనసాగించవచ్చు.

3. వాస్తవాల నుండి మొదలై, ఈ రెండు అంశాలనూ గ్రహించాలి. మొదటిది, పార్టీ కేంద్ర కమిటీ యొక్క పంథాలనూ, విధానాలనూ, నిర్ణయాలనూ, ఉన్నత నిర్మాణాల యొక్క సూచనలనూ కిందకు పంపి వాటిని క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి. రెండవది, అన్ని సమయాల్లోనూ తరచుగా పరిశోధించి, నిర్దిష్ట పరిస్థితులనూ, కంపెనీలోని అన్ని యూనిట్లలోని సైనికుల మనోభావాలనూ తెలుసుకోవాలి. ఈ రెండు అంశాలనూ మేళవించి, నాయకత్వాన్నీ, ప్రజలనూ ఒక దగ్గరకు కూర్చాలి. క్లుప్తంగా చెప్పాలంటే, "ప్రజల నుండి ప్రజల వద్దకు" అనే విధానాన్ని అమలు చేయాలి.

4. పిండ దశలో ఉన్నప్పుడే సమస్యల్ని తీసుకోవాలి. సత్వరంగానూ, సరియైన పద్ధతిలోనూ వాటితో వ్యవహరించి అవి మొక్కలు కాకుండా అడ్డుకోవాలి. అంటే ప్రజల మనసుల్లో తలెత్తబోయే ఆలోచనా ధోరణులనూ, రాబోయే సమస్యలనూ ముందుగానే ఊహించి ఆ సమస్యల్ని వెంటనే పరిష్కరించడంలో మెరుగ్గా ఉండాలి.

5. హేతుబద్ధతను ఉపయోగించి ఇతరులను ఒప్పించడం పైనా, ఎడ్యుకేట్ చేయడం పైనా నిరంతర కృషి చేయాలి. సాధారణంగా చెప్పాలంటే, కార్యకర్తల్లోనూ, సైనికుల్లోనూ తలెత్తే సైద్ధాంతిక సమస్యలు ప్రజల్లోని సరియైన తప్పుడు భావాల ప్రతిఫలనాలే. అందుకనే 'ఐక్యత–విమర్శ–ఐక్యత' సూత్రాన్ని ఉపయోగించాలి. వాస్తవాల నుండి సత్యాన్ని వెలికితీస్తూ, నిర్దిష్ట పరిశీలనను ఉపయోగిస్తూ, ఓపిగ్గా ఎడ్యుకేట్ చేయడానికి ప్రయత్నిస్తూ, సైద్ధాంతిక సమస్యల్ని పరిష్కరించే ప్రయత్నం చేయాలి.

6. ప్రజల సైద్ధాంతిక స్థాయిని మెట్టుమెట్టుగా పెంచాలి. ప్రజలందరికీ ఒకే సైద్ధాంతిక స్థాయిగానీ, ఒకే రాజకీయ చైతన్య స్థాయి గానీ ఉండడం అసాధ్యం. అందుకనే, పురోగామి, మధ్యరకం, వెనకబడినవారు అనే తేడాలున్నాయి. సైద్ధాంతిక కృషి చేసేటప్పుడు అత్యధిక సంఖ్యాకుల్ని దృష్టిలో ఉంచుకోగలిగి అత్యధిక సంఖ్యాకులకు ఆమోదయోగ్యమయ్యే విద్యా విధానాన్ని ఉపయోగించాలి. తద్వారా వారు క్రమంగా పురోగామి స్థాయికి చేరగల్గుతారు.

7. రోజువారీ ఎడ్యుకేషన్‌తో రాజకీయ, సైద్ధాంతిక క్యాంపెయిన్‌లను జోడించాలి. ఒక నిర్దిష్ట కాలం వచ్చే రాజకీయ, సైద్ధాంతిక ఉద్యమాల మీద మాత్రమే

వక్కాణింపు నివ్వకండి. రోజువారీ సైద్ధాంతిక విద్యకు కూడా గొప్ప ప్రాధాన్యతనివ్వండి.

8. ప్రజల్ని సమీకరించి ప్రతి ఒకర్నీ సైద్ధాంతిక కృషిలో భాగం చేయండి. ఉత్తమమైన వ్యక్తుల గురించీ, పనుల గురించీ సకాలంలో నివేదికలనూ, ప్రశంసలనూ అందించండి. చెడు ధోరణులను సకాలంలో ఎండగట్టి సరిదిద్దండి. సమస్యలు తలెత్తినప్పుడు ఆలస్యం లేకుండా వాటిని చేపట్టండి.

9. సిద్ధాంత ప్రాముఖ్యతను, ఆచరణాత్మక సమస్యల పరిష్కారంతో జోడించండి. కేవలం ప్రజల సైద్ధాంతిక సమస్యలను పరిష్కరించడం పైనా, వారి రాజకీయ పురోగతిపైనా మాత్రమే శ్రద్ధ వహించండి. వారి ఆచరణాత్మక సమస్యలను చేపట్టడాన్ని మరవకండి. వారి బాగోగులను పట్టించుకోండి.

10. సజీవమైన విద్యా సామగ్రినీ పద్ధతుల్నీ ఉపయోగించండి. అంటే ప్రజల వ్యక్తిగత అనుభవాల ద్వారా, నిజ జీవితంలోని నిర్దిష్ట వాస్తవాలను ఉపయోగించుకుంటూ, ఉత్తమమైన వ్యక్తుల్నీ, పనులనూ ప్రశంసిస్తూ, మనం విద్యను గరపాలి అని అర్థం.

వాస్తవాల మీద ఆధారపడి సైద్ధాంతిక కృషి చేయడంలోని సారాన్ని పైన పేర్కొన్న పది అంశాలూ పూర్తిగా ప్రతిఫలిస్తున్నాయి.

మన సైద్ధాంతిక కృషిలోని సాధారణ కర్తవ్యం కార్యకర్తల్లోనూ, ప్రజల్లోనూ మార్క్సిజం–లెనినిజాన్ని వ్యాప్తి చేయడం. కామ్రేడ్ మావో ఇలా అన్నారు: "మార్క్సిజం అంటే ప్రజల జీవితాల్లో, పోరాటాల్లో శక్తివంతమైన పాత్ర వహించే సజీవమైన మార్క్సిజం అనే అర్థం. అంతే తప్ప మాటల్లో చెప్పే మార్క్సిజం కాదు".[1] లెనిన్ కూడా ఇదే భావాన్ని ఒకచోట ఇలా వ్యక్తపరిచారు: "మనకు జీవంలేని బొక్కలు కాదు కావాల్సింది, సజీవమైన జీవితం కావాలి".[2] కార్మికవర్గం చేసే వాస్తవమైన పోరాటాల నుండి పుట్టి, నిరంతరం వాస్తవం ద్వారా ధ్రువీకరించబడుతున్న అత్యంత శాస్త్రీయమైన, అత్యంత విప్లవకరమైన సత్యం మార్క్సిజం కనక అది చిరకాలం జీవిస్తుంది. మార్క్సిజం వాస్తవాల నుండి దూరమైనప్పుడు మాత్రమే దాని అన్వయింపు గానీ అభివృద్ధి గానీ, అడ్డగించబడ్తాయి. అందుకనే సిద్ధాంతాన్ని ఆచరణతో జోడించి, ఆచరణాత్మక సమస్యలను పరిష్కరించడానికి మార్క్సిజం–లెనినిజంను అధ్యయనం చేయడమూ, ప్రచారం చేయడమూ కీలకమైన అంశం. ఈ విధంగా చేయడం ద్వారా మాత్రమే ప్రజలు సజీవమైన మార్క్సిజం–లెనినిజం మీద పట్టు సాధించగల్గుతారు.

కొందరు బూర్జువా కార్యకర్తలు వాస్తవాలను ఏ విధంగా ఎదుర్కొని బూర్జువా

విప్లవాల కాలంలో వాస్తవ పోరాటాల్లో చురుకైన పాత్ర వహించారో ఎంగెల్స్ ఒకసారి ఇలా వర్ణించారు:

"అయితే వీరందరిలోని స్వాభావిక లక్షణం ఏమంటే వీరందరూ కూడా సమకాలీన ఉద్యమాల మధ్యలోనే జీవిస్తూ కార్యకలాపాలను కొనసాగిస్తుంటారు. ఆచరణాత్మక పోరాటంలో భాగమవుతారు. వారు ఏదో ఒక పక్షం వహిస్తారు. పోరాటంలో చేరుతారు. కొందరు ఉపన్యాసాల ద్వారా, కొందరు రచనల ద్వారా, కొందరు కత్తి పడతారు, కొందరు రెండూ చేస్తారు. అయితే బాగా చదువుకున్నవారు మాత్రం మినహాయింపు. వారు రెండవ లేదా మూడవ స్థాయి మనుషులు. లేదా చేతులు కాలడం ఇష్టం లేని జాగ్రత్తపరులైన అసమర్థ జీవయాత్రికులు."[3]

బూర్జువా విప్లవ సిద్ధాంతవేత్తలకు కూడా సైద్ధాంతిక కృషిని వాస్తవం నుండి వేరు చేయలేమనే విషయం తెలుసు. మరి కార్మికవర్గ విప్లవకారులం, సిద్ధాంతవేత్తలం, సైద్ధాంతిక కార్యకర్తలం అయిన మనం వాస్తవాల నుండి సిద్ధాంతాన్ని విడదీసే సంస్కృతి హీనుల వైఖరిని నిజమైన విప్లవకర శాస్త్రమైన మార్క్సిజం-లెనినిజం పట్ల ఎలా చేపట్టగలం? అందులోనూ మనం కమ్యూనిజం కోసం పోరాడుతున్నప్పుడు ఈ పనిని ఎలా చేయగలం?

"అధ్యయనాన్ని సంస్కరించుకుందాం" అనే వ్యాసంలో మావో అధ్యయనం విషయంలో రెండు పూర్తి భిన్నమైన వైఖరుల గురించి ప్రస్తావించారు. "ఒకటి, స్వీయాత్మక వైఖరి: ఈ వైఖరి గల వ్యక్తులు మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంతాన్ని అమూర్తంగా చదువుతారు. ఎటువంటి లక్ష్యం లేకుండా చదువుతారు. చైనా విప్లవం ఎదుర్కొంటున్న ఎత్తుగడల పరమైన, సైద్ధాంతికమైన సమస్యల్ని పరిష్కరించే పద్ధతులు, దృక్పథం, వైఖరుల్ని తెలుసుకోవడం కోసం మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్‌ల వద్దకు వారు వెళ్ళరు. వారు కేవలం సిద్ధాంతాన్ని సిద్ధాంతం కోసం అధ్యయనం చేస్తారు. వారు గురిచూసి బాణాల్ని వదలరు, ఇష్టమొచ్చినట్లు బాణాలు వదులుతారు".[4] మరో వైఖరి మార్క్సిస్టు-లెనినిస్టులది: "ఈ వైఖరిలవారు మార్క్సిజం-లెనినిజంని ఒక లక్ష్యం కోసం అధ్యయనం చేస్తారు. అంటే చైనా విప్లవోద్యమంతో మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంతాన్ని మేళవించడానికీ, ఆ సిద్ధాంతం నుండి చైనా విప్లవం ఎత్తుగడల, సైద్ధాంతిక సమస్యలను పరిష్కరించే పద్ధతుల్నీ, వైఖరుల్నీ, దృక్పథాన్నీ తెలుసుకో ప్రయత్నిస్తారు. గురి చూసి బాణాన్ని కొట్టే వైఖరి ఇది".[5]

సైద్ధాంతిక కృషిలో సరైన దిశను అంటిపెట్టుకుని ఉండడం కోసం కా. మావో సేటుంగ్ పార్టీలో స్వీయాత్మకమైన, చెడు అధ్యయన పద్ధతులకు వ్యతిరేకంగా సుదీర్ఘమైన

పోరాటాన్ని చేపట్టారు. పిడివాదుల, అనుభవవాదుల భావజాలానికీ, పని శైలికీ వ్యతిరేకంగా జరిగిన పోరాటం ఇది.

చైనా ప్రజాస్వామిక విప్లవ క్రమంలో, విదేశాల అనుభవాల్ని యాంత్రికంగా తీసుకుని అన్వయించిన కొందరు పిడివాదులు పార్టీలో తలెత్తారు. వారు కూడా మార్క్సిజం-లెనినిజం అధ్యయనాన్ని ప్రోత్సహించారు. అయితే వారికి వాస్తవ పరిస్థితుల గురించిన ఎటువంటి జ్ఞానమూ లేకపోయినప్పటికీ, మార్క్సిస్టు గ్రంథాల నుండి కొన్ని పదాల్నీ, పదబంధాల్నీ వల్లె వేయడం, కాపీ చేయడం అన్ని సమస్యల్నీ పరిష్కరిస్తుందనీ భావిస్తారు. పిడివాదులు కూడా మాటల్లో పదే పదే సిద్ధాంతం ఆచరణతో ముడివడి ఉండాలని వాదిస్తారు గానీ దీన్ని వారు ఎన్నడూ ఆచరించరు. చాలామంది పరిశోధన చేసేవారు చైనా వాస్తవ పరిస్థితిని అధ్యయనం చేయడంపై ఆసక్తి చూపలేదు. బదులుగా వారు ఉత్త 'సిద్ధాంతాన్ని' అధ్యయనం చేయసాగారు. ఈ పిడివాద ధోరణిని ఎదిరిస్తూ కామ్రేడ్ మావో అప్పటి పరిస్థితుల్నీ, చరిత్రనూ అధ్యయనం చేయడం పైనా, సిద్ధాంతాన్ని అన్వయించడం పైనా శ్రద్ధ వహించాలని సూచించారు. చలనం లేని, ఏక పక్షమైన, ఒంటరి అధ్యయన పద్ధతుల్ని వ్యతిరేకిస్తూ ఆయన కార్యకర్తలకు మార్క్సిజం-లెనినిజం మౌలిక సూత్రాల మార్గదర్శకత్వంలో చైనా విప్లవం యొక్క ఆచరణాత్మకమైన సమస్యల్ని అధ్యయనం చేయడం చుట్టూతానే ఈ పద్ధతిని ఆయన రూపొందించారు. ప్రజల్లో ప్రచార కృషిని గురించి చెప్తూ, ఆయన అది ప్రజల మనసులకు హత్తుకునే విధంగా ఉండాలన్నారు. అందుకనే విషయాలతో కూడిన, నిజమైన వాస్తవాలను కలిగి ఉన్న వ్యాసాల ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు. అంటే మన ప్రచారాన్ని ఏ ప్రజలకైతే ఉద్దేశిస్తున్నామో వారి గురించిన సంపూర్ణమైన జ్ఞానం ముందుగా మనకు ఉండాలన్న మాట. ప్రజలను అధ్యయనం చేయకుండా, విశ్లేషించకుండా మనం ప్రచార కృషిలోకి దిగకూడదన్నమాట.

అదే సమయంలో కా. మావో పార్టీలోని అనుభవవాద ధోరణిని కూడా వ్యతిరేకించాడు. ఈ ధోరణి గలవారు సిద్ధాంతాల అధ్యయనాన్ని నిర్లక్ష్యం చేస్తారు. సిద్ధాంత సమస్యలకు, ఆచరణాత్మక సమస్యలను జోడించాల్సిన అవసరాన్ని ఎన్నడూ గుర్తించరు. వాస్తవమైన పనిలో అభివృద్ధి సూత్రాలను కనుగొనాల్సిన అవసరాన్ని పట్టించుకోరు. వ్యక్తిగతమైన పరిణామాలతో వారు తరచూ గందరగోళపడుతుంటారు. లేదా తమ పరిమితమైన అనుభవాల మీదే అత్యధిక నమ్మకాన్ని ప్రదర్శిస్తుంటారు. సిద్ధాంతాన్ని ఆచరణ నుండి విడదీసి చూసే పొరపాటుకు ఇది మరో వ్యక్తీకరణ.

తమ అనుభవాలను క్రమబద్ధీకరించి మరింత సంపూర్ణమైన జ్ఞానాన్ని పొందడానికిగాను మార్క్సిస్టు సిద్ధాంతాన్ననుసరించి తమ అనుభవాల్ని సీరియస్‌గా క్రోడీకరించాలని డిమాండ్ చేయడమే కామ్రేడ్స్‌లోని ఈ లోపాన్ని అధిగమింపజేసే మార్గం అని కామ్రేడ్ మావో సూచించారు.

చైనా ప్రజాస్వామిక విప్లవానికి పైన పేర్కొన్న రెండు స్వీయాత్మక ధోరణులూ తీవ్రమైన నష్టాన్ని కలగజేశాయనేది అందరికీ తెలిసిన విషయమే. అయితే మనం చివరికి విజయం పైన విజయం సాధిస్తూ, ఒక బలమైన శత్రువును ఓడించి ప్రజల సోషలిస్టు నూతన చైనాను స్థాపించాం. ఇది ఎలా సాధ్యమైంది? ఈ తప్పుడు ధోరణులను అధిగమించడంలోనూ, చైనా సమాజ ఆచరణాత్మక సమస్యలను పరిష్కరించడానికి మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంతాలను ఉపయోగించడాన్ని నేర్చుకోవడంలోనూ, చైనా విప్లవ అభివృద్ధి సూత్రాలను కనిపెట్టడంలోనూ పార్టీకి కామ్రేడ్ మావో నేతృత్వం వహించారు. అంతే కాదు, చైనా సమాజ లక్షణాల ననుసరించి విప్లవ వ్యూహాలనూ, ఎత్తుగడలనూ రూపొందించడంలోనూ, ఈ వ్యూహాలకూ, ఎత్తుగడలకూ అనుగుణంగా చైనా ప్రజల్ని సమీకరించి, సంఘటిత పరచడంలోనూ పార్టీకి కామ్రేడ్ మావో నేతృత్వం వహించారు. అందువల్లనే మనం విజయం సాధించగలిగాం.

“ప్రజల అవసరాల్ని తీర్చగలిగిన మేరకు మాత్రమే సిద్ధాంతం ఎప్పుడైనా గానీ ప్రజలలో వాస్తవ రూపాన్ని సంతరించుకుంటుంది”[6] అన్నారు మార్క్స్. ఇంత పెద్ద జనాభా గలిగిన ఒక విశాలమైన దేశంలో కా. మావో మార్గదర్శకత్వం మార్క్సిజం-లెనినిజం అనే సత్యాన్ని విస్తృతంగా వ్యాప్తి చేయడం చైనా విప్లవ నిర్దిష్ట ఆచరణకు మార్క్సిజం-లెనినిజం విశ్వజనీన సూత్రాలను సన్నిహితంగా మేళవించడం, చైనా ప్రజల అవసరాలకు అనుగుణంగా వాటిని మలచడం మార్క్సిజం-లెనినిజం అభివృద్ధి చరిత్రలో నిస్సందేహంగా ఒక గొప్ప ఘటన అని చైనా కమ్యూనిస్టులు భావిస్తున్నారు.

పి. ఎల్. ఎ. “నిర్దిష్ట సమస్యలను దృష్టిలో నుంచుకుని అధ్యయనం చేయండి” అని సూచిస్తుంది. ఆచరణాత్మక సమస్యల దిశగా సైద్ధాంతిక అధ్యయనాన్ని మళ్ళిస్తుంది. మన పార్టీ సైద్ధాంతిక, భావజాలపరమైన కృషి యొక్క మహత్తర సంప్రదాయం ఇది. మనం అన్ని సమయాలలోనూ, అన్ని రకాల పరిస్థితుల్లోనూ ఈ సంప్రదాయాన్ని కొనసాగించాలి. నిజానికి, ఈ సంప్రదాయాన్ని అభివృద్ధిపరచడం పైన శ్రద్ధ వహించి దాన్ని కొనసాగించడం మున్నెన్నటికంటే మరింత అవసరం. ఎందుకంటే గొప్ప

మార్పులు, నూతన అంతర్జాతీయ, దేశీయ విప్లవ పోరాటాలు జరుగుతున్న నూతన చారిత్రక శకంలో మనం జీవిస్తున్నాం.

ఒక గొప్ప, సోషలిస్టు రాజ్యాన్ని నిర్మించే కర్తవ్యం అపూర్వమైనది. ఎందుకంటే చైనా చరిత్రలో అతి గొప్ప, ఉన్నతమైన లక్ష్యం ఇదే. ఎందుకంటే ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి మనం చేసే కృషి మనకు పూర్తిగా కొత్త. సోషలిస్టు దశలో వర్గపోరాటం ఉత్పత్తి కోసం, శాస్త్రీయ ప్రయోగం కోసం జరిగే పోరాటం గతంలో జరిగిన ఇతర విప్లవోద్యమాల కంటే పూర్తిగా భిన్నమైనది. మార్క్సిస్టు–లెనినిస్టు విశ్వజనీన సత్యాలు సరియైన అవగాహనకు చుక్కానిగా నిలుస్తాయి. అందుకని మనం మార్క్సిస్టు–లెనినిస్టు ప్రామాణిక గ్రంథాలను శ్రద్ధగా అధ్యయనం చేయాలి. మన అవగాహనకు మార్గదర్శకత్వాన్ని వాటినుండి పొందాలి. అయితే అనేక ఆచరణాత్మక సమస్యలపైన మన మన స్వంత బుర్రనుపయోగించి నిర్దిష్టమైన నిర్ధారణలకు రావాలి. లెనిన్ చెప్పినట్లుగా :

"సోషలిజాన్ని చేరుకునే మార్గం గురించి మార్క్సుకు గానీ మార్క్సిస్టులకు గానీ ప్రతీ చిన్న వివరంతో సహా అన్నీ తెలుసునని మేం చెప్పడం లేదు. అలాంటివి చెప్పుకోవడం అర్థరహితంగా ఉంటుంది. మనకు తెలిసిందల్లా ఆ మార్గం పోయే దిశ గురించీ, దానిననుసరించే వర్గశక్తుల గురించి మాత్రమే, కోట్లాది ప్రజలు పగ్గాల్ని చేపట్టడం ద్వారా పొందే అనుభవం నుండి మాత్రమే నిర్దిష్టమైన, ఆచరణాత్మకమైన వివరాలు వెలుగులోకి వస్తాయి."[7]

సోషలిస్టు విప్లవమూ, సోషలిస్టు నిర్మాణమూ ఎన్నో కొత్త రకం సమస్యల్ని మన ముందుకు తీసుకొచ్చి పెట్టాయి. అవి మనల్ని ఆలోచించమనీ, సమాధానాలు వెతకమనీ ఒత్తిడి చేస్తున్నాయి. ఉదాహరణకు, సోషలిస్టు సమాజంలో వర్గాల లక్షణాలు ఏవి, వర్గపోరాటం ఎలా ఉంటుంది? కార్మికవర్గ నియంతృత్వాన్ని ఎలా సంఘటితపరచి, అభివృద్ధి పరచాలి? పెట్టుబడిదారీ శక్తులు తలెత్తకుండా, పునరుద్ధానం పొందకుండా ఎలా అడ్డుకోవాలి? సోషలిస్టు ఉత్పత్తిని అభివృద్ధి పరచడం, పెంచడం ఎలా? వ్యక్తికీ, సమిష్టికీ సంబంధాన్నీ ఎలా చూడాలి? సోషలిస్టు సమాజంలో విజ్ఞాన శాస్త్రాన్నీ, కళల్నీ ఎలా పురోగమింపజేయాలి? కార్యకర్తల, ప్రజల భావజాలాన్ని ఎలా ప్రోత్సహించాలి?

దేశీయ సమస్యలతో పాటుగా అంతర్జాతీయ రంగంలో మార్క్సిస్టు–లెనినిస్టులకూ, ఆధునిక రివిజనిస్టులకూ మధ్య పెద్ద ఎత్తున సైద్ధాంతిక చర్చ జరుగుతోందని కూడా అందరికీ తెలుసు. మార్క్సిజం–లెనినిజంలోని విప్లవ సారాన్ని బలహీనపర్చడానికీ,

తద్వారా రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత అంతర్జాతీయ పరిస్థితిలో 'నూతన పరిస్థితులు', 'నూతన లక్షణాలు' వచ్చాయనే సాకుతో కావాలని వాస్తవాల్ని వక్రీకరిస్తూ మార్క్సిజం-లెనినిజం నుండి దూరంగా పోవడానికి ఆధునిక రివిజనిస్టులు ప్రయత్నిస్తూ ఉన్నారు. ఈ విధంగా ప్రపంచ ప్రజల ముందు అనేక నూతన ప్రశ్నల్ని ఉంచారు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత అంతర్జాతీయ పరిస్థితుల్లో వచ్చిన నూతన మార్పులు, నూతన లక్షణాలు ఏవి? ఆధునిక సామ్రాజ్య వాదం లక్షణాలు ఏవి? సామ్రాజ్యవాదం స్వభావంలో మార్పు వచ్చిందా? ఆధునిక రివిజనిస్టులు చెప్తున్నట్లుగా అమెరికా సామ్రాజ్యవాదం ప్రపంచం నుదిటిరాతను మార్చివేయగలదా? చారిత్రక అనుభవాలన్నిటి ద్వారా రుజువైనట్లుగా మానవ చరిత్ర సృష్టికర్త ఎవరు? సమకాలీన ప్రపంచంలో విప్లవానికీ, యుద్ధానికీ, శాంతికీ గల సంబంధం ఏమిటి? సోషలిజానికీ, సామ్రాజ్యవాదానికీ గల సంబంధంతో ఎలా వ్యవహరించాలి? సోషలిస్టు దేశాల మధ్య సంబంధాలతో ఎలా వ్యవహరించాలి? ప్రపంచ విప్లవం ప్రస్తుతం ఏ స్థితిలో ఉంది? దాని భవిష్యత్తు ఏ విధంగా ఉంటుంది? పీడిత ప్రజల, జాతుల విప్లవోద్యమాలను ఏ విధంగా అంచనా కట్టాలి? వాటితో ఎలా వ్యవహరించాలి? ప్రపంచ ప్రజల విప్లవోద్యమాల్లోని అసంఖ్యాకమైన వాస్తవాలు మార్క్సిస్టు-లెనినిస్టు విప్లవ సూత్రాలు నిస్సందేహంగా సరియైనవని రుజువు చేస్తున్నాయా? లేక ఈ సూత్రాలు కాలం చెల్లినవని రుజువు చేస్తున్నాయా? ఆధునిక రివిజనిజ సారం ఏమిటి? దానికి మూలం ఏది? ఈ రాజకీయ చర్చ స్వభావం ఏమిటి? దాని భవిష్యత్తు ఏమిటి?

వాస్తవ జీవితంలో ఎవరూ ఈ ముఖ్యమైన దేశీయ, అంతర్జాతీయ సమస్యలను తలచుకోలేదు. నిజానికి అవి ప్రతీ ఒక్కరి జీవితంతో సన్నిహిత సంబంధం కలిగినవి. ప్రతీ విభాగం యొక్క కృషి, పోరాటం, ప్రజల ఆలోచనలు కూడా ఈ సమస్యలతో దగ్గరి సంబంధం కలవి. వీటితో సంబంధం లేకుండా అవి పని చేయజాలవు. ఈ సమస్యలకూ, వీటి నుండి ఉత్పన్నమయ్యే ఇతర సమస్యలకూ మన సైద్ధాంతిక కృషి శాస్త్రీయమైన సమాధానాలనివ్వాలనే విషయం తేటతెల్లమే.

కా. మావో ఇలా అన్నారు:

"ప్రస్తుతం ఉద్యమం లక్షణాలు ఏవి? దాని సూత్రాలు ఏవి? దానికి ఎలా దిశానిర్దేశం అందివ్వాలి? ఇవన్నీ ఆచరణాత్మకమైన సమస్యలు. ఉద్యమం అభివృద్ధి అవుతోంది. నూతన విషయాలు ఇంకా పుట్టుకొచ్చేదున్నది. అవి నిరంతరంగా పుట్టుకొస్తూనే ఉన్నాయి. ఈ ఉద్యమాన్ని సమగ్రంగానూ, అభివృద్ధి చెందుతున్న

క్రమంలోనూ అధ్యయనం చేయడం అనేది మనం నిరంతరం శ్రద్ధ వహించాల్సిన ఒక గొప్ప కర్తవ్యం. ఈ సమస్యలను జాగ్రత్తగా సీరియస్‌గా అధ్యయనం చేయ నిరాకరించేవారు మార్క్సిస్టులు కారు"[8]

దేశీయంగానూ, అంతర్జాతీయంగానూ కూడా వాస్తవ పోరాటాల నుండి పుట్టుకొచ్చే నూతన సమస్యలపై మనం నిరంతరం శ్రద్ధ వహించాలి. మనం వాటిని అధ్యయనం చేయాలి. ప్రతీ ఒక్క పనికీ, ఉద్యమానికీ గల అభివృద్ధి సూత్రాలను కనిపెట్టాలి. దీని ప్రాతిపదికగా మాత్రమే మనం సరియైన సాధారణ పంథానూ, పోరాటాన్ని గైడ్ చేసే విధానాన్నీ, అనుసరించాల్సిన నిర్దిష్టమైన పంథాలనూ, విధానాలనూ రూపొందించగలం. ఈ విధానాలూ, పంథాలూ ఆచరణలోని సజీవమైన మార్క్సిజం-లెనినిజమే. ప్రజల్ని ఎడ్యుకేట్ చేసి, వారికి వివిధ ముఖ్యమైన సమకాలీన సమస్యలను వివరించి, మెట్టుమెట్టుగా ఆచరణాత్మకమైన పోరాటాలను కొనసాగించి, మార్క్సిజం-లెనినిజం- మావో ఆలోచనా విధానం ప్రాతిపదికన పార్టీ పంథాలూ, విధానాలకనుగుణంగా వారిని ముందుకు నడపడమే మన సైద్ధాంతిక కృషిలోని కర్తవ్యం.

పార్టీ పంథాలూ, విధానాల్లో ప్రజల్ని ఎడ్యుకేట్ చేసి వాటిని అమలు పరిచేలా చేయడం ఎలా? యాంత్రికంగా వాటిని బైటకు చదివేస్తే సరిపోతుందా? నిర్దిష్ట పరిస్థితుల్ని ఏ మాత్రం పట్టించుకోకుండా వారిని ముందుకు తోస్తే సరిపోతుందా? లేదు, మనం ఇలా చేయకూడదు. ఎందుకంటే వివిధ ప్రాంతాల్లో, రంగాల్లో ప్రజల ఆచరణాత్మక అనుభవాల్ని క్రోడీకరించడం ద్వారానే పార్టీ పంథాలూ, విధానాలూ పుట్టుకొస్తాయి. అందుకనే ఏదైనా ఒక రంగానికి లేదా కార్యక్షేత్రానికీ చెందిన నిర్దిష్ట పరిస్థితుల్లో వాటిని అన్వయించినప్పుడు అవి సాధారణ ఆదేశాలుగా మారతాయి. ప్రజల అనుభవాల నుండి చేసిన నిర్ధారణలను వారి వద్దకు తిరిగి తీసుకువెళ్ళినప్పుడు వాటిని ప్రజల వాస్తవ పరిస్థితులకు తగినట్లుగా ఆచరించాల్సి ఉంటుంది. మరో మాటలో చెప్పాలంటే, ఎక్కడైనా గానీ పార్టీ పంథాలూ, విధానాలూ ప్రజల ఆలోచనలతో, నిర్దిష్ట పరిస్థితులతో సన్నిహిత సంబంధాన్ని కలిగి ఉండాలి. ఈ విధంగా మాత్రమే ప్రజల ఆచరణాత్మక, సైద్ధాంతిక సమస్యలను శక్తివంతంగా చేపట్టగల్గుతాం. పార్టీ పంథాలను ప్రజల ఆచరణగా మార్చగల్గుతాం.

గొప్ప సామాజిక మార్పులు జరుగుతున్న కాలంలో, వాస్తవ జీవితం సుసంపన్నంగానూ, సంక్లిష్టంగానూ కూడా ఉంటుంది. అన్ని వర్గాల్లోనూ, సామాజిక సెక్షన్లలోనూ తీవ్రమైన మార్పులు సంభవిస్తున్నాయి. నూతన పరిస్థితులకనుగుణంగా

వివిధ సామాజిక శక్తుల పునఃసమీకరణ జరుగుతోంది. గొప్ప వేగంతో ప్రజా ఉద్యమాలు అభివృద్ధి చెందుతున్నాయి. ప్రజలు నిరంతరం నూతన విషయాల్ని సృష్టిస్తున్నారు. అయితే ప్రజలు ఇంకా అలవాటుపడని ఎన్నో అపరిచిత అంశాలు కూడా ఇంకా ఉన్నాయి. పార్టీ పంథాల పట్ల, విధానాల పట్ల వివిధ వర్గాల ప్రజలు వేర్వేరుగా స్పందిస్తారు. వేర్వేరు వైఖరులు చేపడ్తారు. వేర్వేరు ప్రశ్నల్ని రేకెత్తుతారు. ఇది ప్రజలకూ, కార్యకర్తలకూ కూడా వర్తించే అంశం. విప్లవకర కార్యకర్తల శ్రేణులు విస్తరించే కొద్దీ, ఎందరెందరో "కొత్తవాళ్ళు" వచ్చి చేరుతుంటారు. ఒక్కోసారి నిర్ణయాలు తీసుకోవడంలో వెనకా ముందాడుతుంటారు. నూతన పరిస్థితుల్లో 'అనుభవజ్ఞులు' కూడా అనేక నూతన సమస్యలనెదుర్కుంటారు. ఈ ఆచరణాత్మక సమస్యల కేసి మన సైద్ధాంతిక కృషిని మొదటగా కేంద్రీకరించాలి. వాటి వేర్వేరు స్వభావాల మధ్య తేడాను గుర్తించి వాటిని వివరించడానికీ, చేపట్టడానికీ వేర్వేరు పద్ధతుల నుపయోగించాలి. ఈ విషయంలో పి. ఎల్. ఎ. కంపెనీల సైద్ధాంతిక కృషి ఎన్నో మంచి అనుభవాల్ని మూటగట్టుకుంది.

ఎప్పుడైనా ఆచరణే మొదటి స్థానాన్నాక్రమిస్తుంది. ప్రజలు సరియైన విధానంపై పట్టు సాధించి దాన్ని ఆచరణగా మార్చినప్పుడు కొత్త సమస్యలు పుట్టుకొస్తాయి. దాంతో కొత్త అనుభవాల్ని పోగేసుకోడానికి, కొత్త నిర్ధారణలకు రావడానికి మనం ప్రజలవద్దకు వెళ్ళాల్సి ఉంటుంది. ఉదాహరణకు, సోషలిస్టు సమాజంలో వర్గ సంబంధాల్ని తీసుకుందాం. సోషలిస్టు పరివర్తనా దశలో మన పార్టీ రూపొందించిన విధానాలు ఆ సమయంలో వర్గ సంబంధాలతో సరిగానే వ్యవహరించాయి. అయితే ఉత్పత్తి సాధనాల యాజమాన్యాన్ని మౌలికంగా సోషలిస్టు యాజమాన్యంగా పరివర్తన చెందించాక వర్గ సంబంధాల విషయంలో కొత్త సమస్యలు తలెత్తాయి. దాంతో మన అవగాహనను క్రమంగా లోతుగా పెంపొందించుకోవాల్సిన అవసరం ముందుకొచ్చింది. ఉత్పత్తి సాధనాల యాజమాన్యంలో మార్పు రావడంతోటే దోపిడీ వర్గాలన్నిటినీ వెంటనే రద్దు చేయడం సాధ్యం కాదు. అది సుదీర్ఘ క్రమాన్నే తీసుకుంటుంది. సోషలిస్టు సమాజంలో నూతన బూర్జువా శక్తులు తలెత్తవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో సమిష్టీకరణ జరిగిన తర్వాత సుదీర్ఘ చారిత్రక కాలం వరకు మనం పేద రైతుల్నీ, మధ్యతరగతి రైతుల్నీ నమ్మదగిన మిత్రులుగానే ఆర్గనైజ్ చేయాల్సి ఉంటుంది. మన పార్టీ వర్గ విధానాల్లో నూతన అభివృద్ధికి ఈ ఆచరణాత్మక అనుభవాలన్నీ దారితీశాయనేదీ, వాటికి అన్ని విధాలా నూతన సారాన్ని చేకూర్చాయనేది నిస్సందేహం. ఈ నూతన సారాన్ని వివరించే సైద్ధాంతిక వివరణలు

తప్పక మార్క్సిస్టు–లెనినిస్టు సిద్ధాంతాన్ని ఒకడుగు ముందుకు తీసుకుపోతాయి. ఆచరణ నుండి వచ్చే వివిధ రకాల కొత్త సమస్యలను మనం నిర్లక్ష్యం చేస్తే, వాటిని మార్క్సిస్టు–లెనినిస్టు పద్ధతిలో విశ్లేషించకపోతే, మన సిద్ధాంతాలూ, విధానాలూ వెనకబడిపోతాయి. ఆ విధంగా సోషలిజం, కమ్యూనిజాల సాధనకు తీవ్ర విఘాతాన్ని కల్గిస్తాయి. లేదా ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి.

కా. మావో ఇలా అంటారు:

"మన పార్టీ చేసే ఆచరణాత్మక కృషి అంతటితో, సరియైన నాయకత్వం 'ప్రజల నుండి ప్రజల వరకు' వెళ్ళే క్రమంలో మాత్రమే ముందుకొచ్చింది; దీనర్థం ఏమంటే: ప్రజల నుండి భావాల్ని తీసుకో (అవి చెల్లాచెదురుగా, పద్ధతి లేకుండా ఉండే భావాలు), వాటిని కేంద్రీకరించు (అధ్యయనం ద్వారా వాటిని కేంద్రీకరించబడిన, పద్ధతి కలిగిన భావాలుగా మార్చు) ఆ తర్వాత ప్రజల వద్దకు వెళ్ళి ప్రజలు ఆ భావాల్ని తమవిగా భావించేంత వరకు వాటిని గట్టిగా చేబూని వాటిని ఆచరణగా మార్చేంతవరకు, అటువంటి ఆచరణలోనే అవి ఎంత సరైనదో పరీక్షించే వరకు వాటిని ప్రచారం చేయి. వాటిని వివరించు మరొక్కసారి. ప్రజల నుండి తీసుకున్న భావాల్ని కేంద్రీకరించు. మళ్ళీ ప్రజల వద్దకు వెళ్ళి ఆ భావాలు వారిలోకి ఇంకి ఆచరణలోకి వెళ్ళేలా కృషి చేయి. ఈ విధంగా అనేకసార్లు పదే పదే ఒక అనంతమైన చక్రంలా దాన్ని కొనసాగించాలి. ప్రతిసారీ భావాలు మరింత సరియైనవిగానూ, మరింత కీలకంగానూ, సుసంపన్నంగానూ మారతాయి. ఇదే మార్క్సిస్టు జ్ఞాన సిద్ధాంతం."[9]

సజీవమైన సైద్ధాంతిక కృషిని కొనసాగించడం అంటే అర్థం మన సైద్ధాంతిక కృషి పదే పదే 'ప్రజల నుండి, ప్రజల వద్దకు' అనే క్రమం గుండా పయనించాలి అనే. ఇటువంటి సైద్ధాంతిక కృషే కీలకంగా శక్తివంతంగా ఉంటుంది.

ఆచరణాత్మక పోరాటాల నుండి వస్తున్న వివిధ సమస్యలకు సమాధానం చెప్పడానికీ, ఆచరణాత్మక అనుభవాన్ని క్రోడీకరించడానికీ, సహజంగానే మనం తరచూ మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్, మావో సేటుంగ్‌ల రచనల్ని చూడాల్సి వస్తుంది. మార్క్సిజం–లెనినిజాన్ని సృజనాత్మకంగా అధ్యయనం చేసి అన్వయించడమంటే, ఎదురయ్యే నిర్దిష్ట సమస్యలను పరిష్కరించడానికీ వాటికి సమాధానం చెప్పడానికీ 'ప్రజల నుండి, ప్రజల వద్దకు' పోయే క్రమంలో మార్క్సిజం–లెనినిజాన్ని అధ్యయనం చేసి అన్వయించడం అనే అర్థం.

నిజానికి, మన కామ్రేడ్స్‌లో చాలా మందికి ఈ విధంగానే మార్క్సిజం–లెనినిజాన్ని అధ్యయనం చేయడం, అన్వయించడం అలవాటైంది. రోజువారీ పనుల్లో

భాగంగానో, పని గురించి చర్చించే క్రమంలోనో, తమ పనిలో ఎదురయ్యే సమస్యల్ని పరిష్కరించడానికీ, అనుభవాల్ని క్రోడీకరించడానికీ అవసరమైన మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్, మావోల రచనల్ని పదే పదే సంప్రదించడం లేదా తరచుగా చదవడం జరుగుతూ ఉంటుంది. ఈ విధంగా క్రమక్రమంగా జీర్ణించుకున్న అధ్యయనాలు ఎంతో లోతుగా ఉండి, విజయాన్ని సులభం చేస్తాయి. సత్వర ఫలితాలనిస్తాయి. ఎందుకంటే ఈ అధ్యయనాల లక్ష్యం తాను నేర్చుకున్న దాన్ని అన్వయించడమే. తద్వారా వారి అవగాహన మరింత లోతుగా పెంపొందుతుంది. ఈ పద్ధతి క్రమంగా ప్రజల్లో వ్యాప్తి చెందింది. ముఖ్యంగా పార్టీ విధానాన్ని మెరుగ్గా అర్థం చేసుకుని పనిలో సృజనాత్మకంగా ఉండాలనుకునే కార్యకర్తలు కామ్రేడ్ మావో రచనల్ని చదివే ముఖ్యమైన కర్తవ్యాన్ని చేపట్టారు. వీరిలో ఇది మరింతగా వ్యాప్తి చెందింది. ఇది తప్పనిసరిగా మన పార్టీ సైద్ధాంతిక కృషిని అభివృద్ధి పరచి పెంపొందిస్తుందనడంలో సందేహం లేదు.

సజీవమైన భావాల్ని గ్రహించడానికి, నిర్దిష్టమైన సమస్యల్ని దృష్టిలో ఉంచుకుని అధ్యయనం కొనసాగించడానికీ పద్ధతి ప్రకారం సిద్ధాంతాన్ని అధ్యయనం చేయడం అసాధ్యమనో, అవసరమనో అర్థం కాదు. నిర్దిష్ట సమస్యలను దృష్టిలో ఉంచుకుని అధ్యయనం చేసినంతకాలం, వాటిని ఒకటొకటిగా అధ్యయనం చేసినంతకాలం, ప్రతీ నెలా, ప్రతిరోజూ సీరియస్‌గా, పట్టుదలగా దీనిని కొనసాగించినప్పుడు, క్రమంగా మార్క్సిజం-లెనినిజంలో పద్ధతి ప్రకారం జ్ఞానం సంపాదించగల్గుతాం. నేర్చుకోడానికి ఆత్రుతపడే, సిద్ధాంతంలోకి లోతుగా వెళ్ళే అలవాటును చేసుకోగల్గుతాం.

నిర్దిష్ట సమస్యలను దృష్టిలో ఉంచుకుని అధ్యయనం చేయాలంటే అర్థం పద్ధతి ప్రకారం అధ్యయనం చేయకూడదని కాదు. ప్రత్యేకంగా, ఉన్నతస్థాయి కార్యకర్తలూ, సైద్ధాంతిక, భావజాలపరమైన కార్యకర్తలూ కామ్రేడ్ మావో రచనల్ని మాత్రమే కాక కామ్రేడ్స్ మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్‌ల రచనల్నీ లోతుగా అధ్యయనం చేయాలి. దేశీయ, అంతర్జాతీయ పోరాట అవసరాలను తీర్చడం పద్ధతి ప్రకారం చేసే అధ్యయనం లక్ష్యంగా ఉంటుంది. ప్రస్తుతం సోషలిస్టు విప్లవ, సోషలిస్టు నిర్మాణ అవసరాలనూ, ముఖ్యంగా ఆధునిక రివిజనిజంతో పోరాడే క్రమంలో తలెత్తే అవసరాలనూ తీర్చడానికి అది ఉద్దేశింపబడాలి. పోరాటం మధ్యలోనే, ఒక లక్ష్యంతో మార్క్సిజం-లెనినిజాన్ని అధ్యయనం చేయడం ఇది. సిద్ధాంతాన్ని ఆచరణతో అన్వయించే అత్యుత్తమ అధ్యయన పద్ధతి ఇది.

కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో, సిద్ధాంతాన్ని ఆచరణ నుండి విడదీసే అలవాటు

పెరుగుతోంది. అందుకని సైద్ధాంతిక కృషికి ప్రథమ స్థానం ఇవ్వాలని మేం డిమాండ్ చేస్తున్నాం. అయితే అది వాస్తవం మీద ఆధారపడకుండా, ఆచరణ నుండి దూరమైపోతే మన సైద్ధాంతిక కృషి ఏ మాత్రం ప్రభావాన్ని వేయజాలదు. అది తన ప్రాముఖ్యతను కోల్పోతుంది. అందుకని ప్రజల అవసరాలను మరింతగా తీర్చేందుకూ, పరిస్థితుల అభివృద్ధి నుండి వచ్చే అవసరాలను మరింతగా తీర్చేవరకు మనం తరచుగా మన సైద్ధాంతిక కృషిని తనిఖీ చేస్తూ, అంచనా కడ్తూ ఉండాలి.

**(హంకీ(ఎర్రజెండా), నెం. 7-8, 1964)**

1. "కళలు, సాహిత్యం పై యేనాన్ ప్రసంగం" – కా. మావో
2. "సైన్స్ ఆఫ్ లాజిక్ అనే హెగిల్ గ్రంథంపై" – వి. ఐ. లెనిన్
3. "ప్రకృతిలోని గతి తర్కంకి పరిచయం" – కార్ల్‌మార్క్స్, ఫెడరిక్ ఎంగెల్స్
4. మావో సంకలిత రచనలు
5. అదే గ్రంథం
6. "హెగెల్ జ్యురిడికల్ తత్వశాస్త్రంపై విమర్శ–పరిచయం" – కారల్ మార్క్స్. మార్క్స్ – ఎంగెల్స్ సంకలిత రచనలు.
7. "ఒక ప్రచారకుని డైరీ నుండి" – వి. ఐ. లెనిన్ సంకలిత రచనలు
8. "జాతీయ యుద్ధంలో చైనా కమ్యూనిస్టు పార్టీ పాత్ర" – మావో (కా. మావో)
9. "నాయకత్వ పద్ధతులకు సంబంధించిన కొన్ని సమస్యలు" – కా. మావో.

Rajakeeya Krushi - Mana Jeevanaadi - Virasam

రాజకీయ కృషి:
మన కృషి అంతటికీ జీవనాడి

నిజానికి ఈ నాలుగు వ్యాసాలూ విడివిడిగా ఉన్నప్పటికీ ఇవన్నీ ఒకే గొలుసులో భాగాలు, ఒకే అవగాహనకు నాలుగు కోణాలు. మొదట మనిషికీ ఆయుధాలకూ మధ్య సంబంధం దగ్గర ప్రారంభించి, మానవ సమాజంలో సాధారణ కృషికీ రాజకీయ కృషికీ మధ్య సంబంధం మీదుగా, రాజకీయ కృషిలో సైద్ధాంతిక కృషికీ రోజువారీ పనులకీ మధ్య సంబంధాన్ని చర్చించి చివరికి ఆ సైద్ధాంతిక కృషి వాస్తవ ఆచరణ, సజీవ భావాల పునాదిగా ఉండాలనడం ద్వారా మనిషి దగ్గర ప్రారంభించి మనిషి దాకా సాగిన ఈ గొలుసు వ్యాసాలు కమ్యూనిస్టు ఆచరణలో, విప్లవోద్యమ నిర్మాణంలో, విప్లవానంతర సామ్యవాద సమాజ నిర్మాణంలో అత్యవసరంగా అలవరచుకోవలసిన దృక్పథాన్ని చాల సులభంగా, సునిశితంగా వివరిస్తాయి. ఈ వ్యాసాలు చదవడం, అధ్యయనం చేయడం, లోతుగా ఆకళించుకోవడం, మన అవగాహనలో భాగం చేసుకోవడం ఇవాళ్టి చారిత్రక అవసరం.